
# ధర్మ దీపికలు

కాట్రపాటి సుబ్బారావు



తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# ధర్మదీపికలు

రచయిత

కాట్రపాటి సుబ్బారావు

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు,

తిరుపతి.

2006

# DHARMA DEEPIKALU

(Collection of Editorials of 'Saptagiri')
Written by Katrapati Subba Rao

Edited by
**M. Rama Krishna Sastry**

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No : 448

| | | |
|---|---|---|
| First Edition | : | 1994 |
| Second Edition | : | 1999 |
| Re-Print | : | 2006 |

Copies : 5,000

Published by:
**Sri A.P.V.N. Sarma, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati — 517 507

*Cover Design:*
Jagadish

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముందుమాట

సప్తగిరి పత్రికకు కీ.శే. కాట్రపాటి సుబ్బారావుగారికి ఉన్న అనుబంధం ఈనాటిది కాదు. 1963లో వారు తిరుమల తిరుపతి దేవస్థానంలో అడుగుపెట్టి, 1994లో పదవీ విరమణ చేసేదాకా - ముప్పది యేళ్ళకు పైగా - సంపాదకత్వ కర్తవ్యాన్ని సమర్థతతో, సముచితంగా నిర్వహించారు. అంతకుముందు 'టి.టి.డి. బులెటిన్'గా ఉండిన ఈ పత్రిక, వారి ఆధ్వర్యంలోనే 1970లో "సప్తగిరి"గా వికసించి, విడివిడిగా అయిదు భాషల్లో వెలువడనారంభించింది.

శ్రీవారి దర్శనానికై వచ్చే యాత్రిక బృందానికి, దేవస్థానముల పరిపాలన రంగానికి మధ్య వారధిగా పనిచేస్తూ, సుబ్బారావుగారు ప్రతినెలా పత్రికలో సంపాదకీయాలు వ్రాశారు. వాటిలో ఆ యా సందర్భాలకు తగ్గట్టుగా, ఆ యా నెలసరి అభిప్రాయ సరళిని ప్రతిబింబించేవిగా ఎక్కువ రచనలు ఉన్నా, కొన్ని మాత్రం సార్వజనీనమైన సాహితీసౌరభంతో నిండినవి. మఱికొన్ని సార్వకాలికమైనవి. ఆ రచనలు ఆలోచనలు రేకెత్తించే కొత్తదనంతో మౌలిక జీవనవిధానాలను అన్వేషింపజేసేవిగా ఉన్నాయి.

ఈ తరహా రచనల్లో ముఖ్యమైనవాటిని సేకరించి, సుబ్బారావుగారు పదవీ విరమణ చేసే (30-6-1994)నాటికి "ధర్మదీపికలు" - అనే పేరుతో పుస్తకరూపంలో ప్రచురించటం జరిగింది.

సనాతన ధర్మం, సంస్కృతి, ఏకేశ్వరవాదం, సంఘ జీవనం - మొదలైన అనేక అంశాలపై దూరదృష్టితో, సహానుభూతితో మథనం జరిపి, సుబ్బారావుగారు కొన్ని నిత్యసత్యాలను ఇందులో ప్రస్ఫుటంగా చెప్పడం జరిగింది. ఆర్ష విజ్ఞానంలో పరిణతి, ఆధునిక మనస్తత్త్వం - ఈ రెండింటి చక్కని సమన్వయం ఈ రచనల్లో అడుగడుగున గోచరిస్తుంది.

ఈ పుస్తకం ముద్రణ ప్రతులన్నీ చెల్లిపోయినందున, దీనిని పునర్ముద్రిస్తున్నాము. సహృదయ పాఠకులు ఎప్పటిలాగే ఈ ప్రచురణను సమాదరిస్తారని ఆశిస్తున్నాం.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# నివేదన

సప్తగిరి సంపాదకులు కాట్రపాటి సుబ్బారావుగారు తెలుగు పాఠక లోకానికి పాతికేళ్లనుండి పరిచితులు. సప్తగిరి పత్రిక ద్వారా ఆంధ్రదేశంలోనే కాక, మరి నాలుగు భాషా ప్రాంతాలలో జనజీవన సరళిలో మిళితమై, నెల నెలా ఎదురుచూచి చదివే వాతావరణాన్ని నిర్మించారు. ఆయన వ్రాసిన కొన్ని సంపాదకీయాలను ఒక పుస్తక రూపంలో ఇవ్వడం ఇక్కడ జరిగింది. ఈ సంపుటానికి రచనలను ఎన్నుకునేటప్పుడు కాలసూచన ప్రమాద దోషం లేనివాటిని, పునరుక్తులు లేనివాటిని మాత్రమే ఎన్నుకోవట మైనది. ఐనా అక్కడక్కడ పునరుక్తులు దొర్లివుంటే అవి విషయావగాహనకు సహకరించేవిగా ఉంటాయి.

ఈ పుస్తక ప్రచురణకు తోడ్పడ్డవారు సప్తగిరి ఉపసంపాదకులు శ్రీ బి.ఎన్. శ్రీనివాసన్, రీసెర్చ్ అసిస్టెంటు శ్రీ కోరాడరామకృష్ణ, సంపాదకులు శ్రీ ఎల్లోరా, తదితరులు. అతి తక్కువ వ్యవధిలో ముద్రించిన తి.తి. దేవస్థానం ప్రెస్ సిబ్బందికి కృతజ్ఞతలు.

తిరుపతి, 22-6-1994.

ములుకుట్ల రామకృష్ణశాస్త్రి,
తి.తి.దే. ప్రచురణ విభాగాధికారి.

# మనవి

'ధర్మదీపికలు' పునర్ముద్రిస్తున్న సందర్భంగా కీ॥శే॥ కాట్రపాటి సుబ్బారావుగారి మరో సంపాదకీయం అదనంగా ఇందులో చేర్చడం జరిగింది.

తిరుపతి, 5-5-1999.

ప్రొ॥ కె.జె. కృష్ణమూర్తి,
తి.తి.దే. ప్రచురణ విభాగాధికారి.

# సింహపీఠి

## (రమణీయార్థప్రతిపాదక శబ్దః కావ్యమ్)

అని పండితరాయల సిద్ధాంతము. నైసర్గిక శక్తి, బహుకావ్య శాస్త్ర ద్యవేక్షణమువలన గలిగిన నైపుణ్యము, అభ్యాసము ననువాని త్రివేణి సంగమమున గవితాతీర్థ రాజము వెలయును.

కావ్యఘటనానుకూల శబ్దార్థోపస్థితి రూప మగు ప్రతిభ యిందు ముఖ్యమయినది. ఇది కొందరిలో నొక్కొక్క వయసునందు బహిర్గత మగుచుండును. నివురు గప్పిన నిప్పువలెనున్న యీ ప్రజ్ఞ యొకొకప్పుడు దేవతానుగ్రహాదులచే బ్రతిబంధకాదులు తొలంగి యుద్గత మగుచుండును. వ్యాసవాల్మీకాదులు ప్రౌఢనిర్భరవయః పరిపాకదశను చేరుకొన్న తర్వాతనే భవ్యకవితా భగీరథులయి యుండుట విజ్ఞులకు విదితచరము గదా!

శ్రీమాన్ కె.టి.ఎల్. నరసింహాచార్యులు గారు చిరకాలము శారదా మాతృసేవలో దమజీవితము పండించుకొనినారు. తమరచనల ప్రచురణ నాపి యితరుల కృతలకే నీరాజనము లొసగి వానికి సూర్యలోక భాగ్యము గల్గించిన సుకృతి యీ సాహితీ సుగతుడు.

ఈయన విద్యాతపస్వి ; కాదుకాదు- "విద్యావిశారదుడు" మధురస నిష్యందములు, సలక్షణగద్యకృతులు అయిన 'లోకమాత' 'అమరజ్యోతి' మొదలగు రచనలు చదివిన తర్వాత వీరియెడ నీ బిరుద మన్వర్థమని నాకు దృఢప్రత్యయము జనించినది. వీరి 'వకుళభూషణ నాయకి' ప్రౌఢగద్యకావ్య మని విజ్ఞుల ప్రశంస లందుకొన్న యుద్గ్రంథము!

బహుశ్రుతులగు వీరిని 'ఉపనిషదుద్యానకోకిల' యనుటతోపాటు 'సాహిత్యోద్యానకోకిల' యనియు ననవచ్చును. శ్రీ గోదా గ్రంథమాల ద్వారా వీరొనర్చిన సారస్వతారాధన యభిజ్ఞులమెప్పును దోచుకొనుట దీనికి

ఈ సంపాదకీయ మందారమాలకు ప్రేరకులు, కూర్పరులు నా సహో ద్యోగులు, శ్రీ ఎస్.ఎస్. రామమూర్తి, శ్రీ బి.ఎన్. శ్రీనివాసన్, సహోద్యోగి సహచరులు, రచయిత, రంగప్రయోక్త, నటుడు శ్రీ టి.ఎల్.సుబ్బారావు,--

అందరూ రాస్తున్నారు అని అనుకోకుండా అమితమైన ఆదరణతో ఈ గ్రంథ ముద్రణకు అదేశించిన నిపుణుల సంఘమండలి అధ్యక్షుడు శ్రీ ఎ.చెంగల్ రెడ్డిగారు, కార్యనిర్వహణాధికారి శ్రీ డి.వి.ఎల్.ఎన్.మూర్తి,--

అనతి కాలంలో కొత్త మెరుపులు చూపేటట్లు ముద్రించగలమని నిరూపించిన మేనేజరు శ్రీ మోహన్‌రావు,--

నా అధికారపరిధి ఆచరణకు ఆవరణగా నిల్చి అవకాశ మున్నంతవరకు ఆప్యాయతతో సహకార మందించిన శ్రీయుతులు శ్రీ ఎం.రామకృష్ణశాస్త్రి, శ్రీ ఎల్లోరా, శ్రీ డి.నాగసిద్దారెడ్డి,--

ఇలా వీరందరికీ కాక, ఇంకెందరికో నా కృతజ్ఞతాభివందనాలు అర్పించవలసి వుంది.

ఈ పాతిక పరువాల పరుగు జీవితంలో 'ఈ రచయితకు' తెలిసేటట్లు తెలియకుండా ఎందరు సహకారాలను అందించారో అందరూ....

అందుకోండి నా వందనాలు

కురిపించండి మీ ఆశీస్సుల చందనాలు

తిరుపతి,
22-6-1994.

కాట్రపాటి సుబ్బారావు,
సంపాదకుడు - సప్తగిరి.

# విషయ సూచిక


1. గణపతి 1
2. వేదవాఙ్మయం 3
3. మంత్రాలెందుకు? 6
4. ఏకం సత్ 9
5. ఆది దంపతులు 12
6. దశావతారం 13
7. శ్రీరాముడు 17
8. వామనుడు 20
9. ప్రహ్లాద-హిరణ్యకశిపులు 22
10. దత్తాత్రేయ 24
11. హరిహర రూపం 27
12. త్రినేత్రుడు 29
13. శంకరశ్శాస్మి 30
14. శివతత్త్వం 32
15. వర్షచక్రం 34
16. మకర సంక్రమణం 36
17. వైశాఖి 39
18. సౌర సప్తమి 41
19. సూర్యనారాయణుడు 43
20. దీపావళి 46
21. రామాయణ పాత్రలు 49
22. ఆంజనేయుడు 52
23. రామాయణ - భారతాలు 54
24. భారతం -- కృష్ణుడు 57
25. గీతార్థం 60
26. పత్రం -- పుష్పం 62
27. సంశయాత్ములు 64
28. గురువు 67

29. విద్యయా అమృతమశ్నుతే 69
30. శిష్య విత్తాపహారకః 72
31. విద్యా బోధన 74
32. ముగ్గురు ఆళ్వారులు 77
33. రామానుజాచార్యులు 79
34. తాళ్లపాక కవులు 81
35. వేదాంత దేశికులు 84
36. మీరా 86
37. అన్నమయ్య వారసులు 88
38. ఉత్సవాలు 90
39. ధర్మం 92
40. గుడికెందుకు వెళ్ళాలి? 95
41. మతం 96
42. అన్నయజ్ఞం 99
43. తన కోపం 101
44. లాలన - పాలన 104
45. మాతృత్వం 106
46. సహధర్మచరీ తవ 109
47. వరకట్నం 111
48. మనం పోగొట్టుకున్నది 114
49. మదిర -- మత్తు 117
50. సమత 120
51. వృక్షో రక్షతి -- 122
52. బొమ్మా - బొరుసు 125


* * *

తాన్నైనా చిరునవ్వులో చూడటం నేర్చుకుంటాడు. రామావతారం ఎందుకు బ్రతకాలి అన్న ఆదర్శజీవనాన్ని చూపిస్తే, కృష్ణావతారం తన చేతికి మట్టంటుకోకుండా ఎలా బ్రతకాలన్న తంత్రవిజ్ఞానాన్ని ప్రబోధిస్తున్నది.

సమాజంలోని అకృత్యాలకు ఆధారం ఏదో తన తపన స్ఫురణలకు తగిలినప్పుడు ఆ సత్యాన్ని బోధ చేయడానికి బుద్ధిమంతుడు ప్రయత్నిస్తాడు. కాని అనంతకాలానికి సంబంధించిన సమస్యలు కూడా అనంతంగా సాగుతుంటాయి. దాని నిరోధ ప్రయత్నమూ అచంచలంగా సాగుతునే ఉంటుంది. ఈ అవతారం ఒక వ్యక్తికి గాక, ఆ వ్యక్తి ధర్మజిజ్ఞాసకు ప్రతీక. ఈ సత్యాన్వేషకులందరు బుద్ధావతారులే.

ఇవికాక అవతార ప్రయోజనం నిర్ధారణం లేదు కనుక, అవకాశం కలియుగాంతం వరకు ఉంది. మనకు కల్క్యవతారం అందేది ఎప్పుడో.

ఇన్ని విశేషాలకు మూలమైన ఆ చతుర్భుజ తత్త్వం అన్ని వేషాలకు భిన్నమైంది, అతి సౌమ్యమైంది. దౌష్ట్యం చావటానికి కూడా శక్తిలేని దుర్బలుల పాలపడింది కనుక పరమాత్మ కూడా నారాయణ ప్రతిరూపంగా స్వామిపుష్కరిణీ తీరాన అవతరించి బాణాల తూట్లు కాకుండా, సమస్యల సూదిపోట్లతో మనుష్యుల్ని మంచి మార్గాన్ని మళ్ళించాలని ప్రయత్నిస్తూ అందరూ దేవుళ్లనూ ఆ బాటన నడిపిస్తున్నాడు.

* * *

# 7. శ్రీరాముడు

అభయం సర్వభూతేభ్యో దదా మ్యేత ద్వ్రతం మమ, . . . యది వా రావణ స్స్వయమ్.

ఆపన్నుడైనవాడు తన శత్రువుడైన రావణుడైనా సరే అభయమిస్తానన్నది రాఘవరాముని నీతి.

'అభయం సర్వజాతిభ్యః' అన్నది ఆ జాతి నీతి. అందువల్లనే ఈ దేశం అనాదిగా వివిధ సంస్కృతుల ప్రజల ఉనికికి ఆలవాలమై పోషిస్తూ వచ్చింది. కండబలం ఆధారంగా దండయాత్రలు జరిపిన వారికి ఎదురుగా దండి మగలను నిలిపి జాతిశక్తిని నిరూపించుకొన్నదే తప్ప సాధారణ స్థితిలో అందరికీ అభయం ఇచ్చి నిల్చుకొన్నది. అందువల్లనే ఈ అనంత జాతీయతా చైతన్యస్రవంతిలో వివిధసంస్కృతులు అంతర్వాహినులై భారతజాతిగా రూపొందాయి. భిన్నత్వంలో ఒక ఐక్యత ఈ జాతి విశిష్ట గుణంగా నిరూపించాయి.

కాని ఈ జాతి సమైక్య భావాన్ని పరంపరానుగత ప్రాప్తం చేయటానికి, ఎందరు మహనీయులు ఎన్ని విధాల శ్రమించి, ఎన్నెన్ని త్యాగాలు చేసి, కాలవాహినికి తీరభూములయ్యారో, అవసరమాత్రాధ్యయన శీలురమైన మన కవగతం కాదు. మనకు తెలిసిందల్లా ఇది మనమే సాధించామనీ, పాతంతా ఒక రోత అనీ.

నిజానికి కేవలం బోధన ద్వారా కాక, ఆచరణ ద్వారా సుహిత సుస్థిత సమాజ స్థాపనకు మూలస్తంభాలైన మహనీయులు భగవాన్ రాముడు, భగవద్రామానుజులూ అంటే ఆశ్చర్యం లేదు. అతిశయోక్తి కాదు.

మనిషి మనిషిలోని మనిషిని గుర్తించి గౌరవించగలగటం వల్లనే గొప్పతనం ఉంది. కాని ఆస్తులు అంతరాల వల్ల కాదు.

శ్రీరాముని తండ్రి దేవతలకే సహాయపడ్డవాడు. ఇక శ్రీరాముడు దేవ భయంకరులైన రాక్షసులను ముక్కుపచ్చలారని పసితనంలోనే ముప్పతిప్పలు పెట్టిన వీరుడు. కాని రాచరికపు అహంకారం కన్న ఆత్మీయతపైనే అతనికి అభిమానం అపారం. బోయరాజు గుహుడు, వానరుడు సుగ్రీవుడు, రాక్షస వంశంలోని విభీషణుడు, వీరందరూ వారి వారి సామాజిక స్థాయిలలో నియమాలతో పనిలేకుండా రాముడి ప్రీతి పాత్రులయ్యారు. అందర్నీ రాముడు భ్రాతృభావంతో ఆదరించాడు. చివరకు శబరి ఇచ్చిన పళ్ళు కూడా

స్వీకరించాడు. ఇక్కడ శబరి సామాజిక స్థితికన్న ఆత్మీయతే రాముణ్ణి ఆకర్షించింది. ఇవన్నీ ఒక ఎత్తు. రావణుని పట్ల రాముని ప్రవర్తన ఒక ఎత్తు. తన భార్య నపహరించిన వ్యక్తిని కూడా, శరణు అంటే క్షమించగల ఔదార్యం రామచంద్రుడిది. పశ్చాత్తాపం, క్షమాభావాలతో నరుడు నారాయణుడికి దగ్గరౌతాడని, ఇవి లౌకిక నిబంధనల కలితాలని రాముడు నడిచి నిరూపించిన సత్యం.

కాని అల్పులం దుర్బలులమైన మనం అవన్నీ అవతార పురుషులకే తప్ప మనకు కాదనుకుని దైవీగుణాలతో చేర్చేశాం. పూజలతో తృప్తి పడుతున్నాం.

ఆ తర్వాత కాలంలో ఎందరో మహనీయులు జాతి సమైక్యతకు భిన్నత్వంలో ఏకత్వం సాధించటానికి ఎన్నో విధాల ప్రయత్నించినా అగ్రతాంబూలం రామానుజులవారికే చెల్లాలి.

స్థిరసంకల్పం, ధృఢదీక్షతో సమాజాన్ని సంస్కరించాలని భగవద్రామా నుజులు కూరిమితో శ్రమించారు. శ్రీరాముని మాదిరిగా లోకానికి ఆదర్శప్రాయు లయ్యారు. వింటే సీసం పోయ్యాలనే వింత రోజులలో అతి గోప్యంగా వుంటున్న తిరుమంత్రాన్ని గోపురాగ్రం నుంచి బహుళో పయుక్తంగా ప్రచారం చేయటం దళితజనులపట్ల వారికిగల అనురక్తికి సాక్ష్యం. వర్ణంకన్న గుణమే మిన్న యని వారు భావించారు. అసలు భాగవతసేవకు వర్ణవిభేదాలు ఎంత ప్రతిబంధకమో గుర్తించటమే, వారి తురీయాశ్రమ స్వీకారానికి త్రోవ చూపిందని విజ్ఞులంటారు. మనకు బాగా తెలిసిందీ, కర్ణాటక ప్రపన్నామృతంలో కన్పించే బీబీనాంచారి కథ. దైవిక సంపత్సమీకరణకు వర్గ వర్ణాది భేదం లేదనీ యథాయోగ్యంగా అందరూ తరించవచ్చనీ తెలియజేస్తున్నది. శంకరాద్వైతాన్ని సగుణంచేసి, విశిష్టాద్వైతముగా నిరూపించిన రామానుజులకు కేవలం వేదభాష్య వేదాంత ప్రవక్తగానే కాక, వర్గ, వర్ణ విద్వేష రహిత సమాజ వ్యవస్థాపకులుగా కూడా జాతి చరిత్ర పుటలలో చెరగని స్థానం ఉంది.

కాని ఆ మహనీయుల సమరస భావం, సహన సౌశీల్యాలు మన కవగతమైనా చాలు. మనం కావల్సిన వాటిని వదలి పోవలసిన వాటికోసం పోట్లాడుకోం.

యో నిత్య మచ్యుత పదామ్బుజయుగ్మరుక్మ
వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే,
అస్మద్గురో ర్భగవతోఽస్య దయైకసిన్ధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే.

* * *

# 8. వామనుడు

మన కుంటే మూడుసార్లు తింటాం, ముప్పైచోట్ల తిరుగుతాం, మూడంతస్తుల మేడలెక్కి మురిసిపోతాం. దాంట్లో తప్పేమీ లేదు. కాని ఎదుటివాడిని మన ధనమదాలతో తూచాలనుకుండే మాత్రం మనం పాతాళంలో పడిపోక తప్పదు. అందుకే అహంకార మంత ప్రమాదమైంది మరొకటి లేదంటుంది వామనావతారం.

నిజానికి పుట్టుక రాక్షసజాతిలోనే అయినా అపరతేజ స్సంపన్నుడు, దైవీశక్తిపరుడు, మహాదానశీలుడు బలిచక్రవర్తి. తన బలంకన్న దైవబలం గొప్పదని నమ్మి తెలివిగా నడుచుకోగల రాజకీయ విజ్ఞాని. ప్రహ్లాదుని మనుమడుగా, మహావిష్ణు పారమ్యాన్ని గ్రహించి ప్రస్తుతించే ఆధ్యాత్మిక విదుడు.

కాని దాతకు సాధారణంగా అహంకారపుపాలు అంతో ఇంతో ఎక్కువగానే ఉంటుంది. బలికి కూడా అంతే.

ప్రతి ప్రాణి పరమాత్మ ప్రతిరూపమని, అర్థిలోనూ అనంత పరిజ్ఞానం అణిగి ఉంటుందని వినయరహిత దాన శక్తితో దాన్ని కొలవాలనుకుంటే అది ప్రతిబుద్ధమై పరమేశ్వర స్వరూపాన్ని ప్రకటిస్తుందని మర్చిపోయి

త్యాగియా వేంకట తాత సుధీమణి
వ్యాకరణము నేర్పె బావగారు,
హారీతగోత్రుండ యాజుషశాఖలో
వరలితి బ్రాహ్మికిఁ బరమహితుఁడ;

వాణి నాఁవాణిగా నిట్లు ప్రకట మగుచు
బాణిఁ గైకొని లిఖియించె భవ్యశైలి
విష్ణు భక్తుల చరితంబు విశదమతిని
నారసింహుండ విద్యావిశారదుండ.

అ, ఇ, ఉ, ణ్ణుతో నక్షరాభ్యాసమును జేసి
యమరంబు నేర్పె నాయనుఁగుఁదండ్రి
బమ్మెరపోతన భాగవతమ్మును
బఠియించినాఁడను బాల్యమందె
పాణినీయంబుతోపాటుగా నేర్పె రా
బాషలో మర్మముల్ బావగారె
గ్రంథబంధనరూపకళ నేర్పినాఁడను
కరతలామలకంబు కావ్యరచన

సంతతాధ్యాపనంబు నా సహజవృత్తి
తమిళవంగోత్కళాదులు నమరియుండు
సరవి సాహిత్యరత్న భాషాప్రవీణ
పట్టములఁ గొంటి సుకవుల ప్రాపుగంటి.

విద్యావిశ్రుత ముపనిష
దుద్యానపుఁ గోకిల మ్మిదో మధురముగాఁ

బద్యము లాలిపించును
సద్యఃపరనిర్వృతిఁ గను సరసులు వినుఁడీ!

పద్యంబును గద్యంబును
హృద్యంబుగఁ జెప్పగల యహీనప్రతిభా
విద్యావినోది నగుదును
సద్యఃస్ఫురణను వెలుంగు సత్కవిసఖుడన్.

పద్యరచనలో నాయన
వద్యంబగు నైపుణ్యమును వాగ్గుంఫనమున్
హృద్యంబగు ప్రాక్తనకవి
పద్యానుసరణము గనుఁడు భావుకులారా!

ఏవేవో కలలంద గాంచితిని గానీ చారుకావ్యేందిరా
సేవం జేయఁగలాఁడ నంచు మదిలోఁ జింతింపలేనైతిఁ, ద్వ
ద్భావాధీనకటాక్ష మిట్టిదిగనీ భావింతు సారస్వత
శ్రీవాత్సల్యము జెందినాఁడ నిను సంసేవించి నారాయణా!

## భక్తి ప్రణుతి

మంత్రమంత్రార్థముల్ మమతతోఁ బఠియించు,
భగవద్విషయవీథిఁ బర్యటించు,
శ్రీహరికైంకర్య చింతనాశీలమ్మై
సమయంబు గడపుచు సాగుచుండు,

అడ్డులేనందువల్ల అదుపు తప్పి, ఊహాలోకాల్లో విహరిస్తూ ఈ జడేశ్వరుడు జగదీశ్వరుడుగా చాటుకున్నాడు.

కాని, బ్రతుకు బొమ్మలాటలో గాలి పోయటం తీయటంలో ఆరితేరిన ఆటగానికి, ఈ కీలుబొమ్మల మాటలు, ఆటలు, నీతులు, కూతలు, వినటం అదో వేడుక. అందుకే 'వాడెక్కడ' అని ఎగిరిపడేవాణ్ణి, ఆయాసం వచ్చేదాక అరవనీ అనుకొని దోబూచులాడుతుంటాడు. మరొకప్రక్క తన విశ్వవ్యాపకతను, సర్వశక్తుడననే సత్యాన్ని భంగ్యంతరంగా చూపిస్తుంటాడు. కాని, తన అరువు బరువులన్నీ అసలు సొమ్ములనుకొనే 'మరబొమ్మ' 'మనిషి' అంతా తానేనని అహంకరించి, ఆదిపురుషుని అవమానించి, విశ్వ ధర్మాలపై విలయతాండవం చేసినప్పుడు తెరమరుగు సూత్రధారి తానొక పాత్ర ధరించి ఆ ఆగడాల ఆటకు భరతవాక్యం, నవజీవన నాటకానికి నాంది పలుకుతాడు.

ఒక రకంగా, నరసింహావతార కథ నరులకు చెప్పే దిదే!

"నీరాగార నివిష్ట పాంథుల క్రియన్ విక్కంబు సంసార సం
వారుల్ వత్తురు గూడి విత్తురు సదా సంగంబు లే దొక్కచో"

అనే జీవన తత్త్వాన్ని ఆకళింపుకొని, అందరికీ చెప్పిన హిరణ్యకశిపుడు ఎన్నెన్ని మార్గాలలో మృత్యువు రా దగ్గదో అన్ని మార్గాల లోనూ చావులేకుండా వరాలు పొందీ, కంచుకోట కట్టుకున్నా ననుకొని తానే దైవాన్ని అన్నంతటి అహంకారాన్ని పెంచుకొని, హరిద్వేషిగా మారాడు. కాని, లోకములన్నీ గడియలో జయించిన ఆతనికి, ఇంట శత్రువు లార్గురున్నారని, వారిని జయిస్తే సాధ్యంకానిది లేదని కొడుకు ప్రహ్లాదుడు చెప్పినా పెడచెవిని పెట్టాడు. ఎన్నివిధాల శిక్షించినా ప్రహ్లాదుడు చావలేదే అని కోపం వచ్చిందే కాని, విష్ణుమహిమలను, కన్పిస్తున్న వాటిని కూడా తెలిసికొనలేకపోయాడు. మితిమించిన అహంకారంతో సత్యాన్వేషణ చేసి, తనలాంటి వాడికి సత్యం ఎంత భయంకరంగా, క్రూరంగా, తన విజ్ఞానానికి

అతీతంగా వుంటుందో తెలుసుకోగలిగాడు. అందుకే సత్యస్వరూపుడైన నారాయణుడు హిరణ్యకశిపుదున్న రక్షవర వలయాని కతీతంగా నరహరిగా ఆవిర్భవించి ఆ జీవితానికి భరతవాక్యం పలికాడు.

కాని పరతత్త్వావగాహన కల ప్రహ్లాదుడు 'నీ నరసింగాకృతి జూచి నే వెరువ' అంటూ ఆ బాహిర భయంకర నరసింహ రూపం వెనుక ఉన్న దివ్య కరుణామయ తత్త్వాన్ని సందర్శించి తరించగలిగాడు దృష్టిభేదంలో ఉన్న అదృష్టభేదం అలాంటిది మరి.

ఇక మనం అతి సగటు మానవులం. ఆ తండ్రి ఔద్ధత్యం కాని ఈ కొడుకుకున్న తత్త్వదార్శనికత కాని మనకు లేవు. బ్రతుకంటే భయం, చావంటే అసహ్యం గల మనం ప్రతిదినం పైకి క్రిందికీ తిరుగుతుంటాం. పరం పాడు కాకుండా, ఇహంలో ఇంతో అంతో సార్థక జీవనం గడపాలంటే ఆపదలలో ఆదుకొని చేయిచ్చి చేదుకొనే దేవుడు మనకోసం దిగి రావాల్సిందే. అందుకే ఆయనను ప్రార్థిద్దాం.

సంసార యోగీ సకలేప్సిత నిత్యకర్మ
సంప్రాప్య దుఃఖ సకలేంద్రియ మృత్యునాశ,
సంకల్ప సింధుతనయా కుచకుంకుమాంక
లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్.

* * *

# 10. దత్తాత్రేయ

ధర్మానికి ధిక్కారం అధర్మానికి అభ్యుత్థానం కల్గినప్పుడు తనను తానే అవతరింపచేసుకుంటానని భగవానుడు గీతలో సెలవిచ్చారు. దుష్టజన దర్పదళనానికి మత్స్య, వరాహ, నారసింహ, వామన, పరశురామ, కృష్ణా ద్యవతారములు, లోకహిత కార్యం కోసం కూర్మావతారాన్ని,

ధర్మబోధకోసం కపిల, ఋషభ బుద్ధాద్యవతారాలు ధరించటం జరిగింది. మహావిష్ణువుకు సంబంధించిన ఈ అవతార సామ్యమే హరావతారాలు శివలీలకు అనువు కల్పించినది. నిజానికి శ్రీమన్నారాయణుడికి చతుర్విం శత్యవతారాలున్నాయని శాస్త్రవిదులు వక్కాణించారు.

ఇవికాక దైవ వైవిధ్యం, ఏకత్వం సాధించుకొన్న రూపాలు కూడా మనకు కన్పిస్తున్నాయి. శివకేశవాంశ సంభూతమైన ధర్మశాస్త (అయ్యప్ప), దత్తాత్రేయస్వామి ఈ కోవకు చెందినవి. ఆ శబరిగిరీశుడు హరిహరసుతుడని ప్రసిద్ధి.

ఇక మిగిలినది దత్తాత్రేయావతారం. ఈ అవతార వర్ణనలోగాని, అర్చనలోగాని అతి విశేష ప్రాముఖ్యంగల విషయాలెన్నో వున్నాయి.

అత్రి అనసూయలకు వరప్రసాదియైన దత్తాత్రేయుల సంభవం త్రిమూర్త్యంశరూపమని స్పష్టంగా తెలుస్తున్నదే. ఆయన ఆయుధాలు కూడా అందు కనుగుణంగానే వున్నాయి. ఆయన మహాజ్ఞాని, ఇహపరాలు ప్రసాదించే సర్వసమర్థుడనీ శాస్త్రాలు వర్ణించాయి.

దత్తాత్రేయుని ఆకార విశేషాలలో కూడా మనకు అనేక సంకేతాలు కన్పిస్తాయి. దత్తాత్రేయావతార చిత్రణలో పవిత్రాతిపవిత్ర భావనాస్పదమైన గోమాతతో పాటు నిత్యం శునక చతుష్టయం పరివేష్టించివున్నట్లు కన్పిస్తుంది. ఇవి నాలుగు వేదాలు ప్రతి రూపాలని విజ్ఞులు అంటారు. అంటే అవి అనంత విజ్ఞానానికి ఆభాసరూపాలన్నమాట. సత్యదర్శనం కోరే మానవుడు బాహిర సౌందర్యంకన్న ఆత్మసౌందర్యానికే ప్రాధాన్యం ఇచ్చి నిగ్రహంతో శ్రమిస్తే తప్ప సత్యదర్శనం కాదు. ఇది ఆచరణలో గురుపరీక్ష అన్నమాట.

దత్తాత్రేయులవారు సాధారణంగా బ్రహ్మచారి అన్న భావన మనకు కలుగుతుంది. కాని దత్తాత్రేయ పూర్వమాలలో మధుమతీ సహిత దత్తాత్రేయస్వామిగా వర్ణించారు. నిజానికి దత్తాత్రేయాష్టోత్తర శతనామ స్తోత్రం ఆయనను బ్రహ్మ, విష్ణు, శివాత్మకుడని, నానారూపధరుడని

వర్ణించింది. ఆయన సంగీతప్రియతను గురించి నాదబ్రహ్మైక నిష్ఠుడని మృదంగ రవరసికుడని వర్ణించబడింది.

దత్తాత్రేయ వజ్రకవచంలో ఈ కవచాన్ని ఎన్ని సార్లు జపిస్తే ఏ యే ఫలాలో, ఐహికాముష్మిక వివరణలతో వుంది. ఇక అనుష్ఠాన విషయంలో "నిద్రాభిక్షే స్నాన శౌచే, నేచ్ఛామి న కరోమిచ, ద్రష్టారశ్చే త్కల్పయన్తు, కిం మే స్యా దన్యకల్పనాత్" అని, నిద్రాన్న భిక్షాస్నాన శౌచాదులు ప్రధానమైనవి కావని అయినా, లోకసంగ్రహం, అనుష్ఠానవిధులు అన్యులకోసం కల్పించాలని దత్తాత్రేయులే సెలవిచ్చినట్లు అవధూతోపనిషత్తులో వుంది. అంటే శ్రద్ధారహిత బాహ్యాడంబరం కన్న శ్రద్ధాభరితానుష్ఠానమే సత్ఫలదం అన్నమాట. బాహిరశుద్ధి కన్న అంతశ్శుద్ధి ఆవశ్యకం అని తాత్పర్యం.

అత్ర్యనసూయాసుతుడు దత్తాత్రేయుడు సర్వదేవతా స్వరూపుడనటానికి ఇంకొక ఉదాహరణ దత్తాత్రేయార్చనా విధానంలో కన్పిస్తుంది. అన్ని పూజావిధానాలకన్న భిన్నంగా "సహస్రశీర్షా పురుషః" అన్న నారాయణ సూక్తంతోపాటు శ్రీసూక్త సంపుటీకరణం కూడా నిర్వహించబడింది.

దత్తాత్రేయు డంతటి సర్వదేవతాస్వరూపుడు కనుకనే ఆయన అర్చన అవధూత, నాథసంప్రదాయావిష్కరణకు ఆలంబనమైంది.

ఏది ఏమైనా దత్తాత్రేయమహర్షి లేదా మహాశక్తి అర్చావిధానము సాత్త్వికజ్ఞాన సాధనైకగమ్యాలు.

ఇలా సర్వ జీవముద్ధరణైక మంత్ర ద్రష్ట లెందరో వున్నారు. ఇహంలో జనసేవలో ఇష్టుడుగా బ్రతికి, చరమ పరమపదాన్ని చేరాలని బోధించే ఆ మహితాత్ములలో కొందరికైనా ఒక కోటి దణ్ణాలు పెట్టుకుందాం.

పీతాంబరాలంకృత పృష్ఠభాగం భస్మావకుంఠామల రుక్మదేహమ్,
విద్యుత్ప్రభా పింగ జటాభిరామం శ్రీదత్తయోగీశ మహం భజామి.

* * *

# 11. హరిహర రూపం

దేహి-దేహం-ఒకటా రెండా? ఈ చర్చ అనాదిగా వస్తూన్నదే. ఆధ్యాత్మవిదులైన వాళ్ళు దేహంలో ఉన్నా, ఇంటాయన ఇంటికి వేరైనట్లే, వేరే వేరేనని అన్నారు. అతివాస్తవికవాదులు దేహి దేహం ఒకటే అని దైహిక పరిణామ దశలఫలంగా ఈ దేహగేహం పనికిరానిదై పోతుందని, ఆ జీర్ణ శీర్ణ స్థితినే మన మామూలు భాషలో మృత్యువంటారనీ వాదిస్తూ వచ్చారు. కాని, చరాచర జగత్తులో వస్తుతత్త్వ ప్రతిభాసకమైన ఒక కళ అనేది ఉందనీ, ఆ కళనే జీవం అంటారనీ, అది అంతర్నిహితంగా వుండి ఆడిస్తున్నంతవరకు శివము శివకరము శివతరమూ అయినది, ఆ కళా రహితమైనప్పుడు జడమై, శివేతరంగా మారి ధూళిలో కలుస్తున్నదన్నది గుర్తిస్తే ఇల్లూ, ఇంటాయన ఒకటనుకోవటం కష్టం. ఇలా యీ జీవతత్త్వం వస్త్వేతరంగా విశ్వవ్యాప్తమై ఉన్నందువల్లనే, ఆ సర్వాంతర్యామిత్వాన్ని శివపరంగా కేశవపరంగా అన్వయిస్తూ ఆరాధన చేసేవారు. దేహాతిరిక్తమైన శుద్ధచైతన్యం ఒకటేనని, ఉపాధిభేదం వల్ల వస్తుబాహుళ్యంగా ఆభాసిస్తున్నదని భావించారు. అందువల్లనే హరిహరతత్త్వాలలో దేన్ని సంభావించినా, సర్వ వ్యాపక చైతన్యస్వారోపణ వల్ల ఆధ్యాత్మిక సందేశాన్ని, లౌకిక వ్యవస్థకుగాను సమతాధర్మాన్ని ప్రవచించి ప్రవహింపజేశారు.

యజుర్వేదీయ శతరుద్రీయంలోని నమకభాగంలో, చరాచర విశ్వంలోని వివిధ ధర్మాలతో కర్మలతో ప్రాతినిధ్యం వహించే దేవతారూప పరతత్త్వ ప్రణామంతోపాటు, విశాలసృష్టిలోని జీవజాలం అంతటిపట్ల గౌరవ ప్రకటనం కన్పిస్తుంది. ఇక చమకభాగంలోని మంత్రాలు చలాచల వస్తు ధర్మాలన్నీ తనలో అధ్యారోపితం కావాలన్న కాంక్షను ప్రతిబింబిస్తాయి. అంటే లౌకికంగా స్వసుఖంతో పాటు పరహితకామన మంత్రభాగాల ముంజేతి కంకణం.

అలాగే మహావిష్ణు పారమ్యాన్ని బోధించే విష్ణు సహస్రనామంలో పరమాత్ముని అనంతమూర్తిమత్త్వం గోచరమౌతుంది. భగవద్గీతలో పురు

షోత్తముడు సర్వకళామయ విశ్వంలో స్వకళాప్రకాశం ఎక్కడెక్కడ వుందో ప్రస్ఫుటం చేశారు.

పరహితంకోసం పాటుపడుతూ నిగ్రహమే విగ్రహమైన వీతరాగికి, కైవల్యం కరతలామలకం లాంటిదని "అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ" వంటి శ్లోకాలు నిరూపిస్తాయి.

నిజానికి మన భావనల అవగాహనలన్నీ ఒకే పరతత్త్వాని కున్న బహు ముఖ సమారాధనమే. పరశివుడు సాకారంగా బోధించింది, పురుషోత్తముడు గీతగా ప్రవచించింది కూడా యిదే.

అదే బ్రహ్మ, అదే శివుడు, అదే విష్ణువు, ఇంద్రుడు ఆఖరున అక్షరమైన పరమస్వరూపం కూడా ఆ శాశ్వతసత్యమే.

అందుకే పురుషోత్తమ ప్రతిపాదితమైన శివధర్మాన్ని శివరాత్రి మహా పర్వదినంలో ఇలా పాడుకొందాం.

తాళ్ శడై యుమ్ నీళ్ ముడియమ్ ఒణ్ మయువుమ్ శక్కరముమ్
శూళురవుమ్ పొన్నణుమ్ తోన్టుమాల్ - శూళుమ్,
తిరుణ్డరువి పాయుమ్ తిరుమలై మేలెన్దైక్కు,
ఇరణ్డురువు మొన్దాయిశైన్దు.

- శ్రీ పేయాళ్వార్.

పొడవైన కేశపాశములతోడి జడ, శ్రీహస్తములో చక్రాయుధము, నాగాభరణము, బంగరు మొలత్రాడుతో కూడి శ్రీవేంకటేశ్వరస్వామివారు హరిహరరూపముగా దర్శనమిచ్చుచున్నారు. శ్రీస్వామివారు వెలసిన ప్రదేశము అనేక జలపాతములతో విలసిల్లు తిరుమల దివ్యక్షేత్రము. శ్రీవారు ఇట్లు హరిహరస్వరూపులై దర్శనమిచ్చుచున్నారు.

# 12. త్రినేత్రుడు

త్ర్యంబకం యజామహే సుగంధిం, పుష్టివర్ధనమ్,
ఉర్వారుకమివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మా అమృతాత్.

ఇది మహామృత్యుంజయ మంత్రం. తొడిమ వీడిన దోసపండు మాదిరి, మృత్యుబంధనాన్నుండి వేరుచేసి, అమృతత్వాన్నుండి వేరుకాకుండా ఉండేందుకు, త్ర్యంబకుడైన మహాదేవుణ్ణి స్మరించటం ఇందులో విశేషం. ఇది కేవలం శివపరంగానే చెప్పినా, ఇందులో అంతరార్థం చాలా ఉన్నదా అనిపిస్తుంది. మనం సాధారణంగా చూచే చిత్రాలలో, సర్వశక్తి సమన్వితమైన దేవతలుగా చూపేందుకు గణపతి, శక్తి, చివరకు మహావిష్ణువులను కూడా (విరాట్ స్వరూపంగా) త్రినేత్రులుగా చిత్రీకరిస్తారు. మరి ఈ మంత్రాన్ని కేవలం శివపరంగానే అన్వయించుకోవాలంటే, ఒక రకమైన నిర్వచనంలో ఇది సార్వకాలిక, సర్వదేవతాత్మక నిరూపణంగానే గోచరిస్తుంది.

చరాచర జీవకోటికి, సృష్టి, స్థితి లయాలనే మూడు దశలూ ఉన్నాయి. అంతరిక్షంలోని అనేక గోళాలలో కూడా నిత్యమూ ఈ పరిణామాలు జరుగుతున్నట్లు మనం వింటూనే వున్నాం. పుట్టింది ప్రతిదీ గిట్టక తప్పదనీ, గిట్టిన ప్రతిదీ పూర్వకర్మవిపాకం చేత తిరిగి పుట్టుతుందనీ, ఇలా సృష్టి క్రమంలో అనేక యుగాలు మహాయుగాలు మారిపోయాయని ద్రష్టలైనవారు చెప్పే విషయం. ఈ రెండూ లేనినాడు జనం, జగం జడమై పోతుంది. కనుక స్థూలమానవుడు ఆ విరాట్పురుషుని అంశారూపమే గనుక బాహ్యనేత్రాలు రెండూ అవి స్థూలంగా సృష్టి లయాలను ద్యోతకం చేసేవి అనుకోవచ్చు. కాని జీవుని పరమావధి ఈ జనన మరణ చక్రభ్రమణంలో చిక్కుకొని పోవటం కాదు. ఈ రెండింటికీ అతీతమైన స్థితి, పునరావృత్తి రహితమైన, శాశ్వతమైన బ్రాహ్మీస్థితిని పొందటం. బాహ్యనేత్రాలు రెండు ఈ స్థితిని కల్పించలేవు. ఈ రెండింటికీ మించిన మరొక నేత్రం ఆ పరమాత్మ నుండి జీవాత్మకు సంక్రమించింది. ఆ విరాట్ స్వరూపానికున్న మూడవ

నేత్రం సమస్తవిశ్వాన్ని తనలో లయింపచేసుకుని సృష్టినీ, నాశాన్ని నిరోధించేది కాగా, మానవునకున్న జ్ఞాననేత్రం (పైకి కనబడనిది) తరచిన కొద్దీ విశ్వాంతరాళంలోని సత్యాలను గోచరింపచేస్తూ చివరకు సాధనా సంస్కారాలనుబట్టి, శాశ్వత, నిరామయ, నిర్వికార బ్రహ్మంలో లీనమయ్యేందుకు తోడ్పడుతుంది. ఏ దేవతను పూజించినా, జీవుని జీవనపరమావధి ఈ శాశ్వత పదవీ ప్రాప్తి అని సూచించేందుకే బహుశః అందరు దేవతలకు మూడు కళ్ళున్నట్లు చూపటం జరుగుతున్నదేమో. నరుడు నారాయణుని అంశరూపుడే కావటంవల్ల, ఈ జ్ఞాన నేత్రం దేవర్షి గణాలలో దివ్యదృష్టిగాను, సాధారణ మానవానీకంలో అతీంద్రియ భావశక్తిగాను కన్పిస్తున్నది. అందువల్లనే మానవుడు శివంకరము, శాశ్వతము, అయిన మహత్తరశక్తిని, మృత్యుంజయాకాంక్షియై ఆరాధిస్తున్నాడు.

* * *

# 13. శంకరశ్చాస్మి

మహాత్ముల అవతారాలు సర్వజీవ సంక్షేమాన్ని పురస్కరించుకొని ఏర్పడతాయి. కాలప్రభావంవల్ల ఒక్కొక్క ప్రయోజనం సాధించటం కోసం సర్వేశ్వరుడు వివిధావతారాలను ధరించటం మనకు పురాణాలలో కన్పిస్తుంది. ఒక్కొక్కప్పుడు కేవలం అవతార స్వరూప స్వభావాలవల్లనే మానవాళికి అమూల్య సందేశం కన్పిస్తుంది. అదే సృష్టి వైచిత్రి. అందువల్లనే మానవులు పామరులై శైవమనీ, వైష్ణవమనీ శిఖపట్లు పట్టుకుంటున్నా, అనంతసృష్టి స్వరూపంలో వివిధ పాత్రలనుధరించే ఆ చిజ్జ్యోతి ఒకటేనని తెలియచెప్పేందుకే భగవానుడు 'రుద్రాణాం శంకరశ్చాస్మి' అని భగవద్గీతలో పేర్కొన్నాడు.

ఏకాదశరూపమైన రుద్రస్వరూపాలలో శంకరుడను నేను అని చెప్ప టంలో ఒక తాత్త్వికమైన అభేదంతోపాటు, సాంకేతిక రూపంగా సార్వకాలీన సమాజానికి అందించే అమూల్య సందేశం ఒకటి నిగూఢంగా ఉన్నది.

రుద్రుడు సంహారకమూర్తి, లయకారకుడు, కాని ఆ తత్త్వంకూడా ఒక మహోన్నతమైన, శివంకరమైన కార్యసాధన కుపయోగించటం వల్లనే అతడు శంకరుడైనాడు.

అతడు కంఠేకాలుడు. అంత కాలకూటవిషాన్ని కూడా, కంఠగతమాత్రం చేసి, సర్వలోకాలను సంరక్షించిన ఈ తత్త్వం లేదా గుణంవల్ల మానవునకు అమూల్య సందేశం లభిస్తున్నది. కాలకూటంలాంటి ఎలాంటి తాపాన్నయినా తాత్కాలికంగా కంఠగతం చేసుకోవాలేగాని, ఉదరగతం చేసి తన్మూలకంగా దేహతాపానికిగాని, సమాజ వినాశనానికిగాని కారకుడు కారాదు. అంతేకాదు కాలకంఠుడైన ఆతని చంద్రశేఖరత్వం, గంగాధరత్వంలో మానవుడు ఎంతటి కష్టదశలో నున్నా కూడా తాను దానికి లోనుగాక బుద్ధిని ఉద్వేగరహితంగా ఉంచాలన్న సందేశం కన్పిస్తుంది.

ఆతడు దిగంబరుడు, భోగిభూషణుదు, సర్వేశ్వరుదు, స్థాణువు. ఇవన్నీ కూడా అతని విషయనిరాసక్తత, కఠోరదీక్ష, ఆశ్రితవాత్సల్యోప యోగ్య సంపత్ప్రదత్వాన్ని వ్యక్తం చేస్తాయి. అంటే భగవానుదు గీతలో చెప్పిన కర్మయోగం ఇదేనేమో. మానవుడు ఈ గుణాలలో శతాంశం సంకల్పించినా ఒక మెట్టు ఎక్కినట్లే. శ్రీనాథుడు చెప్పినట్లు 'సిరిగలవానికి చెల్లును' అన్నట్లుగాక, స్వప్రయోజనం కోసం కాక, పరహితం కోసం, తనకున్న దానిలో సహాయం చేయాలన్న సామాజిక మౌలికసూత్రాన్ని శర్వుని దగ్గర్నుండే స్వీకరించాలి.

అతడు త్రినేత్రుడు. ఇది పర్వతం నుండి పరమాణువు వరకు వ్యాపించి ఉన్న విశ్వరూపుని సత్యస్వరూప సందర్శనం కావాలంటే ప్రతిమానవుడు, భౌతిక వాంఛలను దహింపచేసే జ్ఞాననేత్రాన్ని తెరచి, మనస్సును అంతర్ముఖం చేయాల్సిన అవసరానికి సంకేతం.

ఇక అర్ధనారీశ్వరత్వం, ధర్మబద్ధమైన ఐహిక జీవనంలోగాని, ఉత్తరోత్తరా ఆధ్యాత్మికంగా గాని, స్త్రీ రూప శక్తి స్వరూపంలేని మానవుడు అపరిపూర్ణుడనేది సూచిస్తున్నది.

ఇలా ఒక్కొక్కమాటలో ఎన్నో అర్థాలను, మన శ్రేయస్సుకుగాను సంతరించి పెట్టినవి పురాణ దేవతా స్వరూపాలు. సత్యాన్వేషణ దృష్టిలో శోధన సాగితే అమరత్వ స్వరూపం తప్పక తెలుస్తుంది.

* * *

# 14. శివతత్త్వం

విశ్వ జీవన విధానాలను పరిశీలించిన విజ్ఞులు పరమాత్మ ఒకటేననీ, సృష్టి స్థితిలయాత్మకమైన విశ్వవ్యాపారాన్ని క్రమపద్ధతిన నిర్వర్తించేందుకు గాను అవస్థాభేదాన్ని బట్టి అది వివిధాకృతులను పొందుతుందనీ విశ్లేషించి వివరించారు. త్రిగుణాత్మక జీవులు తమ అభిరుచులనుబట్టి ఇష్ట దైవాలను ఏర్పరచుకొని ఆరాధించినా, అన్ని ఆకృతుల గుణవిశేషాలూ ఆ మూల వస్తుతత్త్వాన్ననుసరించే వుంటాయని భంగ్యంతరంగా నిరూపించారు. అవసర భేదాన్ని బట్టి ఒకటి రెండు విశేషణాలొకరి విషయంలో జోడింపబడినా స్థూల ధర్మాలు మాత్రం ఒకటే.

వేదాలు విరాట్పురుషుని నిశ్వాస జనితాలనీ, ఆ విరాట్పురుషుడే ఆదినారాయణుడనీ అనాదిగా ఆదిమ వాఙ్మయం పేర్కొంటున్నది. విధాతృ ముఖోద్గీతాలని పురాణ వాఙ్మయ ప్రవచనం. ఇవన్నీ ఇలా వుండగా తంత్రశాస్త్ర ప్రకారం ఈ నాల్గు వేదాలూ సద్యోజాత, తత్పురుష, వామదేవ, అఘోరముఖోజ్జ్వాలాలు. పరమ శివునికున్న వివిద విశేషణాలలో ఇవికూడా వున్నవి. వివిధామ్నాయ ద్వార దేవతలుగా పారమేశ్వర శక్తులను ఈ

తంత్రశాస్త్రాలు వివరిస్తున్నాయి. ఇవి శైవపరంగా చెప్పదగిన విరూపణ అన్న మాట.

ఇక అన్ని కథల మాదిరే శివ కథలు కూడా తాత్త్వికసంకేతాలే కాక సందేశాన్నీ ఇస్తున్నాయి. శివుడు కాలాగ్ని రుద్రుడే కాదు, జ్ఞానాగ్ని నేత్రుడు కూడ. అతని కామదహన కథ ఇంద్రియ నిగ్రహాన్ని సూచిస్తూ, మనిషి మనిషిలోవున్న మూడవ కన్ను తెరుచు కోగల్గినప్పుడు ఇంద్రియోన్మాదాన్ని నాశనంచేసి, నరుడు శివుడూ భవరహితుడూ కాలగడని సూచిస్తుంది.

కంఠే కాలతత్త్వం వైయక్తికంగా మానవుని కష్ట సహిష్ణుతనీ, సమాజ హితపరైకతనూ ప్రబోధిస్తుంది.

శివతత్త్వం లౌకిక నిరాడంబరతకూ ఆధ్యాత్మిక సుసంపన్నతకూ నిదర్శనం. దిగంబరుడనీ, వ్యాఘ్రచర్మాంబరుడనీ, నాగభూషణుడనీ వర్ణించ టంలోని ఔచితి ఇదే కావచ్చు.

శివుడు రసరాట్. ఇందువల్లనే తన లీలకోసం సగం రూపును వేరు చేసుకొని చేసిన నాట్యం జీవకళా వికాసానికే ఆదియైంది. రసమయ జీవన సృష్టికి పార్వతీ పరమేశ్వరులు మూలమూర్తులయ్యారు.

సర్వజీవ సమాదరణం శివతత్త్వంలో ప్రముఖంగా కన్పిస్తుంది. యజు ర్వేదీయ శతరుద్రీయంలో మనకు నమక చమకాల పేరుతో కన్పించే-

"ఆసీనేభ్యః, శయానేభ్యః, వ్రాతేభ్యో వ్రాతపతిభ్యో" ఇత్యాది మంత్రా లలో గుప్త వేదాంతంతోపాటు సర్వజీవ రూప దైవ గౌరవభావనా అన్ని వర్గాలనుండి సుహితా కాంక్షా కనిపిస్తాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే స్థూలంగా శివతత్త్వాన్ని అర్థం చేసుకోగ లిగితే ఇహంలో హితజీవిగా బ్రతుకుతూ గీతాసారాన్ని అవగతం చేసుకొని పరమ పద సోపానాలు పదిలపరచుకోవచ్చు.

యేన ద్యౌః పృథివీ చాంతరిక్షం చ
యే పర్వతాః ప్రదిశో దిశశ్చ
యేనేదం జగద్వ్యాప్తం ప్రజానాం-
తస్మై మన శ్శివ సంకల్పమస్తు.

* * *

# 15. వర్షచక్రం

అనంతమైన కాలానికి కొలబద్దలు అరవై సంవత్సరాలా! లోకం మహాపురుషుల పుట్టుకకు ముందు వెనుకలలో సంవత్సరాలు సరిచూచుకుంటుంటే భారతీయులు మాత్రం అవే అవే త్రిప్పుతూ అరవై సంవత్సరాలతోనే తృప్తి పడటం ఒక వింత, విడ్డూరం గూడా. పాత చింతకాయ సామెతలా కనిపించదా, అనిపించదా! అన్యులకలా అనిపించటం, వినిపించటం సహజమే. భారతీయ జీవన విధానం అనుసంధానం చేసి అవగతం చేసుకున్న వారికి కాదు.

భారతీయులకు వ్యక్తి కన్న సంకేత, సందేశాలు ప్రధానం. అందుకే 'భారత' శబ్దాని కనేకార్థాలు సాధించినా, భ, ర, త, విజ్ఞాన జిజ్ఞాసువుల దేశమని చెప్పటంలో ఉన్నంత వైశిష్ట్యం సంకేతం మరెందులోను కన్పడదు.

కనుకనే అరవై సంవత్సరాల కాలమానానికి కూడా అన్వర్థమైన సంకేతం ఏదో వుందనే అన్పిస్తుంది. ఈ అరవై నారద సంతాన మనే పుక్కిటి పురాణ గాథలు వదిత్తే ఇవి సార్వకాలిక జీవన విశ్లేషానికి సంకేతాలు. పైన అనుకున్నట్లు భారతీయులకు వ్యక్తి ప్రధానం కాదు. అందుకనే ఇవి వ్యవస్థా గతానుభవానికి ప్రతీకలు. జీవన విధానంలోని వివిధ దశలను వింగడించి, తదనుగుణంగా వత్సర నామకరణం చేశారా అనిపిస్తున్నది. మానవ జీవితం ఏ దేశస్థమైనా అనుభవించవలసిన దశలు ఐదు మాత్రమే.

బాల్యం, యౌవనం, కౌమారం, వార్ధకం. వివరిది దేహాంతర ప్రాప్తి. ఆదిది ప్రభవం కాగా వివరిది క్షయ ఔతున్నది. ప్రతి పన్నెండు సంవత్సరాలను ఒక దశగా భావిస్తే అరవై దాటేనాటికి అవయవసంధులు సడలి మనిషి పైచూపు చూడటం ప్రారంభిస్తాడన్నమాట. కనుక ఇహానికైనా లేక ఇహంలో పరాన్ని సాధించుకోవాలన్నా ఈ ప్రభవ- క్షయల మధ్య కాలమే యోగ్యమైనదన్నమాట. మన పేరులు కాకపోయినా, విదేశంలో అయినా ఈ మరమనుషుల బ్రతుకు లింతే, వాటిగతి అంతే. త్రికాలాబాధ్యమైన సత్యానికి సంకేతంగా 60 సంవత్సర కాలమానాన్ని మనకు అందించారన్నమాట.

ఇక పేర్ల ప్రకారం చూచినా ఈ క్రమమే గోచరిస్తుంది. ప్రభవ, విభవ, శుక్ల, ప్రమోద అంటే ప్రభవం, వికాసం, విజ్ఞానార్జనం, సంతోషం ఇలా జరిగే జీవిత గతిలో ఇది ప్రజాపతి సంవత్సరమన్నమాట. దీన్నే ప్రజోత్పత్తి అని కూడ అనటం కద్దు. ప్రజా అంటే జనం అని సంతానమని అర్థాలున్నాయి. అంటే ఆధ్యాత్మికతా పరులైన భారతీయులు కామలోలు పులా అన్న అవహేళన కొందరికి ధ్వనించినా ఆశ్చర్యం లేదు. నిజానికి భారతీయుల దృష్టే వేరు. సమాజ విస్తరణకిచ్చిన ప్రాధాన్యం, లోలత్వాని కేనాడు ఈయలేదు. గార్హస్థ్యాన్ని ఒక మేధంగా యజ్ఞంగా పవిత్ర కార్యంగా పరిగణించారు. సమభాగధేయమైన సరియాటగా భావించారు. సమాజానికి గృహస్థు, పెరటి కల్పకమని, కడలేని నడబావి, దొడ్డి బెట్టిన వేల్పు అని, మేరునగమని వర్ణించారంటే సామాజిక జీవనంలో సాంసారిక స్రవంతికి గల పావిత్ర్యం ప్రాధాన్యం ఎంతో తెలుస్తూనే వుంది. రఘువు మొదలు రాఘవ రాముని దాకా సాగిన ఇనకుల తిలకులందరూ కూడా సత్సంతాన సంపద కోసమే గృహమేధిత్వం స్వీకరించారని,

త్యాగాయ సంభృతార్థానాం
సత్యాయ మితభాషిణామ్,
యశసే విజిగీషూణాం
ప్రజాయై గృహమేధినామ్.

మహాకవి కాళిదాసే రఘువంశ కావ్యంలో వివరించాడు. రాములూ వున్నారు. దశరథులూ వున్నారు. అందరి తపన పుత్రనామక స్వాత్మానుసంధానం, తద్ద్వారా ఆనువంశిక గుణగణ విస్తరణం. అందుకే శాస్త్రాలు ఒక వంక నిగ్రహాన్ని బోధిస్తూనే, మరొక వంక 'ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః' (ప్రజాతంతువును తెంపకూడదు) అని శాసిస్తున్నాయి. అంటే సూక్ష్మంగా నిగ్రహం శ్రేష్ఠం, భ్రూణహత్య మహాపాపం అని సూచిస్తున్నా యన్నమాట. కాని ఇప్పుడు మనకు మొదటిది లేదు. రెండవది వద్దు. పెద్దవాళ్ళు వద్దన్నదే మనకు ముద్దు. ఈ కోతిచేష్టకు ఎక్కడ హద్దు?

ఇంతటి విశిష్టాలోచనతో ఏర్పడ్డ పేర్లు మన 60 సంవత్సరాలవి. ఈ ప్రజోత్పత్తి సంవత్సరం నియమ నిగ్రహాత్మక జీవన విధానాన్ని ప్రసాదిస్తుందని ఆశిద్దాం.

* * *

# 16. మకర సంక్రమణం

మకర సంక్రమణం వచ్చింది, మనుషులలో మనసులలో సందడి హెచ్చింది. పర్వ పరమార్థం ఎలావున్నా సంక్రాంతి అంటే కనపడేది చలిమంటలు, గోవింద దాసరులు, వీథి గొబ్బెమ్మలు, కొత్త అల్లుళ్ళకు కొలువులు, కోడి పందాలు, ఇంటింట ముగ్గులు, ఇంపైన భోజనాలు, ఒకటేమిటి అదొక కొత్త కల.

నిజాని కీ పండుగ ఏమిటా అని ఆలోచిస్తే ఆలోచనల చేలల్లో కొత్తపంట కావాల్సినంత లభిస్తుంది. సంక్రమణం అంటే ఒక స్థితిని దాని మరొక స్థితికి ముందుకు పోవటం. గతివేగం, కాలభేదం తప్ప రాశిచక్రంలో నవగ్రహాలన్నిటికీ ఈ సంక్రమణం వున్నది. మరి ఈ రవి సంక్రమణానికే ఎందుకింత కోలాహలం? పోనీ సూర్యుదు ప్రతినెలా ఒక రాశి

మారుతూవున్నాడు గదా? కేవలం ఈ మకర, కర్కాటక సంక్రమణాలే ఎందుకు మన్ననకు వచ్చినట్లు?

మనం కొలిచే దేవుళ్ళందరూ కనరానివాళ్ళు. కనబడకుండా తమబలం చూపించేవాళ్లు. కాని సూర్యచంద్రులు మాత్రం కంటికి కావల్సినంత నిండుగా కన్పిస్తూ తమ గతుల భేదాలవల్ల మన 'గతు'లలో మార్పు తీసుకవస్తుంటారు. ఖగోళ శాస్త్ర రీత్యా చంద్ర గ్రహం స్వయం ప్రకాశం కాదన్నమాటవున్నా, సూర్యుని కా వాదులేదు. అతడు పగలు స్వయంప్ర కాశకుడు, రాత్రులలో కిరణపరావర్తన ద్వారా పరోక్ష రక్షకుడౌతున్నాడు. అతని కిరణాలవల్లనే దేహులకు ఆరోగ్యం కలుగుతున్నది. జీవులలో చైతన్యం వెల్లివిరుస్తున్నది. సూర్యగతులవల్లనే ఋతు ధర్మా లేర్పడుతున్నవి. రవిరశ్మిలేని ప్రాంతంలో పెరుగుదల తక్కువగానే వుంటుంది. అందువల్లనే జ్యోతిశ్శాస్త్రం కూడా రవిని ఆత్మకారకుడుగా, శనిని ఆయుష్కారకుడుగా పేర్కొంటున్నది. జాతక బలాలకు ఎక్కువగా రవిచారమే ఆధారం. అందువల్ల రవి జగత్స్రష్ట. జగద్ భర్త కూడా.

నిజానికి మనం చాంద్రమానాన్నే అనుసరిస్తున్నా, ఆధ్యాత్మికంగా మకరం నుండి మకరం దాకా జరిగే సూర్య సంక్రమణాన్ని ఒక సంవ త్సరంగా, కర్కాటక సంక్రమణం తదర్ధ భాగంగా ఏనాడన్నా పరిగణించి వుంటారేమో అనిపిస్తున్నది. ఈ భావన నిజమైతే అది ఈనాటి ఆంగ్ల పరిగణనానికి చాలా సన్నిహితమని తోస్తున్నది. నిజానికి ధనురంతం చలిమలికి, మంటల వేడికి నడిమి నులి వెచ్చని కాలం. వసంత శోభ తెలిసినా, తెలియకపోయినా, గ్రీష్మారంభం మాత్రం వసంత మధ్యంలోనే అనుభవానికి వస్తుంది. సిరి నట్టింట చిందులు వేసే కాలం కూడా ఇదే. ఇది ఏనాడన్నా సంవత్సరాదిగా వుండేమో అనుకున్నా ఆశ్చర్యం లేదు.

ఇక వైదిక వాఙ్మయం సూర్యుణ్ణి నారాయణుని నేత్రరూపంగానూ, చంద్రుణ్ణి చంద్రమా మనసో జాతః అని వర్ణించింది. ఈ రెండూ కూడా

ఆ యా వస్తువుల ధర్మాలకు అనుగుణంగానే వున్నవనవచ్చు. ఉపనిషత్తులు, పునస్సృష్టి సంకల్పించిన ప్రజాపతి మొట్టమొదటగా ఆదిత్య, రయిలను దివారాత్రభావనగా సృష్టించాడని, ఆదిత్య రూపమే పురుష రూపమని. 'రయి' స్త్రీరూపమనీ అంటున్నవి. ఈ రూపంగా చూచినా పదునాల్గు భువనాలకు కర్త శ్రీమన్నారయణుడైనప్పుడు ఈ విశాల పురుష స్వరూపుడు సూర్యుడు కావటంలో సందేహం లేదు. పైగా పురాణ వాఙ్మయమంతా...

'సవితృమండల మధ్యవర్తీ'ధ్యేయో నారాయణస్సదా! అని ఆదిత్య మండలాంతః స్థిత నారాయణోపాసనను వ్యక్తం చేస్తున్నది. అందుకేనేమో బహుశః సూర్యునకు నారాయణత్వం కలిగి సూర్యనారాయణుడు కావటం. కనుక రవికి నరలోకం చేసే నమస్కారం నారాయణునకే చెందుతుంది. అందువల్లనే మకర సంక్రమణం నుండి ఉత్తరాయణ కాలమంతా పారమార్థిక ప్రయోజనాలకు ముఖ్యమనీ, ఐహిక ప్రయోజనాలకు దక్షిణాయనం శ్రేష్ఠమనీ పెద్దలవాక్కు. అసలు విషయం మరచి మనం పండుగ చేసుకుంటున్నా అంతరార్థం మాత్రం అంతే.

తార్కికంగా గొప్ప సందేశం మన పండుగలలో వుంది. సూర్యయానానికి సంబంధించిన కర్కాటక మకరాలు రెండూ ఉభయ చరాలకు సంబంధించినవి, వంచనాశీలం కలవి కావటం గమనించదగ్గది. రవి మకరగతుడైనా, ఋతుశాసకుడు గనుక ప్రమాదం లేదు.

కాని, పంచభూతాలు సార్వజనీనాలనీ, సార్వకాలికాలనీ తెలిసికూడా, ధన, బల, అధికార గర్వాలు వర్గ, వర్ణ వ్యత్యాసాలనే మకర బలానికి లోనై తనను తానుద్ధరించుకొనక, సంసారకాసారంలో నరుడు చిక్కుపడినంత కాలం, జ్ఞానభాస్కరునకు నిత్య మకర సంక్రమణమే. దానిని దాటగలిగిన వానికే ఇంపైన ఇహం, పరమపదము సిద్ధిస్తాయి.

తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై.

* * *

# 17. వైశాఖి

పుట్టిన ప్రతిప్రాణికి, ఆ మాటకువస్తే ఈ చరాచర విశ్వానికే అని వార్యమైనది అస్తమానం, మరి మన పుట్టుక గిట్టుకలు ఉదయాస్తరూప సౌరచలనంతో ముడిబడి వున్నాయి. అందుకే సూర్యుణ్ణి కాలమని, కాలుడని అన్నారు. బండిచక్రంలా తిరిగే ఈ కాలచక్రంలో అన్ని ఋతువులు మాసాలు ఋతుధర్మాలు తప్ప మిగిలిన వాటిలో సమానమే కావాలి.

కాని సామాజిక సమన్వయానికి సహజీవనానికి, ఒక్కొక్క విషయం ప్రాశస్త్యం పొంది విశిష్టంగా కనబడి దాన్నుండి సమాజానికి నూతన సందేశం అందుతుంది.

నిజానికి అన్ని మాసాలు ఒకటిగానే కనబడినా భగవానుడే 'మాసానాం మార్గశీర్షో ఽహం' అని తనకూ ఆ మాసానికి గల ఆత్మీయ సంబంధాన్ని గురించి చెప్పారు. ఆ మాసం శివకేశవ భక్తులందరికీ పవిత్రమైందే!

మళ్ళీ అంతటి ప్రాధాన్యత కల్గింది వైశాఖ మాసం. దీనికి మాధవ మాసం అని కూడ పేరుంది. అటే మహావిష్ణువుకు ప్రీతిపాత్రమైన మాసం. మానవ జాతికి మహత్తర సందేశాన్నిచ్చే మహోజ్వల మాసం ఇది. అందుకే అర్చావతారంతో సహా ప్రపత్తి ప్రతిపాదకులైన మహామహుల జన్మతిథులు ఈ మాసంలోనే వస్తున్నవి.

ఇందులో మొదటిది సర్వప్రపత్తి స్వరూపుడైన ప్రహ్లాదుని రక్షించి, అహంకారి ఆతతాయి అయిన హిరణ్యకశిపుని సంహరించిన నరసింహ స్వామి జయంతి. భగవానుని సర్వాంతర్యామిత్వాన్ని సర్వగతత్వాన్ని అవగతం చేసుకుని ఆత్మసమర్పణం చేసుకున్న ప్రహ్లాదునకు రక్షణ, అహంకరించిన హిరణ్యకశిపునకు శిక్ష లభించాయి ఈ అవతారంవల్ల.

శరణాగత తత్త్వానికి ఆచార్యస్థానం, మూర్తి మత్త్వమున్ను పొందిన మహనీయుడు ఆంజనేయస్వామి. ఇతను బలహీనుని బానిసత్వం మాదిరి

కాక సర్వవిధ సామర్థ్యమున్నప్పటికిని త్రికరణశుద్ధిగా దాస భావాన్ని స్వీకరించి రామప్రభు కార్యాలను అతి సమర్థతతో నిర్వహించిన నిస్వార్థ జీవి. ఈయన జయంతి కూడ ఈ మాసమే.

అణువణువులోను అంతర్యామిని దర్శించి శివోఽహం అన్న అద్వైత భావనను ప్రకటించిన ఆదిశంకరులు జనానికుపదేశించింది సగుణ ప్రతీకకు శరణాగతి. అందుకే పారమార్థిక పరమావధి తీరం చేరుకున్నా జనాళి ఆత్మోజ్జీవనం కోసం భజగోవిందం, శివానందలహరి, సౌందర్యలహరి, కనకధారాస్తవం, లక్ష్మీనృసింహ కరావలంబ స్తోత్రం జనాని కందించి చరితార్థులయ్యారు. భిన్నపాత్రగతమైన ఏకైక చైతన్య స్వరూపాన్ని తమ రచనలలో ప్రకటించి నూత్న సందేశాన్ని ఇచ్చారు.

ఇక భగవద్రామానుజులు సాక్షాత్ రామానుజులే. వారి విశిష్టాద్వైత సిద్ధాంతం అంతా అనన్యశరణాగతి తత్త్వమే. ఇక నమ్మాళ్వారుల రచనలన్నీ భగవద్గుణగాన లహరులే. పరమాత్మని సర్వశేషిత్వ ప్రదర్శనలే.

పదకవితా పితామహుడు అన్నమాచార్యుల వారి పదకవితలన్నీ 'పతి-పత్ని', 'జీవాత్మ-పరమాత్మ' సంలీనతా భావద్యోతకాలైన దివ్యశరణాగతి దీపకలికలే. వర్గ వర్ణ వైషమ్యాల కలితంగా సర్వజీవ సమతాభావం, సర్వజగద్రక్షకుని పట్ల దీక్ష శరణాగతి ఆయన గీతికాసారం. ప్రాచీన ధార్మిక జ్ఞానసారాన్ని గీతాలలో నలుగురికి అందించిన ఘనత అన్నమయ్యదే.

అద్వైత భావనా ప్రతిరూపమైన ఆదిశంకరులు అందరు దైవాలపైన శరణాగతి స్తవాలు చేస్తే, అన్నమయ్య అందరు దైవాలను శ్రీవేంకటేశ్వరునిలో పర్యవసింపచేసి భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శించారు.

మరి ఇందరు మహాపురుషులు తమ అవతరణతో ఆదరించిన మాసం ఈ మధు మాధవ మాసం. కాదనటానికి మన మెవరం?

ఎందరో మహానుభావులు అందరికీ వందనములు

* * *

# 18. సౌర సప్తమి

దేవుడు అంటే రాముడా, కృష్ణుడా అని దేవులాడకుండా చూస్తే మనకు కంటికి కన్పించేదీ మనకు ఆలోచన కల్పించేదీ ఒక్కటే. అది సూర్యబింబం. మిగిలిన వాటికి ముఖ్యంగా పంచ భూతాలకు దైవత్వం లేదా అంటే లేదని చెప్పటం కష్టం. కారణ మేమిటంటే ఆ ఐదు తత్వాలు కలిస్తేనేగాని అజ్ఞానానికి జ్ఞానరూపం కాని, వర్ణం కాని సంభవించదు. ఆ మాటకు వస్తే ఈ విశాల సృష్టిలోని చరాచర జీవజాలం అంతా ఈ పంచభూతాత్మకమే. అయితే ఇది పూర్తిగా ఆమోదించటానికి వీలులేదు. ఈ తత్వాల తమాషాలలో పుట్టినది ప్రతిదీ చేతనం కావటం లేదు. అన్నీవున్నా అప్పటిదాకా శివమనిపించుకున్నది శవమౌతున్నది. కనుక అవి వున్నా లేనట్లు ఏర్పడే స్థితివల్ల వాటిని దైవాంశాలనీ అనేందుకు వీలులేదు. మరి సమస్త విశ్వానికి చైతన్యం ప్రసాదించి జీవవంతం చేసే శక్తి ఏదో ఒకటి ఉండి ఉండాలి. కనిపించని పరమాత్మకు ప్రతిరూపంగా కన్పించే ఆ సూర్యుడే ఆ శక్తి అంటే ఆశ్చర్యం లేదు. అందుకే ఆ భగవచ్ఛబ్దం సూర్యునికి సార్థకమైంది.

అంతే కాదు సూర్యునికి భగవత్పరమైన ఇంకో బిరుదుకూడా వుంది. అది నారాయణ శబ్దం. ఇది మహా విష్ణువు పరంగా సార్థకం, రూఢి ఐనా, కవిత్వ సౌందర్య దృష్టితో సూర్యుడికి కూడా అన్వయిస్తోంది. సముద్రాలు ఎవరికి మార్గమో అతడు నారాయణుడని చెప్పవచ్చు. ఎందు కంటే సూర్యోదయం సూర్యాస్తమయం జలాంచలంలో జరుగుతున్నట్లు కన్పిస్తాయి.సూర్యుడు తన కిరణాల ద్వారా జలాల్లో ప్రవేశించి ఆవిరి తీసుకుని మళ్లీ వర్షంగా కురిపిస్తాడు. ఈ విధంగా కూడా సూర్యుడు నారాయణ స్వరూపమే.

ఏ దేవుణ్ణి ఎంతవేడినా వాళ్ళిచ్చేది కొంతే. మరి సూర్యదేవుడు సర్వదేవాత్మకుడు. అందరు దేవతలూ ఆ మండలంలోనే ఉన్నారన్న మాట.

అందుకే సృష్టిస్థితి లయాత్మకులైన త్రిమూర్తులూ, సూర్యరూపంగాను, వారి భార్యలు గాయత్రీ రూపంలోనూ సూర్య మండలాన్ని ఆశ్రయించి ఉన్నట్లు హంసారూఢా, వృషారూఢా, గరుడా రోహిణీ శుభా అన్న గాయత్రీ అష్టోత్తరం వల్ల తెలుస్తోంది. సూర్యుడు పరబ్రహ్మకు పరరూపమైతే గాయత్రీ పరాప్రకృతి అన్నమాట. అందుకే అన్ని తత్త్వాలు అందులో ఉన్నాయంటారు.

కంటికి కన్పించని కాలం ఆగటం గాని, సాగటంకాని కాలరూపియైన సూర్యుని రాకడ పోకడలను బట్టే. అందుకే సూర్యుడికి మృత్యువు, కాలుడు అని పేర్లు.

కాలాల మార్పు స్పష్టంగా కన్పిస్తుంది. గనుక మకర కర్కాటక రాసు లలో సూర్య ప్రకాశాన్ని గౌరవిస్తూ, ప్రతిరాశి ప్రవేశాన్ని ఒక సంక్రమణమను పేరుతో సంభావిస్తున్నాం. బాగానే ఉంది. మాఘ శుద్ధ సప్తమిని సూర్యుని జన్మదినంగా వేడుకలు జరుపుకుంటున్నాం. నిజానికి కాల ప్రదాత ఐన సూర్యుని తోనే కాలం ప్రారంభమైతే, అంతకు ముందు ఆరు దినాల కాలం సంగతేమిటి. కనుక మనకు బైటకు కన్పించే కథలు సిద్ధాంతాల వెనుక స్థూలసత్యం ఏదో ఉండి ఉండాలి. దాన్నిలా ఊహించవచ్చు.

ఈ విశాల విశ్వం పంచ భూత సమ్మిళితమే ఐనా, ఆ నాటకాన్ని అంతలో ఉంటూ అన్నింటికి అందకుండా ఉండే తత్త్వాలు రెండున్నాయి.

పదునాల్గు భువనాలను శాసించే నిర్గుణతత్త్వం పరమాత్మ. దానికి కన్నుగా, అన్నింటికీ సాక్షిగా, తానన్నిటా ఉన్నా దేనికీ అందకుండా తనంతట తానుగా తరతరాలుగా వస్తున్న దివ్యతత్త్వ ప్రత్యక్షదైవం సూర్యుడు. కనుక ఈ బ్రహ్మ విశ్వగ్రహ సమ్మేళన సంచాలనంలో ఆ కొన పరమాత్మ ఐతే ఈ కొన జగదాత్మ సూర్యుడు.

"సూర్య ఆత్మా జగత స్తస్థుషశ్చ"

సృష్టి పంచభూతాల నుంచే అన్న పాఠం నేర్చుకున్న మానవజ్ఞానం, సౌరశక్తిని సప్తమ తత్త్వంగా గుర్తించి గౌరవించిన దినం సప్తమీ లేక సౌర సప్తమి అయిందేమో! అవునా కాదా అన్న ఆలోచన ఎప్పుడూ ఆరాధనకు అడ్డం కనుక సూటిగా సూక్తి ద్వారానో, కమ్మని కథల ద్వారానో మర్చిపోలేని విధంగా మనసు కెక్కించటం మన సంప్రదాయం. నిజానికి ఈ సౌరారాధనం ఈ జ్ఞాన భూమికే పరిమితం కాలేదు. అంతో ఇంతో ఆలోచన ఉన్న అన్ని దేశాల్లోనూ వేల ఏండ్లుగా వెల్లివిరిసివుంది. ఇంతకీ మన భావనా, ఆరాధనా ఒక సౌరకుటుంబశక్తిని గురించే.

మరి ఈ విశాల విశ్వంలో ప్రకాశించే పాలపుంత లెన్నో వున్నాయని, ఇలాంటి సౌరకుటుంబాలు ఎన్నో వున్నాయనీ అంటున్నారు. 12 మంది పేర్లు మాత్రం చెప్తున్నారు. వేయి కిరణాలవాడైనా, ఏడు కిరణాలవాడికే లోకం సతమతమౌతుంటే మిగిలిన మండలాలు ఆ ఆదిత్యుల అంశలో మనిషి బుద్ధి ఏపాటి? అందుకే ఇలా వందనాలను పెట్టుకుందాం.

నమస్సవిత్రే జగదేక చక్షుషే
జగత్ప్రసూతి స్థితి నాశ హేతవే
త్రయీమయాయ త్రిగుణాత్మధారిణే
విరించి నారాయణ శంకరాత్మనే.

* * *

# 19. సూర్యనారాయణుడు

దేవుడున్నడా? అనే ప్రశ్న వచ్చింది. ద్రష్టలందరూ ఉన్నాడనే అన్నారు. ఎలా ఉన్నాడనే ప్రశ్నకు తలకొక రకంగా సమాధానం వచ్చింది. ఏదో ఓ చిన్న ప్రార్థన చేసి పరీక్ష చేద్దామనుకొన్న గజేంద్రుడికి, కలదు కలండనెడువాడు కలడో లేడో అన్నంతటి అనుమానం వచ్చి భయంవేసి,

'నీవే తప్ప నితఃపరం బెరుంగ మన్నింపదగున్ దీనుని' అని శరణాగతి చేసుకున్న తర్వాత, ఆ వైకుంఠవాసి, హడావుడిగా వచ్చి మకరిబారి తప్పిస్తే అప్పుడామాట నిజమే! అనుకొన్నట్లు, పిలిచినా పలికినా అది సర్వసామాన్య గోచర విషయం కాదు కనుక ఇప్పటికి కూడా అవును కాదు అని ఆరాటాలు పోరాటాలు జరుపుకుంటూనే వున్నాం.

మరి గ్రహాలున్నాయా? అది కూడా ఉన్నాయనే మన పూర్వులు చెప్పారు. అంతేకాదు ఏ యే గ్రహం భూమిని ఎంతెంత దూరంలో పరిభ్రమిస్తున్నదీ, వేటివల్ల ఏ యే ఫలాలు కలుగుతున్నదీ కూడా శ్రీమన్మహా భాగవతం లాంటి గ్రంథాలలో వివరించటం జరిగింది. మనవాళ్లు చెప్పింది కనుక మొదట లేవనుకొన్నాం. దుర్భిణీలకు దొరికిపోయి నందువల్ల వాటి ఉనికిని ఒప్పేసుకున్నా వాటి వల్ల మనమీద ఏ ప్రభావ ప్రమాదం లేదు అని కొట్టి పారేశాం.

మరి సూర్యచంద్రుల మాటేమిటి? వాటిని రాత్రింబవళ్లు ఒకటి మార్చి ఒకటి చూస్తున్నాం కనుక ఇవి కాదంటే మనని ఎక్కడన్నా చేర్పిస్తారేమోనని ఒప్పేసుకున్నాం. ఇందులో కూడా చంద్రుణ్ణి చిన్నచూపు చూశాం. రవికిరణ పరివర్తనం ఆ గ్రహం ద్వారా జరిగి చల్లని తెమ్మెరలు, పున్నమి వెన్నెలలు కలుగుతున్నాయి గనుక స్వయం ప్రకాశక శక్తి దానికి లేదని మెట్టు దించేశాం.

ఇక మిగిలింది సూర్యుడు. ఇక్కడే వచ్చింది చిక్కు. మనవాళ్లు చెప్పిందంతా నిజమని విజ్ఞానశాస్త్రం ఋజువు చేస్తున్నది. అతని అస్తిత్వాన్ని గాని అభావంగాని ప్రతిక్షణం మనల్ని ప్రభావితం చేస్తున్నాయి గనుక సర్వశాస్త్రాలు ఏక కంఠంతో అంగీకరించిన సత్యం సూర్యుడున్నాడనేది.

బహుశః మహర్షులు కూడా ఈ సమస్యా సింధువును మథించి, మథించి, దృశ్యమాన నశ్వర విశ్వానికి సూర్యుణ్ణి "ప్రత్యక్ష నారాయణుడు"గా ప్రసాదించి వుంటారు. ఒక విధంగా చూస్తే, ఇది నిజమే ననిపిస్తుంది.

వైష్ణవ పురాణాలన్నీ నారాయణుణ్ణే చతుర్భుజుడైన సవిత్రుమండల మధ్యవర్తిగా ఆరాధ్యదైవమని వర్ణిస్తున్నాయి. పురుష సూక్తం సూర్యుణ్ణే విరాట్పురుషుని నేత్రంగా వివరిస్తోంది. ఇక శాక్తంలో చూస్తే దేవీ ఉపాసకులకు సూర్యమండలంలోని గేయ (ఏక) చక్రారూఢయైన దేవ్యుపాసన విహితమని, ఆ సూర్యమండలం ప్రాక్తే వారి ధ్యేయమని 'లలితా సహస్ర నామ భాష్యం' సూచిస్తోంది. మన మంత్ర శాస్త్రం స్త్రీ పురుష రూప దేవత అందర్నీ చంద్రార్కానల త్రినేత్రులుగా రూపించింది. మంత్రశాస్త్రం సూర్యుణ్ణి కూడా త్రినేత్రుడుగానే వర్ణించటం విశేషం. అంటే తానొకరికి అంగంగా కాక తనలోనే మూడు ధర్మాలను ఆవహింపజేసుకొన్న శక్తి రూప మన్నమాట. సృష్టికి మూలాధారమైన కారకశక్తి తనదైన తైజసస్వరూపాన్నీ, పరివర్తనం ద్వారా, పోషకశక్తి, 'ఓషధీనాం పతి' అనే పూర్ణచంద్రుని-సౌమ్యకాంతిరూపాన్నీ, సర్వచేతనాచేతన నాశంకరమైనది దాహకశక్తి-అగ్ని రూపాన్నీ తనలోనే అమర్చుకొని, కరచాలనంతోనే ప్రపంచాన్నీ నడిపించేస్తూ, దేవాసుర నమస్కృతుడైన ఆ అఖండతేజోరూపాన్ని, అగ్నిగర్భుడు, బ్రహ్మ, విష్ణువు, శివుడు అని అన్నా చివరకు సర్వదేవాత్మకుడని సంభావించినా ఆశ్చర్యం లేదు. అతిశయోక్తి కాదు. నిజానికి మన దేవతలందరిలోనూ వర్ణితాలైన గుణాలన్నీ ఇక్కడ మూర్తీభవించాయి.

అతడి గమనంవల్లనే మనకు ఋతువులు, సంవత్సరాలు, పక్షాలు, రాత్రింబవళ్లు ఏర్పాటవుతున్నాయి. అన్ని వస్తువుల స్థిరత్వకాలం దీనివి బట్టి నిర్ణయించటం జరుగుతున్నది. వానలు వరదలైనా, వాగులు వట్టిపోయినా, అవి అతని కిరణప్రభావమే. ఒక్క మాటలో చెప్పాలంటే విశ్వరంగంలోకి రాకడ, నిలకడ పోకడలకు అతని దయాధర్మకిరణాలే ఆధారం.

లౌకికానికే కాదు పారలౌకికాలకు కూడా సూర్యుడే ప్రధాన దైవం. పితృదేవతలను మూడు తరాల వారిని వసు, రుద్ర, ఆదిత్య రూపులుగా గౌరవించటం సంప్రదాయం. మరి రవి ఆ మూడు కూడా శ్రాద్ధాది కర్మలలో 'జ్యోక్చ సూర్యం దృశే' అని విధించటం కూడా ఆదిత్య ప్రధాన్యాన్నే వివరిస్తుంది.

ఇంతెందుకు జడచేతన సమ్మిళిత విశాల విశ్వానికి ఆదిత్యుడే కర్త, హర్త, సాక్షి మాత్రమే కాదు. భౌతిక, పారలౌకిక ఫలప్రదాత కూడా. ఋగ్య జుస్సామ పారగుడుగా మతినందిన అద్భుత తేజఃపుంజం క్రమగతులలో దక్షిణాయనంలో లౌకిక ప్రయోజనాలకు, ఉత్తరాయణంలో పుణ్యప్రాప్తిని కల్గిస్తున్నది. మరి ఇది మకర సంక్రమణకాలం. ఐహికంగా కూడా అధిక వైభవప్రదం. లక్ష్మీకరం. ఆ ప్రత్యక్ష దైవం శక్తి సామర్థ్యాల సంగతెలావున్నా, ఉన్న అవలక్షణాలతో పాటు కృతఘ్నతా (చేసిన మంచిపని పనిగట్టుకు చెడగొట్టటమనే) మకరం బారినుండి దాటిపోగల శక్తి నిత్య శంకాపూర్ణుడైన మానవ జ్ఞాన భాస్కరరూపికి మాత్రం ఇంకా ఏర్పడలేదు. అందుకే 'కృత ఘ్నఘ్నుడు'గా ఏ దేవతకు లేని పేరొందిన ఆ ఆదిత్య రూపి పరదేవతను మన శంకాది సమస్యామకర దళనానికి ప్రార్థిద్దాం.

తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నాయామితాత్మనే,
కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాం పతయే నమః.

* * *

# 20. దీపావళి

"అనగ నవగ రాగ మతిశయిల్లుచు నుండు
తినగ తినగ వేము తియ్యనుండు"

ఇది వేమన వాక్కే ఐనా వేదవాక్కులాంటిది. మానవుని నిరంతర కష్టసహిష్ణుతకు, ఉత్తరోత్తరోత్కృష్ట ధ్యేయసాధనకు పామరసూక్తులలో చెప్పిన పారమార్థిక సత్యం. మథించిన కొద్దీ, క్షీరసముద్రంలో అమృతం పుట్టినట్లు, మానవమేధో మహాసాగరాన్ని సందేహమందరాలువేసి మథిస్తే అమృతతుల్యమైన ఆలోచనలు, అనంతసత్యాలు ఎన్నో అవగతమౌతాయి. ఆరాటంతో మథించి అమృతాన్ని అందుకునేందుకు వీలుగా మహర్షులు, తదే కభావుకులు, మహత్సత్యాలను మంచి మంచి కథల రూపంతో నిక్షేపించారు. దీపావళి కథకూడా ఇలాంటి ఆలోచనలే రేకెత్తిస్తుంది.

ఆచరణకు, ప్రచారంలోవున్న కథలకు ఎంత సంబంధం అని ఆలో చిస్తే దీపావళితోసహా అన్ని పండుగలూ సర్వ ఆచార విచారాల సమరస సమ్మేళనమే అనిపిస్తుంది.

కృష్ణపరమాత్మ విజయంగా తప్ప నరకవధానందరూపంగా చూస్తే నరకునికన్న శూరులు, ధూర్తులు, అతులితపరాక్రమ సంపన్నులు అయిన ఆతతాయి ప్రభువు లెంతమందో వున్నారు. వారందరికి రాని ప్రశస్తి నరకవధకు రావటానికి కేవలం కథాబలంకన్న అన్యకారణమేదో బలంగా ఉండాలి.

ఈ దృష్టితో మనోమథనాన్ని సాగిస్తే ద్వాపరానికి పూర్వమే ఇది ఉందనిపిస్తుంది.

ఈ విశాలవిశ్వం పంచభూతాత్మకం. ఆరాధనకు అర్థం తెలిసినాటి నుండి మానవుడు పంచభూతాలను ప్రాకృతిక రూపంలోనో, ప్రతీకా రూపంలోనో ఆరాధిస్తూనే ఉన్నాడు.

ఒక విధంగా చూస్తే దీపావళి పేర జరిగే ప్రక్రియలు అగ్నితత్త్వా రాధనకు సంకేతమా అనిపిస్తుంది. సూర్యునిలో కూడా ఈ తేజస్సు దాహకశక్తి వున్నా సూర్యుని ప్రత్యేక దేవతగా శాస్త్రాలు రూపొందించాయి గనుక, అగ్నిరూప దివ్యతేజస్సు మనకు పగటికంటే రాత్రిలోనే ఎక్కువ ప్రతిభాసమానమౌతుంది. కనుక, దీపోత్సవాలు రాత్రిపూటే సార్థకాలు ఔతాయి. అన్ని దేశాలలోను ఈ దీపోత్సవం భిన్న విభిన్న మాసాలలో జరగటం చూస్తూనేవున్నాం.

ఇక మనదేశంలో శాస్త్రాలు "ఆత్మానం అరణిం కృత్వా"అని ఆగ్నేయ పావకశక్తిని గూర్చి సంకేతపూర్వక సందేశాన్నిచ్చాయి. ఇదికాక మన దేశం కర్మజ్ఞానాభిభూతదేశం. పుట్టుక నుండి మట్టిలో కలిసే. వరకూ జరిగే కర్మకాండలో వైదికంగాగానీ, పురాణోక్తంగా లేదా సమంత్రక అమం

త్రిక సర్వప్రక్రియలలోనూ అగ్న్యావాహనాదులు ఉండనే వుంటున్నాయి. అది సామాజికం కావాలంటే అందుకు కృష్ణచతుర్దశి, అమావాస్యలాంటి నిబిడతమో నిశలకన్న మంచి సమయం వేరే లేదు.

కాని ఇది ఏచతుర్దశీ, అమావాస్యలలోనైనా జరుపవచ్చు కదా. ఆశ్వయుజాంత దినాలలోనే ఎందుకు జరపాలి?

షణ్మాసాత్మక అయనకాలంలో (జూలై-జనవరి) దక్షిణాయనం భోగ కాలమని, ఉత్తరాయణం (జనవరి-జూలై) యోగకాలమని శాస్త్ర ప్రసిద్ధి ఉంది. కాని కర్మిష్ఠులము పరతత్త్వారాధనకు ప్రతీకలమైన మనం యోగం ముందు భోగానికి పరిమితస్థానమే ఇచ్చాం. అందుకే ఈ ఆరునెల్ల కాలంలోనూ కూడా అత్యానందం, ఆడంబరంగా కనిపించే పండుగలన్నీ మొదటి మూడు నెలల్లో ముగిసిపోతాయి. 'అతి ' ఆరోగ్యానికి మంచిదికాదు కనుక శాస్త్రాలు కార్తీకారంభం నుండి ప్రతిమాసానికి ఒక ప్రత్యేకత పారలౌకిక ప్రాముఖ్యత నిరూపించి ఆహార విహార ఆచార సంయమనంలో పరతత్త్వారాధనలో పాలుపంచుకుని కాలం గడుపుతుండవలసిందిగా నిరూపించాయి. అందుకనే ప్రత్యూషస్నానాలు, పూర్ణోపవాసాలు, ఏకభుక్తాలు, నక్తాలు, ప్రతివ్యక్తికి ఆచరణీయాలయాయి. పేరుకు పండగే అయినా పితృతర్పణార్పణా ప్రాధాన్యతను అంతర్యంలో సంతరించుకున్న నరకచతుర్దశీ దీపావళీదినాలు, భోగనిగ్రహానికి, నిష్ఠాజీవన ప్రారంభానికి సంకేతాలని చెప్పవచ్చు.

మరి భిన్న భిన్న భాషా వ్యవహారాత్మకమైన ఈ దేశంలో కొన్ని పండగలే ఆసేతుహిమాచలం ప్రాచుర్యాన్ని పొందటం, అందులో దీపావళి ఒకటి కావటం విశేషం. సర్వత్ర ఆధ్యాత్మిక చైతన్యమయం, ఉత్తమతా ఆరాధన తత్త్వము నరనరాలలో జీర్ణించుకున్న జాతి కనుక, ఆ తత్త్వాన్ని దాని కనుగుణమైన ఐక్యభావాన్ని ప్రవృద్ధం చేసేవారిని ఆరాధిస్తున్నాం. శ్రీరాముడు, శ్రీకృష్ణులకు పారమాత్మికతా భావంతోపాటు లౌకిక జీవనంలో భిన్న దృక్పథాల ప్రతీకలుగా శ్రీరామనవమి, కృష్ణజయంతి, విశ్వ చక్ర

చాలవకు మూలరూపాల హరిహరుల పేరు వైకుంఠ ఏకాదశి మహాశివరాత్రి, వైకృతబాహిరం, అంతర ఆత్మసౌందర్యారాధనకు ప్రతిబింబంగా వినాయక చతుర్థిని, అఖిలజీవలోక మాతృరూపిణిగా బ్రహ్మ విష్ణు శివాత్మికగా భాసించే మహామాయ పేర దసరా ఉత్సవాలు జరుపుకుంటున్నాం. జాతిని విష్వం కోచంగా ఒక త్రాటిన కట్టగలిగే పండుగలేవో మహర్షులకు బాగా తెలుసు. అందుకే తరాలు శకాలు మారినా ఆ పండుగలను దాదాపు ఒకేవిధంగా ఆ చివర నుండి ఈ చివర వరకు జరుపుకోవటానికి అలవాటుపడ్డాం. చివరకు పిండివంటలలోబడి పండగపరమార్థాలను మరచిపోతున్నాం. ఎన్నిటి పేర ఎన్నిరూపాలలో జరుపుకున్నా అన్నిటి పరమార్థం ఒకటే. మూర్ఖతను త్రుంచు, మంచిని పెంచు, మమతను పంచు, పదిమందితో పాటుపడు-అని.

మనని చేయమన్నవీ మనం మానుకొన్నవీ ఇవే మరి.

ఈ జడత్వ నరకుని పట్టునుండి బయటపడితే మనిషి ఏ రకపు నరకాన్నైనా ఇట్టే దాటొచ్చు.

* * *

# 21. రామాయణ పాత్రలు

కావ్య పరమార్థాన్ని నిర్వచిస్తూ లాక్షణికులు 'విశ్వశ్రేయః కావ్యం' అన్నారు. దీన్నే విభజించి వివరిస్తూ యశస్సు, ధనం, లౌకిక జ్ఞానం, అమంగళ నాశనం, అనిర్వచనీయ ఆనందం కల్గిస్తూ, మగనాలి వాగ్రూపాంతర కట్వోషధంవలె నిగూఢ సత్యాన్ని రసభావములలో ప్రకాశనమొనర్చి విశ్వశ్రేయస్సును సాధించటమే పరమావధి అని మనీషులు మనకు చెప్పారు. ఈ ఒరిపిడికి గురై పరీక్షకు నిల్చిన సాహిత్యమే సార్వజనీన సార్వకాలీనమైన ఆదరణను పొందగలుగుతుందని నిరూపించినవి మన రామాయణ మహాభారత కావ్యాలు. వివిధ పాత్రల ప్రవృత్తి ధర్మాన్ని, వాటి గుణదోషాలతో సహా

నిష్పక్షపాతంగా నిరూపించి 'ఇతి హ ఆస' - ఇది ఇలా జరిగింది అని చెప్తూ సూక్ష్మాతి సూక్ష్మ రూపంలో మహత్తరసత్యాన్ని మనకందించ గల్గినవి గనుకనే అవి ఇతిహాసాలుగా కూడ పరిగణనకువచ్చి మన సంస్కృతికి రెండు కళ్ళు కాగల్గినాయి. గుణావగుణభూయిష్ఠమైన ప్రతినాయక ప్రవృత్తిని, ఉదాత్తంగా రూపొందించి ఒక మహోన్నత సత్యాన్ని చాటేందుకు కుపయోగించటం మన సాహిత్యంలోని విశిష్టత.

రామాయణంలో ప్రతినాయక పాత్ర రావణుడు. ముల్లోకాలను జయించిన మహావీరుడు పులస్త్యబ్రహ్మ మనుమడు, స్వయంగా రుద్రవీణను కల్పించగల సంగీత కళాభిజ్ఞుడు, వివిధ మాయా విద్యావిశారదుడు. వ్యాకరణాన్ని రచించిన పండితుడు. లంకానగరంలో ఇంటింటా వేద ఘోషను ప్రతిధ్వనింపజేసిన వేదవేత్త. తాను మరచిన నర వానరులకు తప్ప మృత్యువుకే మృత్యు స్వరూపుడు. మహాతపస్వి. ఇంతేకాదు కైలాసాన్నే కదిలించిన శివభక్తుడు. అధ్యాత్మరామాయణంలో అతడు కొంతవరకు ధర్మపరుడేనని, దుష్టబుద్ధుల ప్రేరణవల్ల దృష్టి మారిందనీ తెలుస్తుంది. రావణుని కుమారుడు మేఘనాథుడు, తండ్రిని బంధించిన ఇంద్రుని నిగ్రహించి ఇంద్రజిత్తనిపించుకొన్న పోటుమానిసి. అగ్నిష్టోమ, అశ్వమేధ, బహుసువర్ణ, రాజసూయ, గోమేధిక, వైష్ణవ, పాశుపత నామక సప్తాధ్వరయాజియై తండ్రికన్న ఏడాకులు ఎక్కువ చదివినవాడు. ఇక రావణుని తమ్ముడు కుంభకర్ణుడు ఎంతటి వీరుడో అంతటి రాజనీతివేత్త. భ్రాతృప్రేమకు బలిపశువైనా, మొదటగా రావణుని ధిక్కరించి తప్పను చూపినవాడు, విభీషణునికి ముందే విష్ణుతత్త్వమును తెలుసుకొన్నవాడు. మారీచుడు, శుకుడు, మాల్యవంతుడు, మండోదరి మొదలైన నీతికోవిదపరివారమును గలవాడు రావణుడు.

'ఆత్మానం మానుషం మన్యే' అన్నవాక్యమును అతిక్రమింపని నాయకుడు రాముడు. పితృాజ్ఞాపాలనార్థం, వనవాసానికి వచ్చి అనేక ఇదుమలపడినవాడు. సోదర సహాయుడై పరస్థలమున, కపివీరుల సహాయంతో,

కేవలం రాజధర్మార్థం రావణునితో యుద్ధానికి సిద్ధమైన, ధర్మదీక్షాపరుడు. కేవలం ధర్మమే రూపుగా నిల్చిన వ్యక్తి. మరి ఈ రామలక్ష్మణ బాణాల కమేయ వర మహిమాన్వితమైన రాక్షసలోకం దరిదాపుగా నిర్వంశమైనది. ఎవరి మహత్తరశక్తులూ రామబాణం నుంచి రక్షించలేక పోయారు.

మరి నాయకుని ప్రతిభాశక్తులు పరోక్షంగా రూపించే ఈ రామాయణ కావ్యం సమాజానికిచ్చే సందేశం, ఆపాదించే విశ్వశ్రేయస్సు ఏమిటి? పాంచ భౌతికమైన శరీరంతో పుట్టిన ప్రతిజీవి ఒకనాటికి విచ్ఛేదాన్ని పొందవలసిందే. అస్త్రశస్త్రాలు, వరాలు కేవలం జీవనకాలాన్ని పొడిగించగలవే తప్ప లయాన్ని ఆపలేవు. అందువల్ల ప్రాకృతిక తురీయావస్థ ఐన కాలస్వరూపం ఏ కారణంవల్ల జీవి తనకు సన్నిహితుడౌతాడా అని అన్వేషిస్తుంది. ఏ చిన్న బలహీనతనో లేక దుష్ట ప్రవృత్తినో ఆధారం చేసుకొని ఎంతటి వరగర్వితు లైనా కైవసం చేసుకుంటుంది. మానవుడు అరిషడ్వర్గానికి లోనైనకొద్దీ అది మరింత చేరువౌతుంది.

కనుకనే మృత్యువు రామలక్ష్మణాది రూపంలోనిల్చి రావణాది సమస్త రాక్షసకుల నాశనానికి కారణమైంది. రామాయణంలో రామబాణహతమైన అన్ని పాత్రలకు ఈ సూత్రం వర్తించింది. రాముడనే మహాకాల స్వరూపాన్ని తప్పించుకోవాలంటే శరణాగతిని మించిన సాధనం లేదు. అహంకరించిన వాడికి అంతం తప్పలేదు.

మానవుని మనుగడ ఎన్నేళ్ళున్నది కాదు. ఏలాంటిదన్నదే చరిత్రకు ముఖ్యం. 'అయ్యో పోయాడు' అనిపించుకోవటమో 'అబ్బ! పోయా'డని పించు కోవటమో మనమే నిర్ణయించుకోవాలి. రామాయణం పామాన్యుల దగ్గర్నుండి ధీమాన్యుల వరకు చెప్పే గుణపాఠం ఇదే.

* * *

# 22. ఆంజనేయుడు

నాల్గువేదాలు తెలిసినవాడు, తర్కవ్యాకరణ శాస్త్రాలు అధ్యయనం చేసినవాడు తప్ప ఇలా మృదుమధురంగా మాట్లాడలేడు. ఇవి శ్రీరాముడు లక్ష్మణునితో అన్నమాటలు. కాని, శ్రీరాముడు రాజవంశములోనివాడు గనుక, మైత్రి కోరివచ్చిన సుగ్రీవమంత్రి ఆంజనేయుణ్ణి గూర్చి ఇలా అనుకోవడంలో ఆశ్చర్యం లేదు.

ఆహో! ఏమి అతని తేజం. ఇతడు నాపై విరోధంతో వచ్చిన శ్రీహరి, లేదా నన్ను శపించిన నందీశ్వరుడే ఈ రూపంలో వచ్చివుండవచ్చు.' ఇవి తన సభలోకి ఇంద్రజిత్తు బంధించి తీసుకొచ్చిన ఆంజనేయుణ్ణి గురించి రావణుడు అన్న మాటలు. తన ఉద్యానవనాల్ని ధ్వంసంచేసి, గారాలపుత్రుడు అక్షరకుమారుణ్ణి కనికరం లేకుండా చంపివేసిన వ్యక్తి తన ముందున్నప్పుడు కలుగవలసిన రోషక్రోధాలకు బదులు ఆంజనేయునిలోని దైవీశక్తి, భగవదంశ, తేజస్సు, అంతేకాదు భగవదవతారమే అన్న నమ్మకం, విభ్రాంతి రావణునికి కలిగాయి. రావణుడు కూడా ఆధ్యాత్మిక విదుడు గనుక, శివభక్తుడు గనుక ఆంజనేయునిలోని దైవీతత్త్వాన్ని సందర్శించగలిగాడు. ఈ రెండూ రాయబారఘట్టాలు కావటం విశేషం. ఒక ఘట్టంలో రాముని ప్రాపుకోరే సుగ్రీవుని మంత్రిగా మిత్రలాభం చేకూర్చాడు. రెండవదాంట్లో రావణునకు హితవు బోధించినా, ఎదిరిపక్షం విషయంలో రావణుని హృదయంలో భయం కల్గించి, విభీషణునిలో మానసికంగా రావణునిపట్ల వైముఖ్యపునారు పోసి మిత్రభేదతంత్రాన్ని సఫలం చేశాడు. భారతంలో కౌరవ సభలో శ్రీకృష్ణపరమాత్మ కూడా తన అనంత శక్తియుక్తులను ప్రదర్శించాడు. అయితే అటు రావణుడు, ఇటు దుర్యోధనుడు కూడా రాయబారాలను, రాయబారులను అవమానించి తమకు తామే ముప్పు తెచ్చుకున్నారు.

స్వామిభక్తి విషయంలో రామాయణంలో విలక్షణత కన్పిస్తుంది. లక్ష్మణుడు, ఇంద్రజిత్తు ఒక విధమైన మనస్తత్వం కలవారు. శస్త్రధారణ

ప్రభుసేవకోసమే అన్నది వీరి వాదన. స్వామిపట్ల అచంచలవిశ్వాసం కర్తవ్యనిష్ఠురత వీరి ప్రధానధ్యేయాలు. రెండవకోవ భరత విభీషణులు. అకార్యకారకు లెంతటి పూజ్యస్థానీయులైనా త్యాజ్యులే అని వీరి నమ్మకం. అందుకే అకార్యచరణద్వారా తనకు రాజ్యాన్ని కట్టబెట్ట సంకల్పించిన మాతృశ్రీ కైకేయిని భరతుడు, సీతాపహరణం ద్వారా రాక్షసలోక వినాశనానికి నాంది పలికిన రావణుని వదిలేసిన విభీషణుడు ఈ కోవకు చెందినవారు. ప్రభువుకు హితాన్ని నిష్పాక్షికంగా బోధించినా, వినక ఆత్మనాశాన్ని కొని తెచ్చుకొన్నప్పుడు కూడా, త్యజించక, వీరస్వర్గం అలంకరించిన కుంభకర్ణుడు స్వామిభక్తికి మరొక క్రొత్తసాక్ష్టి.

కాని, ఆంజనేయుని స్వామిభక్తి అతివిచిత్రమైనది. వినూత్నమైనది. విశిష్టమైనదికూడా. నిజానికి వాలికి మంత్రి హనుమంతుడు. అన్న వెడల గొట్టగా ఋష్యమూకం చేరిన సుగ్రీవునితోపాటు విడవకుండ సుగ్రీవుని సేవించాడు. స్వామిభక్తి ప్రబోధితుడై రామమైత్రితో వాలివధ కూడా సాధించినా వాలికిగాని, తారకుగాని హనుమంతునిమీది గౌరవభావం తగ్గకపోవడం రామాయణంలో కన్పిస్తుంది. దాసోఽహం కోసలేంద్రస్య అని చెప్పుకొన్నా సుగ్రీవానుచరుదుగానే పనిచేసినట్లు కన్పిస్తుంది. ఆ అసిధారావ్రతాన్ని రామాయణం కడదాకా నిర్వహించాడు. ప్రతి కష్టతర కార్యసాధనకు మారుతి ప్రధానపాత్ర వహించడంటే అది అతని ధైర్య, స్థైర్య సమయజ్ఞతకు నిదర్శనం. అందువల్లనే హనుమద్దౌత్యం కల సుందరకాండ నూతనమైన ఆధ్యాత్మిక నిర్వచనాలను పొంది, ఆంజనేయుని ఆచార్యపీఠాన నిలబెట్టింది.

హనుమంతుడు ఎంతటి రణపండితుడో, అంతటి సహృదయుడు కూడా. బాలుడు రణప్రచండుడైన అక్షకుమారుని సంహారంపట్ల అతని తాపం, కొలువుదీరిన రావణునిచూచి అధర్మ లేశం బలవత్తరం కాకపోతే; దేవేంద్రునితో కలిపి ముల్లోకాలేలకలవాడని మెచ్చుకోవటం, యుద్ధకాండలో నా చేలిదెబ్బలకి నీ వింకా బ్రతికి ఉండటం నా బలానికే మచ్చ అని

రావణుని రణసహిష్ణుతను ప్రశంసించటం మానవులమైన మనకు అబ్బవల సిన, ఆంజనేయస్వామికి అబ్బిన విద్య.

చెప్పదలచుకొన్న మాటను ఉత్తరోత్తర ఆలోచన కుపకరించే ధ్వనితో చెప్పటం ఒక విశిష్ట విద్య. అందులో కూడా ఆంజనేయుడు అఖండ పండితుడు. లంకంతటా చాటిన- "దాసోఽహం కోసలేంద్రస్య రామస్యా క్లిష్ట కర్మణః" అన్న శ్లోకం ఒక ఉత్తమ ధ్వనే అని చెప్పాలి. నేను రాముని సేవకుడను అన్నందువల్ల ప్రయోజనం సిద్ధించదు కనుక, రావణుని తోకతో బంధించి నాల్గుసముద్రాలు త్రిప్పిన వాలి (అంతటి బలసంపన్నుడు) తమ్ముడు సుగ్రీవుని మంత్రినైన నేను రాముని సేవకుడను. అంటే నరుడైన రాముడు ఎంతటి బలపరాక్రమసంపన్నుడో ఊహిస్తే అర్థమయ్యే విషయం.

ఇలా ఎంతైనా చెప్పవచ్చు. ఎన్నైనా చెప్పవచ్చు. ఏమి నేర్చుకుంటా మన్న ప్రశ్న? రావణాంతఃపుర స్త్రీలను వివిధావస్థలలో చూచినా మనస్సు చలించకపోవటం ఆంజనేయస్వామికే చెల్లింది. మరి మనం వాటినుండి నేటి వరకు రాక్షసత్వమే నేర్చుకున్నాం. కాని రక్షకత్వం నేర్చుకోలేదు. మనలోని రాక్షసులు మాయమయ్యే వరకు మన కిదే శరణ్యం.

మనోజవం మారుతతుల్యవేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్,
వాతాత్మజం వానరయూథముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి.

* * *

# 23. రామాయణ - భారతాలు

కాలం చాలా చిత్రమైంది. ఎప్పటిమాదిరే ఏదో గడుస్తున్నట్టున్నా, ఇంకొక ప్రక్క ఏమీ మార్పు జరగలే దన్న భావన కూడ కలుగుతుంది.

అయితే మార్పు అనేది కాలసహజమైన పరిణామం. భౌతిక లౌకిక వ్యాపకాలకు సంబంధించిన మార్పులు మాత్రము మనకు కొట్టవచ్చినట్టు కన్పిస్తాయి. కాని మౌలికమైనవి సామాజికమైనవి మాత్రము చాపక్రింద నీరు మాదిరి మనకు తెలియని మార్పును తీసుకువస్తాయి. ఆ మార్పును గ్రహించే సమయానికే చెయిజారి మానవజాతి మహావినాశానికి దగ్గరలో వుంటుంది. సకాలంలో మార్పు గమనించలేని మనిషి స్థితి చేతులుకాలిన తరువాత ఆకులు ముట్టినట్లే వుంటుంది. ఇది భారత రామాయణాలకు గాని, త్రేతా ద్వాపర యుగాలకు గాని, రామకృష్ణావతారాలకు గాని సంబంధించిన స్థూలమైన సమాజ విశ్లేషణ.

ఈ దృష్టితో చూస్తే మానవుడి మీద కాలప్రభావం ఎంత బలమైందో, నైతిక విలువలు ఎంతగా దిగజారిపోయాయో స్పష్టమవుతుంది.

రామాయణకాలమంతా ఒక కమనీయ కావ్యం లాంటిది. అన్ని ధర్మాలు జీవన విధానాలూ అంతా ముందే నిర్దేశించబడి మనుషుల బ్రతుకులను రాచబాటన నడిపించాయి. అధర్మవర్తనుడైన రావణుడు కూడా తగుపాటి ధర్మయుద్ధమే సాగించిన రోజులవి. పరిపూర్ణ దురహంకార పూరిత దుష్టప్రవర్తకులైతే తప్ప 'బ్రతుకు, బ్రతకనీ' అన్న సహజీవన, సమజీవన సిద్ధాంతాన్ని ఆదర్శంగా అనుసరించిన కాలమది. కనుకనే శ్రీరామచంద్రుడు రావణాదుల దుష్ట శిక్షణకే అవతారాన్ని ధరించాడు.

మరి కృష్ణావతారమో- కాలం ఎంత దిగజారి పోయిందో, బ్రతుకనీయని సమాజంలో బ్రతుకు ఎలా సాగించాలో స్పష్టంగా నిరూపించిన కాలం. కనుకనే ఆ కాలం భ్రూణ శిశు హత్యలతో ప్రారంభమైంది. భ్రూణ హత్యలతోనే అంతమైంది. మహాపురుషుడు శ్రీకృష్ణుడు సైతం బ్రతికి బట్టకట్టడానికి ఎన్నో అవాంతరాలను, ఆపదలను ఎదుర్కొనవలసి వచ్చింది. మరి కష్టాలలో నిగ్గుదేలిన మనిషి సమాజానికిచ్చే సందేశం తదనుగుణంగానే వుంటుంది.

ఇక కౌరవ పాండవుల కలహాలు కాకతాళీయం కాదు. పరంపరాగతమైనటువంటి మార్పులకు అది ప్రతిబింబమే. రామాయణ కాలంనాడు అన్నదమ్ములందరూ రాజ్యం మా కక్కరలేదంటే అక్కరలేదని పోట్లాడు కుంటే, భారతకాలంనాటి ఆ రాజ్యకాంక్ష అనేక వివాదాలకు, వికృత వేషాలకు ఆస్పదమై, ద్రౌపదీ వస్త్రాపహరణ రూపంలో సామాజిక మూల్య వినాశనానికి పరాకాష్ఠగా రూపొంది, చివరకు సమస్త రాజలోకాన్ని బలి తీసు కుంది. నిజానికి రామాయణకాలంలో యుద్ధం రామరావణులకు మాత్రమే. కాని భారతయుద్ధంలో సమస్త రాజలోకము విభక్తమై ఆత్మబలిదానంతో సౌష్ఠవ సుస్థిర సామాజిక వ్యవస్థకు పునాదులు వేసింది. ఇరుపక్షాలలోను మంచీ మన్ననా కోరిన మహామహులెందరో కర్పూరకళికలయి పోయారు. ఇంతటి దారుణ మానవ వినాశానికి కారణం భారతకాలం నాటికి సమాజంలో పెరిగిన మహత్త్వాకాంక్ష కారణం కదూ. ఈ మార్పును గ్రహించగలిగి ద్యూతం- అనుద్యూతం నాడే ఆపగలిగి వుంటే ఇంతటి ఘోరణహోమం అవసరమా? కనుక పతనమౌతున్న జాతిలో తప్పు వెనుక తప్పు, తప్పు కప్పేందు కొక తప్పు, ఇలా తప్పులకుప్పలు ఎంతటి వినాశానికి దారి తీస్తాయో, ఈ వినాశ పూరిత విషవలయంలో చిక్కిన పాండవులలాంటి వారికి మనుగడ సాగించాలంటే ఆ వాతావరణాన్ని సమతులనం చేసి సహాయం చెయ్యగల కృష్ణపరమాత్ముని ఆసటా బాసటా ఎంత తప్పనిసరో అర్థమవుతుంది.

అసలు ఇంతటి వినాశాన్ని ఆత్మనిగ్రహం వుంటే వ్యక్తి అవలీలలగా ఆపగలిగేవాడు. కనుకనే కృష్ణభగవానుడు భారత యుద్ధగీతలో ఆత్మే ఆత్మకు శత్రువని, ఆత్మే ఆత్మకు మిత్రుడని, ఆత్మ సంయమనమే అన్ని అభ్యుదయాలకు ఆలవాలమని నరుని మూలంగా- విచ్చల విడిగా ప్రవర్తించే- ఈ నరజాతికి ప్రబోధించాడు. ఇదే కృష్ణావతారం సమాజానికి ఇచ్చిన సందేశం.

కేవలం 'ఉట్లు కొట్టెను, వెన్న మెక్కెను, కొంగు పట్టెను' అని బాల్యక్రీడా వర్ణనలలో సంతుష్టులం కాక సామాజికోజ్జీవనానికి అన్నిరంగాలలో

అరితేరిన ప్రవీణులుగా భగవాను డందించిన సామాజిక సముత్థాన సందేశం అందుకో గలిగితే అందరం ధన్యులం!

మత్కర్మకృ న్మత్పరమో మద్భక్త స్సంగవర్జితః,
నిర్వైర స్సర్వభూతేషు యస్స మామేతి పాండవ.

(గీ. 11-55)

* * *

# 24. భారతం-కృష్ణుడు

మమ వర్త్మానువర్తంతే
మనుష్యాయాః పార్థ సర్వశః

అని గీతలో భగవానుడు సెలవిచ్చారు. అంటే మానవులంతా అనేక విధాలుగా నా మార్గాన్నే అనుసరి స్తారు అని. అది ఏ మార్గం? దాన్ని మనం ఎందుకు అనుసరించాలి? అనుసరించక పోతే ఏమౌతుంది?- ఇలాంటి ప్రశ్నలు కార్యకారణ వాదు లందరికి కలిగేవే కలగ వలసినవే. నిజానికి రామాయణ, భారత సాహిత్యాల్ని పరిశీలిస్తే వ్యవస్థాత్మకమైన కాలానుగత విపర్యాసాన్ని ఒక విశిష్టమైన సూత్రం ద్వారా ప్రకటించారా అనిపిస్తుంది.

రామాయణ కాలంలో ధర్మాచరణం వ్యవస్థాగతంగా కాక వైయుక్తికం గానే ఉండేది. రఘువంశపు రాజులంతా "నా విష్ణుః పృథివీపతిః" అన్న పూర్వనానుడి కాధార భూతులైనందువల్ల ప్రజాహితమే పరమావధిగా ఉన్న తమ వంశపు వారెవరికీ తన జీవన విధానం వల్ల ధర్మచ్యుతి కల్గిందన్న భావన రాకూడదనే తపనతో తనువులు వెళ్ళదీసుకున్నారు. రామాయణంలో మర్యాదాపురుషోత్తముడైన శ్రీరాముడు ఎక్కడాకూడా తన మార్గాన్నే ప్రజ లంతా అనుసరిస్తారని గాని అనుసరించాలని గాని పేర్కొన్నట్లు కన్పడదు. ఆ ఆదికావ్యంలోనే పాత్రలన్నీ మూర్తీభవించిన ఆదర్శాలు. తమవల్ల కుల

కళంకం రారాదని కష్టాల కెదురీది కైవల్యం కైవసం చేసుకున్న అపార ఆత్మ నిష్ఠాగరిష్ఠులు వారంతా.

కాని భారతకాలానికి ధర్మం పూర్తిగా నలిగిపోయింది. ధర్మాధర్మ విచక్షణకు వినూత్న వ్యాఖ్యలు అవసరమనిపించాయి. అందుకే మారుతున్న సమాజంలో ధర్మచాలనానికి కృష్ణావతారం ఏర్పడింది. రామాయణం మనిషి ఎందుకు బ్రతకాలో బోధిస్తే, భారతం ఎలా బ్రతికితేనే బ్రతకగలడో కృష్ణావతారం ద్వారా ప్రతిబింబింప జేసింది.

శ్రీకృష్ణుడు ఎలాంటి వాడన్నది బోధపరచుకో గలిగితేనే కృష్ణావతారానికి సమాజంలో గల విలువ ప్రస్ఫుటమౌతుంది.

గీతలో చెప్పినట్లు ఏదో అయాచితంగా వచ్చినవాటితో తృప్తిపడుతూ, సుఖదుఃఖాలకు అతీతుడుగా వుంటూ నిరహంకారిగా జీవితం గడపాలని శ్రీకృష్ణుని ఆశ. కాని ఆ ఆశ ఆదిలోనే అంతమై మేనమామ జరిపిన హత్యాప్రయత్నాలను అరాచకవాదాలను ఎదుర్కొనే గుండె నిబ్బరాన్ని చిన్నతనం నుంచీ అలవర్చుకోవాల్సి వచ్చింది.

అందుకే తనలాంటి వాళ్లంటే కృష్ణభగవానునికి ఎంతో ప్రీతి. ఆనాటి రాచరికపు సమాజంలో తనలాగా చిన్నతనంలోనే రాజకీయ దౌష్ట్యాలకు గురైనవాళ్లు పాండవులు మాత్రమే. కేవలం మేనత్తకొడుకులనే భావంతో మాత్రమేగాక సహబాధితులన్న సానుభూతికూడ ఆ పాండవులను (నర నారాయణ) ఆయన సాన్నిహిత్యానికి చేర్చింది. అందుకనే విజయ రథసారథిగా కూడా భగవానుడున్నాడు.

తానాశించిన ధర్మం వైయక్తికం మాత్రమే గాదు, సామాజికమైంది కూడ. రామావతారంలో అందరికి ముందు నేనున్నానని నిలిచిన భగవానుడు, భారతంలో 'బాధ్యత' లన్నీ సమాజానికి అప్పగించి విశ్వనాటక రంగసూత్రధారి పాత్రను మాత్రమే స్వీకరించి, అయినవారందరికి ఆత్మ

సఖుడుగా, ఉపదేష్టగా వర్ధిల్లాడు. గీతాబోధతో, నిత్యసంశయాత్మక సమాజానికి ఆచార్యుడుగా కూడా ఆరాధనీయుడయ్యాడు.

మనం అంతగా అన్వయించక పోయినా, నిజానికి "ఉద్ధరేదాత్మ నాత్మానం నాత్మాన మవసాదయేత్" అన్నదానికి లౌకికార్థం సూచించిన మనిషి శ్రీకృష్ణుడు. నిన్ను నీవే బాగుచేసుకోవాలి. ఎదురుచూపువల్ల ఏం లాభం లేదనీ, తనకు తానే సరైన బాట వెతుక్కోవాలనీ చాటి చెప్పినది కూడా కృష్ణభగవానుడే.

ఒక్క దేవు డన్న సత్యాన్ని విస్మరించి చూస్తే అన్నివిధాలా మనకు అతిదగ్గర వ్యక్తి శ్రీకృష్ణుడు. మనవలె మరణంలో కూడ మనవాడైన మనీషి, మూర్తి, భూతజ్ఞానరాశి మనకు కావటంలో ఆశ్చరం ఏముంది?

భారత కృష్ణుడు ఎంత మానవతావాదో అంతటి రాజనీతిజ్ఞుడు కూడా. విశ్వచక్రాన్ని తానే నడిపిస్తూ కూడా తను కూడ దానిలో అంగభూతమై తన పాత్రను వినమిత శీలంతో నిర్వహించి గెలుపు సాధించుకొన్న నీతివిదుడు. సంధిజరగదన్నది తెలిసినా రాజతంత్రంలో భాగంగా దౌత్యం నెరపి దాని ఫలితాన్ని పాండవులకు అనుకూలంగా నడిపించగలిగిన అసమాన శేషముషీధురంధరుడు.

అందుకే "మన్మనా భవ, మద్భక్తో, మద్యాజీ మాం నమస్కురు" అన్నప్పుడు మనకు కన్పించేది కేవలం పారమార్థికమూర్తి మాత్రమే గాదు. అపారలౌకిక విశ్వవిజ్ఞాన పాథోధిని మథించి, అష్టాదశానర్ఘ మణిహారాన్ని జాతి కందించిన ఆ వాసుదేవకృష్ణుడు నా మాటా, మతే, మీకు బాటా, గతీ, అనీ ఆ యోగేశ్వరేశ్వరుణ్ణి అనుసరించినవారికి "మోక్షయిష్యామి మా శుచః" అని సకలార్తిహరణుడుగా సందేశం ఇస్తున్నాడు.

* * *

# 25. గీతార్థం

బ్రహ్మాండం మొదలు బ్రహ్మ వరకు విశ్వంలో అన్ని వస్తువులూ వస్తూ పోతూ ఉండేవే. నన్ను చేరినవాడు మాత్రమే శాశ్వతుడు. ఇది అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన కృష్ణభగవానుడి వాక్కు. ఇది చెప్పగల ధైర్యం స్థైర్యం వైచిత్ర్యం ఆయన దగ్గర ఉండడం వల్లనే శ్రీ కృష్ణుడు భగవానుడయ్యాడు. అంతేకాదు. ఈ బ్రహ్మాండంలోని ఏయే వస్తువుల్లో, ప్రాణుల్లో తన రూపం ఉందో వివరించాడు. అది ఎంతదాకా జనాన్ని మోహింప జేసిందంటే అన్ని రంగాలు మార్గాల వాళ్ళూ తమదే గీతాపథం అని గగ్గోలుగా సమర్థించుకునేంత వరకూ పోయింది. కొందరు మేం గొప్ప వాళ్ళమని భుజాలు చరుస్తుంటే మరికొంతమంది మేం తక్కువ వాళ్ళమా అని గీతాసూక్తులాధారంగా గోదాలోకి దిగుతున్నారు. ఇవన్నీ చూసిన మరికొందరు దీన్ని వైవిధ్యాల పుట్టగా, భారతంలో గుట్టుగా పుట్టించిందనీ, కొట్టి పారేస్తున్నారు.

మరికొందరు గీత తాతలకోసం, మన తరాల కది ఎంతో దూరం అని తాము దూరంగా పరిగెత్తుతున్నారు.

మనమిలా మథన పడ్తుంటే, మరొక ప్రక్కనుంచి మీ ఇంటి ప్రసాదం మాకూ కొంత పంచి పెట్టండని మన సాహిత్యాన్నంతా వాళ్ళ సొంతమా అన్నంత ఆరాధనతో అర్థాలు విశేషార్థాలు, వెతుక్కుంటున్నారు. అందుకే గీతకు మన కెన్ని భాషలో అన్ని భాషల్లో వ్యాఖ్యానాలు అక్కడా అవతరించాయి.

ఒక్క ఉర్దూలోనే 20పైన వ్యాఖ్యానాలు వున్నాయట! అయినా గీత రాతలను గూర్చి ఎన్నో కొత్త కొత్త రాతలొస్తూనే ఉన్నాయి. ఇంతగా గీతలో మనకు అభాస వైవిధ్యాన్ని సృష్టించి పరమాత్మ రెండే రెండు మాటల్లో మొత్తం వైవిధ్యాన్ని కొట్టి పారేశాడు. "మాః మవజానంతి

మూఢా మానుషీం తను మ్మాశ్రితం", "మమ మాయా దురత్యయా" అని అంటే స్థూలంగా నరరూపంలో ఉన్న నన్ను నరులెవ్వరూ గుర్తించరు. నా మాయ దాటరానిది అని అంటే ఏమిటి మొదటిదానికి ఒక గూఢార్థం ఉంది. అవజానంతి అన్నమాట వాసుదేవ కృష్ణుణ్ణి గూర్చికాదు.

సర్వభూత మహేశ్వరుడు, సర్వభూతాంతరాత్మ ఐన పరమాత్మ ప్రతి హృదయపీఠంలోనూ పదిలంగా వున్నాడని తెలిసిన మనిషికి లౌకిక మత్స రాలలో తోటి మనిషిని హీనంగా చూచే దైన్యస్థితికి దిగజారుతున్నాడన్నది గమనించదగ్గ గూఢార్థం. తమ గొప్పలు ఎదుటి తప్పులు ఎన్నటంలోనే ఉన్న కాస్త జీవితం కాలంలో కలసి పోతున్నది తప్ప కొంచెం కూడా మంచికి నోచుకోవటం లేదు.

అసలీ వైషమ్యా లెలా ఎందుకు వస్తున్నాయన్నదానికి 'మమ మాయా దురత్యయా' దాటరానిది నా మాయ. అంటే పరమాత్మ మాయ వల్లనే పరిపరివిధాల ఘర్షణలు ఏర్పడుతున్నాయన్నమాట. మరమనుషుల మన్న మర్మం, మరచిపోయి మనమే చేస్తున్నామని మురిసి ఎదుట వారిని ఎద్దేవ చేయుటం ఒక పెద్దమాయ, అనర్థానికి అతి ముఖ్యమైన ముఖ్య కారణం. కదిలేది, కదిలించేది తనుకాదని తన చేతిలో ఏమీలేదని తనపనినే పరమాత్మని కైంకర్యంగా తరించాలన్న సర్వజన సామాజిక సూత్రం బోధించింది గీతాకృష్ణుడే.

అసలు మనిషెలా బ్రతకాలి అన్నమాటకు రెండు మాటల్లో చెప్పేశాడు. యస్మాన్ నోద్విజతే లోకః లోకా న్నోద్విజతే చ యః- తన వల్ల లోకానికి, లోకం వల్ల తనకు కంపరం ఎవరికి కల్గదో వాడు ధన్యజీవి అని. ఇదీ మనిషి మనుగడకు గీత అందించిన మహనీయ సూత్రం. దీన్ని కాదనగల జాతి ఇంతవరకు కన్పడలేదంటే అసత్య మేముంది?

గీత నడచింది భారతీయులైన నర నారాయణుల నడుమే ఐనా, జాతి మత భేదాలు లేకుండా మనిషి మనిషిగా బ్రతికి మహనీయస్థితికి

చేరటానికి మన మంచికి మనకు శ్రమ తక్కువైన చిట్కా లెన్నో ఈ దివ్యనవ జీవనౌషధి సర్వస్వంలో సమృద్ధిగా వున్నాయి.

ఇది పుట్టిన దిన సందర్భంగా ఇందులో సత్యాలను ఆకళింపు చేసుకుని ఎవరు ఎలా, ఎలా ప్రయత్నిస్తే అలాంటి ఫలాలే అందుకోగలుగుతారు. ఊరికే అన్నారా, చేదుకున్న వారికి చేదుకున్నంత మహదేవా! అని.

* * *

# 26. పత్రం పుష్పం

పత్రం పుష్పం ఫలం తోయం
యో మే భక్త్యా ప్రయచ్ఛతి,
తదహం భక్త్యుపహృత
మశ్నామి ప్రయతాత్మనః.

అని గీతలో భగవానుడన్నాడు. భక్తితో వీటిలో ఏ దిచ్చినా స్వీకరిస్తా నన్నాడు. పంచభక్ష్య పరమాన్నాలు ఎన్నో ఉన్నా వాటిని గూర్చి ఎందుకు చెప్పలేదు? అంటే భగవానుని ఆడంబర నిరసనకు ఇది నిదర్శనమా అన్న సందేహం కొంతమందికి రావచ్చు.

కాని నిజానికి ఫలపుష్ప పత్ర తోయాదులు నిత్యనూతనాలు, నిర్మలమైన సర్వజీవన సంజీవనాలు. నిరంతర త్యాగైక జీవనాలు అవి. వాటి జీవిత సత్యాన్ని సంతరించుకొని సోహం సోహమ్మని చిందులువేసే మానవుడు త్యాగైకధనుడుగా మాధవుడుగా ఎదగాలని భావించినా బుధులు, జనసందో హాలకు దూరంగా ఏ కొండకొమ్మునో జలజలల సెలయేటి జాలుప్రక్కనో ఫలపుష్ప సంభరిత వనవీథుల్లోనో ఆశ్రమాలు ఆరాధనాలయాలు అమర్చి అహ్లాదమయ- ఆరోగ్యకర వనసంపద నడుమ మనస్సును మాధవాయత్తం చేసి తపించి తరించవలసిందిగా సూచించారు. ఆ ఆడంబర రహిత

పరమాత్మార్చనలో అతివిలువైనవీ నిర్మలమైనవీ అర్పించి అంతో ఇంతో ప్రసాదంగా స్వీకరించి, మనః పావిత్ర్యాన్ని పక్వతను సంపాదించుకొన్నాడు మానవుడు.

ఈ వనసంపద ఇంత పవిత్రమైందీ నిర్బాధకమైంది కనుకనే సర్వ జగన్నాథునికి కూడ అతి ప్రీతిపాత్రమై ఆడంబర రహితారాధనకు ఆలంబనమైనది.

ఊరు పేరు లేని పరమాత్మను పేరుతో ఊరుచివర ప్రతిష్ఠించి అర్చించటం ప్రారంభమైనప్పటినుండి మానవుడు ఆరామాలు, ఆశ్రమాలు కల్పించుకొని నామజపయజ్ఞంతో పాటు, ఫలయజ్ఞం, పుష్పయాగంలాంటి ఆరాధనలు జరిపి ఆ దివ్యవిభూతి సందర్శనానంద పారవశ్యంలో మునిగి తేలుతూ "అభిషేకప్రియః శ్శివః, అలంకారప్రియో విష్ణుః, నమస్కార ప్రియో భానుః" అని ఎవరెవరి నెలా అర్చించి తరించవచ్చో తరువాతి తరాలకు వివరించాడు.

అలాగే తిరుమలలో శ్రీవారి ఆలయంలో కూడా పల్లవోత్సవం, ఫలోత్సవం, ప్లవోత్సవం, పుష్పయాగం జరగటం కొత్తవేమీ కాదు. సురుచిర స్నిగ్ధ వనసంపదతో పరమాత్మ నర్పించి పరదైవప్రీతితో జన్మను చరితార్థం చేసుకోవాలనుకనే జీవుల ప్రయత్న ప్రతిబింబాలే ఇవి.

కాని, కాలం మారింది. ఆడంబరం అందల మెక్కింది. ఆర్తి దూరమై అర్థార్తి పెరిగింది. ఫలితంగా తరుజల దూరమై భూమి క్రమంగా పాషాణమయమై పోతున్నది. దివ్య జల ఫల సంపదల కాలవాలమైన చీమలు దూరని చిట్టడవులు, కాకులు దూరని కారడవులు కథలలో మాత్రం మిగిలి జీవజాలానికి వ్యథలు మాత్రమే అనుభావితా లౌతున్నాయి.

ఈ ప్రమాద మిలానే సాగితే కొద్ది సంవత్సరాలలోనే ఈ దేశంలో మరుభూమి లెక్కువయ్యే ప్రళయం రానున్నదని, ఆ శాస్త్రకోవిదుల ఘంటావాదం.

ఇది గుర్తించిన దేవస్థానం, కేవలం ఫలపుష్ప యాగాదులతో సరిపె ట్టుకోకుండా, ఆ వనసంపదల పరిరక్షణ పోషణల కనేక కార్యక్రమాలు చేపట్టింది. నందనోద్యానాలు ఆరామవ్రాటికలు ఏర్పరచి ఆ ప్రాకృతిక సహజత్వాన్ని పునఃప్రతిష్ఠించటంతో పాటు తిరుమలగిరి చరియలను కూడా వివిధ వృక్ష సంపదతో సర్వహరితమయంచేసే పథకాలు అనుసరిస్తూన్నది. కాని, చేవ ఎంత కలిగినా చేత ఒక పరిధిలోనే జరగక తప్పదు.

మన మనుగడలను తిరిగి సంపద్భరితం చేసుకోవాలంటే వనజీవ నావనైక తత్పరులందరు చేయి చేయి కలిపి ముందుకు సాగి తమ తమ ప్రాంతాలలో ముఖ్యంగా ఆరాధనాస్థానాలలో వన సంపదను ఇబ్బడి చేసే ప్రయత్నం చేయాలి. వీరైనంతవరకు వనసంపద సజీవ సహకారి కావాలి. అప్పుడే మనిషి మనుగడ కొరక పరమార్థం సిద్ధిస్తుంది. వనసంపద ఖర్చైతే ఏ దేశంలోనైనా మిగిలేది అశాంతి ఆరాటం అవినీతి మాత్రమే. అందుకే కొందరు ఇలా అంటున్నారు.

మనిషికన్న ముందున్నది వనసంపద।
అది హరించ కలుగుతుంది ఆపద॥

* * *

# 27. సంశయాత్మలు

అనుమానం అంటూవస్తే అది పెద్ద అనర్థమే. ఆ ఆలోచన ఎంతవరకు పోతుందో అర్థం కాదు. ఇది దాదాపు అన్ని విషయాలలోనూ నిజమే అనిపిస్తుంది.

కృష్ణావతార విషయం ఆలోచిస్తే భారతకృష్ణుడు, భాగవతకృష్ణుడు ఒకరు కారా అన్న అనుమానం కలుగుతుంది కొందరికి. ఇందుకు కారణం భారతంలో కృష్ణుడు ఒక అత్యుత్తమ రాజకీయవేత్త, యుదనీతివిశారదుడుగా

కనిపిస్తే, భాగవతంలో ఆయన నైయుక్తిక జీవనసరళి, జీవితానుభవంలోని కష్టసుఖాలు, లీలావిశేషాలు ప్రతిబింబిస్తాయి. ఆయన దైవీశక్తి, నారాయణా వతార నిరూపణం, భారతంలో పరమాణురూపంలో ఉండే భాగవతంలో పర్వతాకారంలో భాసిస్తుంది. అందుకే కొందరు ఈ రెండు కృష్ణపాత్రలను వేరువేరుగా భావించటంతోపాటు భాగవతం వ్యాసకృతం కా దనేదాకా పోవటంలో ఆశ్చర్యం అంతగా కలుగదు.

ఈ సంశయం ఇంతటితో వదిలిపోతే బాగుండేది. అసలు కృష్ణార్జున సంవాదరూపంలోని భగవద్గీత వ్యాసగ్రథితం కానేకాదనీ తరువాతి వస్తువును అసలు దానితో అంటకట్టారనీ వాదించేదాకా పోవటం జరుగుతున్నది. ఈ ఆధ్యాత్మిక బోధకు రణరంగం తగినతావు కానేకాదనీ, నిజంగా బావామర దులు ఈ ఆధ్యాత్మిక సల్లాపాలలో మునిగితేలుతూంటే, కౌరవులు చేతులు ముడుచుకు కూర్చోరని, పైగా, విషయం దృష్ట్యా కూడా, రణరంగంలో ఈ బోధ సహజత్వానికి బాధకమే అవుతుందనీ, కార్యకారణసంబంధవాదుల వాక్కు. ఇవి పురాణకథలని కాకమ్మ కబుర్ల కింద నెట్టేదాకా వచ్చింది.

నిజానికి కొంత సూక్ష్మంగా ఆలోచిస్తే గీతాబోధనకు అంతకన్న అనువైన స్థలంగాని సమయంగాని వేరే లేదనిపిస్తుంది.

రాజకీయంగా కురుక్షేత్రయుద్ధంవల్ల కౌరవులకు పెద్దగా ప్రయోజనం లేదు. పాండవుల నుండి తీసుకోగల్గిందల్లా స్వాధీనం చేసుకొని అను భవిస్తూవున్నందువల్ల తామే ముందడుగువేసి యుద్ధం ప్రారంభించాల్సిన అవసరం లేదు. తమకు జరిగిన అవమానాలను, అపరాధాలను భరించి 13 సంవత్సరాలు బాధపడిన పాండవులే కృష్ణరాయబారం విఫలమయిన తరువాత కురుక్షేత్రయుద్ధం ప్రకటింపవలసి వచ్చింది. కనుక ఇది కౌరవుల కనుకూలమైన పరిస్థితి. తామే యుద్ధం ప్రారంభించి జననష్టం కల్గించుకో వటం విజ్ఞత కాదు కనుక, రణకోవిదుడు, కురువృద్ధుడు రణనీతి కోవిదుడు భీష్మాచార్యుల నాయకత్వంలోని సేన యుద్ధం ప్రారంభించి ఉండదు.

ఇదిగాక నిరాయుధులతో అసన్నద్ధులతో యుద్ధం చేయకూడదనే ఆనాటి రణనీతి దాదాపు పోప్తికందాకా కొనసాగింది. పైగా కృష్ణార్జునుల సంవాదం అంతర్నిహిత శాంతి ప్రయత్నంగా కూడా కౌరవులు భావించిన దాఖలాలున్నాయి. కనుకనే కౌరవులు దాడి ప్రారంభించలేదు. ఇంతటి రణనియతి కల యుద్ధం ముందు కృష్ణుడికి గీతాబోధకు సమయం దొరకటం ఆశ్చర్యమూ కాదు, అసహజత్వమూ లేదు.

ఇంక గీతాబోధకు రణరంగం తగిన ప్రాంగణం కాదనే వాదన.

యుద్ధానికి సిద్ధమై ఏడక్షౌహిణుల సైన్యంతో సమరాంగణంలో అడుగుపెట్టిన పార్థుడు ఆసమయ నిర్వేదంతో విముఖుడు కావటం కేవలం అర్జునుడికే కాదు యావద్రాజలోకం అభిజాత్యానికే తీరని మచ్చ. ధర్మ నిర్వహణలో పలాయనవాదం జొరబడితే, నైతిక సామాజిక విలువలు నాశనమౌతాయి. కనుక అర్జునుడు స్వకర్మమార్గానికి మరలటం ఎంతో అవసరం.

పాపపుణ్యాలు పాంచభౌతిక దేహంవల్లనే కలుగుతాయి. కనుక, దేహము ఆత్మకాదని బోధిస్తూ, ప్రాసంగికంగా, భగవంతుని చేరుకోటానికి ఉన్న విధానాలన్నిటినీ వివరించటం జరిగింది. ఇందులో ఉద్దేశం ప్రతిమార్గంలోనూ సాధకుడు అనుసరించవలసిన కర్మలు ధర్మాలు ఉంటాయని, పలాయనవాదం వల్ల ప్రయోజనంలేదని, ఉన్న అన్నిమార్గాలకన్న క్షత్రియులకు సులభమూ, సుకరమూ అయినది నియతకర్మ మార్గమేననీ, వణుకు, జడుపు వదలి, యుద్ధం జయించి లౌకిక సుఖాలో, మరణించి పరలోక వైభవాలో పొందాలని భగవానుడు కేవలం తత్కాల సంశయాత్ముడైన నరుని బోధిస్తూ, నిత్యసంశయాత్మకమైన నరలోకాన్నంతటినీ మేలుకొలిపి శాశ్వతానంద ప్రదాయినిగా గీతాశాస్త్రాన్ని అందించి హెచ్చరించాడు. ఆ అందించిన పద్ధతి చూస్తే, గీత మానవుడు మాధవుడ యేందుకున్న భిన్నమార్గ ధర్మసంకలనమా అనిపిస్తుంది. సామాజిక ధర్మగ్లాని విరోధానికి

భగవానుడు, నరునిలోని ధర్మగ్లాని నిరోధానికి భగవద్గీత ఆవిర్భవించిందని అనుకోవచ్చు. అందుకేనేమో భగవానుడు కూడా సంశయాలను వదలి పరమార్థాన్ని గ్రహించండి అని బోధిస్తున్నాడు.

"ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్య వరా న్నిబోధత"

* * *

# 28. గురువు

సంస్కృత వాఙ్మయంలోని శబ్దజాలంలో "గురుః" అనేది అత్యంత విశిష్టతరమైంది. గురువంటే ఉపదేశించేవాడు. 'గృణాతి ఉపదిశతి ఇతి గురుః' అనే వ్యుత్పత్తి ననుసరించి అనూచానంగా, పరంపరాగతంగా సంప్రాప్తమైన జ్ఞాన విజ్ఞానాల్ని స్వానుభవమూలంగా అత్యంత వాత్సల్యంతో సులభంగా, సూక్ష్మంగా శిష్యునికి అందించేవాడే గురువు.

ఇందులో 'జ్ఞానం' అనేది ఆధ్యాత్మిక రంగానికి సంబంధించింది కాగా, 'విజ్ఞానం' అనేది కళలు, విద్యలు మొదలైన వాటితోగూడిన సమస్త భౌతిక ప్రపంచానికి సంబంధించింది.

గురువర్యుని దృఢమైన మానసిక సంకల్పము, శక్తివంతమైన వాక్కు, వాత్సల్య పూర్వకమైన స్పర్శ- అనే త్రివిధ మార్గాల ద్వారా జ్ఞాన, విజ్ఞానాలకు సంబంధించిన 'అనుభవసారం' శిష్యునకు అందుతుంది. ఆ రీతిగా గురుచరణ సన్నిధిలో నిష్ణాతుడైన శిష్యుడు-

"ఉత్తమోత్తమ గురుల శిష్యుండ నైతి
గురువు నయ్యెద సచ్ఛిష్య కోటులకును"

అని సవినయంగా, సభక్తికంగా గురువువద్ద సెలవుపుచ్చుకొని, తాను మరోచోట 'గురు' పదవిని అధిష్ఠిస్తాడు. ఈ విధంగా ఈ గురుశిష్య

సంప్రదాయం అవిచ్ఛిన్నంగా కొనసాగే అమృతవాహిని! భారతీయ సంస్కృతియొక్క ప్రశస్తిని చాటే ప్రత్యేక లక్షణాలలో ఈ గురుశిష్య సంప్రదాయం అత్యంత ముఖ్యమైంది.

ఆసలు మన దేశంయొక్క భౌగోళిక స్వరూపంలోనే ఈ గురుశిష్య భావం సంలీనమై ఉండడం మనం గమనించవచ్చు. అనుక్షణమూ స్వచ్ఛమైన హిమవర్ణంతో నిర్మలంగా ఎదుగుతూవున్న దేవతాత్మయైన హిమాలయం గురువుకు ప్రతీక! అంబరమంటి శిరస్సుతో ఆజానుబాహువుగా నిలిచివున్న ఆ గురు చరణ సన్నిధిని సాగిలబడిన సచ్ఛిష్యునికి ప్రతీక యావద్భారతావని, అపరిమిత వాత్సల్యంతో ఆ శిష్యునిపై ప్రసరించే జ్ఞానవిజ్ఞానసారమే దివ్యగంగ! ఈ ప్రవాహ ప్రసారం నిరంతరమూ, శాశ్వతమూ కూడ.

పవిత్రమైన 'గురుపరంపర ' యందలి ఔన్నత్యాన్ని గుర్తించిన ప్రాచీనులు

గురుర్బ్రహ్మా గురు ర్విష్ణుః
గురుర్దేవో మహేశ్వరః,
గురుస్సాక్షాత్ పరం బ్రహ్మ
తస్మై శ్రీగురవే నమః.

అని గురువును త్రిమూర్త్యంతో సమానంగానూ, సమస్త జగత్తును గురుభావనలోనూ ఆరాధించారు.

మన ప్రాచీన గురుపరంపరకు చెందిన మహర్షులందరిలోనూ కృష్ణ ద్వైపాయనుడనే నామాంకిత వేదవ్యాస భగవానునకు ఒక విశిష్టత ఉన్నది. అనంతంగావున్న వేదరాశిని వింగడించి, విపులవాఙ్మయాన్ని సృజించి, ఆ మహనీయుడు అంతటితో ఊరుకొనక తన చేతులెత్తి యావత్ప్రపంచానికి "మీ ధర్మాన్ని మీరు రక్షించండి! అర్థ కామాదులు వాటంతట అవే సిద్ధిస్తాయి"- అనే కర్తవ్యాన్ని ఎలుగెత్తి ఘోషించారు.

కాబట్టే ఆ బాదరాయణ పరమ ఋషి అవతరించిన ఆషాడ శుద్ధ పౌర్ణమిని అనాదిగా భారతీయులు "గురుపూర్ణిమ" గా ఆచరిస్తూ ఉన్నారు. ప్రాచీన గురుకులాల్లో సమావర్తనోత్సవాలు ఈ రోజే జరుగుతూ వుండేవి!

ఉత్కృష్ట పర్వదినమైన ఈ వ్యాసపూర్ణిమనాడు పురాతనమూ, పవిత్రమూ అయిన భారతీయ గురుశిష్య సంప్రదాయాన్ని జ్ఞాపకం చేసికొని ప్రతి హైందవుడూ గురువులందరికీ పరమగురువైన శ్రీనివాసుని కృపకు పాత్రులు కాగలరు గాక! ఈ సంప్రదాయ స్మరణంతో ఉత్తమ స్ఫూర్తిని పొంది ఉత్తేజితులగుదురుగాక! "ధర్మో రక్షతి రక్షితః" అన్న గురూపదేశానుసారం ఈ గురుపూర్ణిమనాడు ధర్మాచరణకు పునరంకితమవుతూ సర్వజనాళి అర్థకామాదులు పొందెదరుగాక!

నమో స్తుతే వ్యాస విశాలబుద్ధే
పుల్లారవిందాయత పత్రనేత్ర,
యేన త్వయా భారత తైలపూర్ణః
ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః.

* * *

# 29. విద్యయా అమృతమశ్నుతే

ఈ విశాల విశ్వంలో ఆ మాటకు వస్తే ముఖ్యంగా భారతీయ జీవనంలో విజ్ఞానానికున్న ప్రతిష్ఠ అంతా ఇంతా కాదు. "నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే, జ్ఞానాదేవ తు కైవల్యం, జ్ఞానవాన్ మాం ప్రపద్యతే" లాంటి గీతావాక్యాలు జ్ఞానం అతిపవిత్రమైందని, జ్ఞానము వల్లనే మోక్షసిద్ధి కలుగుతుందని, జ్ఞానవంతుడు భగవంతుని పొందుతాడని తెలవిస్తున్నాయి. దీన్నే భాగవతంలో అందరికీ అందుబాటైన భాషలో—

"చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు, కుంభినీధవు చెప్పెడు గురుడు గురుడు, తండ్రి హరి జేరుమనియెడి తండ్రి తండ్రి" అని

భగవద్విషయు, విలాస ప్రభావ ప్రబోధనలే చదువు లక్ష్యంగా వివరించారు. అందుకే జనజీవనంలో పారమార్మిక జ్ఞానానికి హెచ్చు ప్రాధాన్యం లభించి ప్రతి విషయాన్ని భగవద్విభూతి ప్రసాద దృష్టితోనే చూడడం జరిగి, ప్రతి లౌకిక విషయాన్ని కూడా పారమార్థిక సత్యంతోనే ముడివేయటం జరిగింది. అందుకే క్రాంత దర్శులైన మహర్షులు ప్రశాంత ప్రమోదభరిత వాతావరణంలో జరిపిన సత్యాన్వేషణ ఫలితాలు వివిధ పారమార్మిక శాస్త్రాల రూపంలో మన కందాయి.

భౌతికాలంబనా రహిత పారమార్మిక ప్రయత్నాలు సామాన్యులకు సామాన్యంగా నేల విడిచిన సాము లాంటిదని వాళ్ళకు తెలియక పోలేదు. అందువల్లనే విజ్ఞానాన్ని రెండు భాగాలుచేసి అవిద్య విద్య అన్నారు. లోకవి హితాలన్నీ పాదార్థికాలూ లేక అవిద్యా సంభూతాలనీ, విద్య పారమార్థికమనీ అన్నారు. లౌకికంలో లభించే దీక్షాదక్షతలు, శాంతి సౌభాగ్యాలు పారమార్మిక ప్రయోజనాలకు ప్రాతిపదిక లయ్యాయి.

ఈ లౌకిక పారమార్మిక ప్రయోజనాలని సాధించి పెట్టగలవారిని సమాజం గురువులుగా స్వీకరించి 'గురుదేవో భవ' గురువునకు దైవసమూహంలో పెద్దపీట వేసి గౌరవించింది.

దీనికి ప్రతిగా మహర్షులు పారమార్మిక విజ్ఞాన సాధన ప్రబోధనలతో పాటు లౌకిక సౌభాగ్యం కోసం వివిధ నియమావళీ గ్రంథాలు, పాదార్థిక శాస్త్రాలు రచించి, వాటిద్వారా ఆధ్యాత్మిక విద్యా సాధనకు మూలభూతమైన సుశిక్షిత వ్యవస్థా స్థాపనకు సాధనకు తమ జీవితాలు అంకితం చేశారు. దాని ఫలమే ఈనాడు మనకు లభిస్తున్న వివిధ స్మృతులు, శాస్త్ర గ్రంథాలు. లక్ష్య, నియమ, దీక్షా రహిత సమాజం సాధించ గలిగిందేదీ లేదన్న సత్యాన్ని వారెప్పుడో గుర్తించారు. విశ్వాంతరాళస్థ పదార్థ విజ్ఞానంతోపాటు, లౌకిక వ్యవస్థాపరమైన చతుష్షష్టి కళాగ్రంథాలు వారి ప్రసాదంగా సమాజాని కందాయి.

ఆ అపార శాస్త్ర సమ్మథన ఫలంగానే రాముడు, కృష్ణుడు, అర్జునుడు లాంటి, ప్రాణాన్ని తృణప్రాయంగా భావించి ఆదర్శంగా నిలువగల సర్వ సత్కార్య దీక్షాదక్షులెందరో సమాజానికి అందివచ్చారు. దాని ఫలంగానే రాముని ఆదర్శ ధార్మిక జీవనం, కృష్ణుని జ్ఞాన బోధామృతం సమాజాని కందాయి. ఇందుకు కారణాలు సమాజంలో చిరస్థాయిగా నిల్చిన గురు శిష్య సంబంధ సద్భావాలు.

అవిద్యా (అజ్ఞానం మాత్రం కాదు) రూపాలైన సుస్థిర, సురక్షిత సమాజ స్థాపన ప్రక్రియలద్వారా మానవుడు మృత్యువును అంటే మరణ భయాన్ని దాటి ధీరుడు కావాలి. ఈ ప్రయత్నసిద్ధ, సంలబ్ధ వస్త్వేతర విజ్ఞానంతో, సద్విద్యా సాధనతో అమృత తత్వాన్ని అందుకోవాలి.

ఈ లక్ష్యసిద్ధికి గురువులు ముందుండి శిష్యులచే తత్తత్కార్య కలాపాలు నిర్వహింపజేసి సుస్థిర రాజ్య స్థాపనాదులకు తమ విజ్ఞానాన్ని ధారపోస్తే, శిష్యులా గురుదైవతంలో గురుత్వం వుంచి నిస్సంకోచంగా వారి ఆశయసిద్ధికి ఆత్మార్పణబుద్ధితో వ్యవహరించి సమాజానికి ఆదర్శప్రాయులయ్యారు.

మరి ఈ తపస్సు, సాధనా, రాజప్రసాదాల్లో రమణీయ హర్మ్యాల మధ్య, రమణుల సరసన సాధ్యమయ్యేది కాదు.

అందుకే ఊరికి దూరంగా, అనుభవమే ఊతగా, అంబలే అమృతంగా, అందరిలో తానూ ఒకడుగా బ్రతికి బ్రతికించడం నేర్చుకునేందుగా వీలుగా కులపతులు, గురుకులాలు నిర్వహించి సర్వతోముఖ విద్యాబోధనచేసి సమాజోపయోగానురక్తితో ప్రతివ్యక్తిని, ఒక వ్యవస్థగా తీర్చిదిద్దారు.

ఈనాటి అక్షరాది నుంచి శాస్త్ర పర్యంత దీక్షాదశవరకూ ఆహారావాస సంబద్ధ విద్యాలయ స్థాపనకు ఆనాటి గురుకుల పద్ధతే ఆది ఆదర్శం అని చెప్పవచ్చు.

అన్నిటికీ ఆదర్శం, సామాజిక లౌల్య ప్రలోభాల కలిత వాతావరణంలో విద్యార్థిని సుశిక్షితుని చేయటం.

కాని వర్తమానంలో వాస్తవాలు వేరై తారుమారై నీరుగారిపోయాయి. ఆదర్శం అందల మెక్కింది. ఆర్భాటం ఆచరణలోనికి వచ్చింది. గురు శిష్యులకు సమస్యల బరువెక్కువై సద్విద్యాసాధన గురి తప్పిపోయింది. గురుకులాలు గురు కుల సంఘాలౌతున్నాయి. అన్నిచోట్లా సంకల్పం ఆరాధనల బదులు, వైకల్యం, వైరుధ్యం, వైమనస్యం తాండవిస్తున్నాయి.

ఇది ఇలాగే సాగితే మనిషి మరణాన్ని దాటడం దేవు డెరుగు, మరణరూప మరో మృగంగా మారటానికి ఎంతోకాలం పట్టదు.

అందుకే అందరం అన్నివేళలా ఈ అక్షర సత్యాన్ని మననం చేస్తూ మనని మనం మధించుకోవాలి.

అవిద్యయా మృత్యుం తీర్త్వా,
విద్యయా అమృత మశ్నుతే.

* * *

# 30. శిష్య చిత్తాపహారకః

విశ్వమానవ సంబంధాలలో ముగ్గురికి అతివిశిష్టమైన, పవిత్రమైన స్థానం వుంది. జన్మ నిచ్చిన తల్లిదండ్రులు, జీవనానికి మార్గదర్శకత్వాన్ని నిర్వహించే విద్యాగురువు. ఈ గురువు సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు కావలెనన్న భావం సర్వేసర్వత్రా ద్యోతకమవుతుంది. అందుకేనేమో ఆంగ్లభాషలో 'మాష్టర్' అన్న శబ్దము గురువు పరంగా వాడటం జరుగుతున్నది. భారతీయ జీవన విధానంలో మాత్రం ఈ భావనకు ఇంకా మూడాకు లెక్కువగా బలమే వున్నది. తల్లిదండ్రులను ప్రకృతి పురుషరూపులుగా ఆద్యమూర్తిత్రయంతో సమంగా లక్ష్మీనారాయణులనీ, పార్వతీపరమేశ్వరులనీ ఇత్యాదిగా సంభావిం చడం జరుగుతున్నది. కాని గురువు విషయమున ఈ త్రైమూర్తికమైన దేవతా మూల స్వరూపం సర్వవ్యాపకమూ అయిన అనంత చైతన్యానికి బాహిర

రూపంగా అంటే పరబ్రహ్మకు ప్రతిరూపంగా భావించారు. భారతీయ దృక్పథంలో గురువు లౌకిక ఆధ్యాత్మిక జ్ఞానప్రదాత, పరమపద గమ్యానికి పారదర్శకమైన రాచబాట అన్నమాట. అందుకనే గురువును నిశ్చల నిష్కళంక బుద్ధితో పరబ్రహ్మకు ప్రతిరూపంగా ఆరాధించమని శాస్త్రవాఙ్మయం సెలవిస్తోంది. అంతేకాదు శివుడు కోపిస్తే గురువు తప్పించగలడు. గురువు కోపిస్తే శివుడు కూడ అశక్తుడని కనుక సార్థక జీవనాభిలాషికి గురుకృప అతి ఆవశ్యకమని శాస్త్రం చెప్తోంది. గురుకృపకు పాత్రులై ప్రశస్తిని పొందిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పాండవులచరిత్ర; గురువు కోపానికి శాపానికి, బలైన కర్ణాదుల వృత్తాంతాలు మనకు నిదర్శనాలు. తన అపారమైన నిష్ఠతో గురువును మెప్పించగలిగి, స్వల్ప అనృతదోషం కర్ణ జీవితానికి ఎలా చరమగీతం పాడిందీ మనందరికీ తెలుసు. కనుక మానవుని ఇహపర జీవనానికి గురువే శరణ్యం. అందుకే గురువులు కూడ తమ బాధ్యతలను గుర్తించి, తమను ఆశ్రయించినవారికి సద్గతులు చూపించారు.

తల్లిదండ్రుల మమకారానికి దూరంగా వుంచి విద్యార్థులలో నిష్ఠ, దీక్ష, సాధన పెంపొందించి గురు సమక్షంలోనే వారిని సర్వవిద్యాపారంగతులను చేసేందుకు ఛాత్రులకు గురుకులంలోనే ఆవాస ఆహార సౌకర్యాలు కూడ కల్పించి, విద్యా ప్రబోధం నిర్వహించడం జరిగింది.

సామాజికమైన మార్పులు ఎన్ని వస్తున్నా ఆనాటి ఆశ్రమాధారిత విద్యావిధానం ఈనాటికీ కొత్త కొత్తపేర్లతో జరుగుతూనే వున్నది. అయితే ఫలితాలు మాత్రం వ్యత్యస్తంగా వున్నాయి. ఈనాడు సర్వే సర్వత్రా గురుశిష్యులిద్దరిలో ఒకరకమైన అసంతృప్తి, ఆరాటం, నిస్స్పృహ, నైరాశ్యం చోటుచేసుకున్నాయి. ఫలితంగా విద్య అన్న శబ్దానికి అర్థం, గురు శబ్దానికున్న గౌరవం మెట్టు మెట్టుగా జారుతున్నది.

అన్నివిధాలా అభివృద్ధి సాధించామని భుజాలు చరిచే దేశాలలో కూడ ఈ వింత నైరాశ్యం, నిస్పృహ తప్పటంలేదు. వీటన్నిటికీ మూలకారణం

గురు శిష్యుల మధ్య అవగాహన లోపించటం, ఆధ్యాత్మిక విద్య లౌకిక ఆధార విద్యలకు ఆలంబనం కాకపోవటం. అహంకారి పచ్ఛిష్యుడు కావట్లే, గురువులోకూడ దాంభికులున్నారట! అహంకారముతో అణగిపోయినవారి దృష్టాంతాలు మనకున్నా గురు లాఘవాన్ని గూర్చి చెప్పే సందర్భాలు చాల నిర్ద్వంద్వంగా నిష్పాక్షికంగా శాస్త్రాలు వివరించాయి. గురువులు శిష్యుల హృదయాల్ని ఎందుకు ఆకర్షించలేక పోతున్నారు- అన్నదానికి గురుగీతలోని ఈశ్లోకం అద్దం పడుతోంది.

"గురవో బహవః సంతి శిష్య విత్తాపహారకాః,
స గురుః దుర్లభో దేవి, శిష్య సంతాపహారకః."

గురువులకు శిష్యుల జేబుల బరువుల గురించేగాని, వారి మనస్సులోని వైకల్యపు బరువుల్ని దించే శ్రద్ధ కలవారు తక్కువని, శివుడే భవానికి సెలవిచ్చారు. మరి మనం చెయ్యగలిగిందేముంది?

గురు పౌర్ణమి సందర్భంగా గురు గౌరవాన్ని, గురు శిష్య సంప్రదాయాలను పునరుద్ధరించే ప్రయత్నము ఏ కొద్దిగా జరిగినా అదే ఆ గురుచంద్రులకు మన ఓ చిరు నూలిపోగు.

సంసార సాగర సముద్ధరణైక మంత్రం
బ్రహ్మాది దేవముని పూజిత సిద్ధమంత్రమ్,
దారిద్ర్య దుఃఖ భయశోకవినాశ మంత్రం
వందే మహాభయహరం గురురాజ మంత్రమ్.

* * *

# 31. విద్యాబోధన

చదువెందుకు?- దీనికి సమాధానం దొరుకుతుంది ప్రహ్లాదచరిత్రలో. "చదువనివా డజ్ఞుండగు, చదివిన సదసద్వివేక చతురత గలుగున్, చదివించెద

ఆర్యులొద్ద చదువుము" ఈమాట అన్నది సాక్షాత్ హిరణ్యకశిపుడు. ఆర్యు డైన వానివద్ద చదువుకోవలసిందని బోధిస్తాడు అంటే అజ్ఞానాన్ని పోగొట్టి ద్వంద్వ విషయ పరిజ్ఞానము, లోకనీతి బోధింపగలవాడు- పూజనీయుడు, ఆర్యుడౌతాడన్నమాట. అయితే ఈ విజ్ఞానం కేవలం పదార్థకమే గాక పారమార్థికం కూడా కావాలి. అది ఇహంలో ఇబ్బంది లేకుండా పరమప దయోగం కోసం తోడ్పడగలి గిందిగా వుండాలి అందుకే ప్రహ్లాదు డంటాడు 'కుంభినీధవు చెప్పెడు గురుడు గురుడు' అని. లౌకికజ్ఞానంతోపాటు పర మపథ దర్శకుడు గనుకనే కంటెదుటి దైవాలలో మాతాపితరుల సరసన గురువును చేర్చి తమ దైవీభావన వ్యక్తపర్చుకున్నారు పూర్వజనసత్తములు.

దీనికి తగ్గట్టుగానే గురువులు కూడా తమ కర్తవ్యాన్ని ఎంతో శ్రద్ధగా నిర్వర్తించేవారు. దేవగురువు బృహస్పతి, రాక్షస గురువు శుక్రాచార్యులు, కురుపాండవ గురువులు ద్రోణ భీష్మాదులు తమ శిష్యుల అభ్యున్నతి కోసం ఎలా పాటుపడింది మనకు తెలుసు. ఇక గురు నియమాలకు లోనై, ఆకలికి తట్టుకోలేక జిల్లేడు తిని కళ్లు పోగొట్టుకున్న ఉపమన్యునికథ యోగ్యతా నుశీలనలో ఎదురయ్యే గురు పరీక్షలకూ, ఆశ్రితుని పట్ల గురువుకుండే అపారవాత్సల్యానికి నిదర్శనం.

ఈ సద్విద్యాబోధనప్రవృత్తిలో గురువు దండించినా అదొక అపరా ధమను కోక "బుద్ధి చెప్పవాడు గ్రుద్దితే నేమయా" అని సర్దుబాటు చేసుకున్నారు. అందుకే అందరికీ దూరంగా పదవగాహనకు వీలుగా గురుకులాలు ఏర్పాటుచేసి ఆత్మీయతా భావనకు అనువైన తీరు కల్పిం చారు. అందువల్లనే ఆట అపూర్వ విజ్ఞానఖను లెందరో ఆవిర్భవించారు. ఆనాటి వరవడిలో సాగినంతకాలం విద్యకొక గద్దె. గురువుకొక గౌరవం విలకడగా నడిచాయి. ఆత్మప్రత్యయంతో గురువు నెదిరించవలసి వచ్చిన సందర్భాలలో కూడా ఆ తీరు అతితాయితనంతో కాక ఆరాధనీయంగా ఎలా రూపొందిందో భీష్మాదుల చరిత్ర చెప్తుంది.

తన నెఱుగని గురువుకోసం వేలు తెగ గోసుకున్న శిష్యు డొకడైతే, గురువు గురుగర్వవేదన తీర్చేందుకు వరుణునే శాసించ బయల్దేరిన శిష్యు డింకొకడు. ఇంతటి తపన, తాదాత్మ్యం గురు శిష్యులమధ్య ఉండటం వలనే ఆనాటి గురుకుల విధానాలు సమతామమతలకూ అమృతమయ విద్యాబోధనకూ ఆలయాలయ్యాయి.

మరిప్పుడు జరుగుతున్నదేమిటి?

ఆనాటి సమతామమతలు సమాజంలోనే కరువయ్యాయి. మమత మానవత్వం మీదినుండి మనకెంత రాబడి అన్నదానికి మారి విద్య విలువను తగ్గించివేస్తున్నది. 'గుద్దితే నేమయా' అనే రోజులు పోయి గురు 'గుణం' కుదర్చాలనుకునే రోజులు వచ్చాయి. సర్వశుక్లసరస్వతీ సదనాలు కావలసిన నేటి గురుకులాలు 'గురు కుల' రాజకీయ కషాయితా లౌతున్నాయి. అందుకే అంతటా ఆవేదన, ఆక్రోశం, ఆర్భాటాలే ప్రజ్వలిస్తున్నాయి. అనూచానంగావస్తున్న అంతర్మథనం ఆత్మవిశేషణం కొడిగట్టిన దీపాలౌతు న్నాయి. సర్వవిజ్ఞానార్భకుడు సామాజికంగా "బడిపంతులు" స్థాయినే పొందగలుగుతున్నాడు.

జాతికి ఈ గతి మారాలంటే ముందు పరుగుకన్న వెనుకచూపు ఎంతో అవసరం. నైతిక విలువలకు విలువనీయని ప్రగతి ఎంతటిదైనా అది వినాశానికే దారితీస్తుందన్న సంగతి చరిత్ర చెప్తున్న సత్యం. అందుకే భౌతిక విజ్ఞానవిజయాంధంలో చిక్కి సతమతమౌతున్న ప్రాణి మీద సమతామమతా సహానానుభూతి కిరణాలు ప్రసరించాలి. ఆర్భాటాలు ఆడంబరాలకు బదులు అంతర్మథనం, ఆత్మానుశీలనం ప్రాతిపదికగా విజ్ఞాన ప్రసార ప్రబోధనల ప్రణాలిక లేర్పడాలి. పరస్పర రూక్షవీక్షణాలకు బదులు అంతర్మథనం, ఆత్మానుశీలనం ప్రాతిపదికగా విజ్ఞాన ప్రసార ప్రబోధనల ప్రణాలిక లేర్ప డాలి. పరస్పర రూక్షవీక్షణాలకు బదులు దీక్షాదక్షతలకు స్థానం ఏర్పడాలి. ఆధార విద్యలన్నిటికీ ఆధ్యాత్మిక జ్ఞానం కావటం ఎంతైనా మంచిదేమో. వృత్తిలోపాటు ప్రవృత్తులలో కూడా విలకడ ఏర్పడుతుంది.

కాని ఇవి జరుగుతాయా? ఆకలి గొన్నవాడికి అన్నమే అమృతం గాని, పరతత్త్వ పరమాన్నం కాదు, కనుక ప్రగతి పరిణతి అంచెలంచెలుగా రావలసిందే. సాంత్వనాత్మక సుజ్ఞానభక్తి దొరికితే ఆధ్యాత్మికత స్వయంగా సంక్రమిస్తుంది. అందుకే అందరూ ఎదురు చూడాలి. అదే ఒక గురుపూర్ణిమ.

* * *

# 32. ముగ్గురు ఆళ్వారులు

మనిషి మనిషికీ ఒక కథ. మనసు మనసుకూ ఒక వ్యథ. ఈ కథలూ వ్యథలూ పరమ లౌకికాలైనప్పుడు కొట్టిపారేస్తాం. మహాపురుషుల జీవితాలకు సంబంధించినప్పుడు స్థాన, అవస్థభేదాల ననుసరించి ఒక ప్రత్యేకతను సంతరించుకుంటాయి. సామాజికంగా తిరస్కారకమైన సన్నివేశంకూడా 'నిమజ్జ తీందోః కిరణేష్వివాంకః' అన్నట్లు మరుగునపడి మచ్చగా కాక నుదుటిబొట్టుగా భాసిస్తూ వినూత్న సందేశ సంధాయకాలే ఔతాయి.

ఆళ్వారులలో ఒకరైన విప్రనారాయణులవారు అస్ఖలిత బ్రహ్మచారిగా శ్రీరంగనాథుని మాలాకైంకర్యంలో జీవిత తురీయార్థాన్ని సాధించ చూస్తున్న వ్యక్తి. ఆ నైష్ఠిక బ్రహ్మచారికి విధివశాన దేవదేవి అను వేశ్యతోసంపర్కం కలిగింది. నిజానికిది ఆయన లౌల్యంవల్ల ఏర్పడిందికాదు. 'సజ్జన చిత్తవృత్తి రాతిగుడివంటిది. లోకములోన వేశ్యలున్ కాకులవంటివారు. అటుగాన ప్రమాదము' అని మొగమాటం లేకుండా చెప్పగల్గిన ఆ వజ్రపంజర సన్నిభమైన సద్భావం-ఆర్తత్రాణ పరాయణత్వము, ఆశ్రితవాత్సల్యం అన్న పరమభాగవత ధర్మాల అతివ్యాప్తివల్ల దృఢదారువై, తరుణవృక్షమై, ఫలప్రాయమై, పూవై, తన్మకరందమై చివరకు నీళ్ళుకన్న పల్చనై పోయింది.

తరువాత దైవసంఘటనలవల్ల దేవదేవీ సాంగత్యం కల్గి 'ఏలదీ ఆంగము రంగనాథ' అని ఆవేశంతో ప్రార్థించేదాకా పోవటం, తరువాత జరిగిన కథా అందరికీ తెలిసిందే, చివరకు తొండరడిప్పొడి, రంగనాథునిలో లీనమైనట్లు కథ చెప్తోంది. ఎంత మహాత్ములకైనా ఏదో ఒక సందర్భంలో జారుపాటు తప్పదనీ, అంతమాత్రాన ఒక క్షతి పతనంగా భావించరాదని, పశ్చాత్తప్తు డైన ప్రతి ఆత్మకు, పరమాత్మ సాక్షాత్కారం పొందే అర్హత ఉందని ఈ కథాసందేశం.

ఇక ఆళ్వారుల్లో మరొక ప్రముఖులు తిరుప్పాణాళ్వార్, సామాజికంగా అంత్యకులజులు. శ్రీరంగనిపై కీర్తనలుపాడి జీవితాన్ని చరితార్థం చేసుకున్న మహాత్ముడు. మరి ఆ భక్తికి మురిసిన శ్రీరంగేశుని దృష్టిలో ఆయన కుల మొక మలినంగా తోచలేదు. ఆలయాని కవతల ఉండవలసిన పాణము నిని, సన్నిధికి తీసుకరావలసిందిగా ఆజ్ఞాపిస్తే, పారమార్థిక ప్రయోజనాలు సాధించాలంటే సామాజిక లౌల్యాలను అధిగమించి ఆత్మోన్నతి నందుకో వలెనన్న సత్యాన్ని గ్రహించిన లోకసారంగమహాముని పాణాళ్వారును తమ భుజస్కంధాలమీద ఎక్కించుకొని శ్రీరంగధాముని సన్నిధికి చేర్చారు. 'సామాజికాచారపు మడి దడి' కట్టుకుంటూ మన సమజీవన చదరంగంలో దళితజనోద్ధరణను ఒక పావుచేసిన ఈనాటిమనకన్న ఆచరణలో చూపిన ఆనాటివా రెంత ముందున్నారో అనిపిస్తుంది.

ఆడ మగ భేదం ఐహిక ప్రయోజనాలకు మాత్రమేగాని, పరమాత్మ, సాక్షాత్కారానికి, ఆత్మోన్నతికి అడ్డురాదని బ్రహ్మజ్ఞానులెందరో నిరూ పించారు. కాని ముగ్ధభక్తే సాధనగా, గోపికలే ఆదర్శంగా శ్రీకృష్ణుని అనన్యభక్తితో సేవించి తా నలంకరించుకొన్న మాలలతో భగవాను నలంకరిం పించి, 'మూడికుడుత్తనాచ్చియార్' అనిపించుకున్న గోదాదేవి, నాచ్చియార్ తిరుమొళి, తిరుప్పావైలను రచించి రంగైక్యం చెంది పరమాత్ముని పాడేం దుకు పాండిత్యప్రౌఢిమే అక్కర లేదని, పరిశుద్ధమైన మనస్సుచాలని చాటిన మహాభక్తురాలు. 'సుదతి మెచ్చిన ఇల్లు సురలకు నట్టిల్లు' అని అదు

గడుగువా మాటలకోటలు కట్టే మనకూ, ఆత్మతత్త్వాన్ని, పారమార్థికపు ఆరాటాన్ని అనుభవంతో చూపిన ఆనాటివారికి ఎంతతేడానో మరి!

ఐహికాన్ని ఆవలతోసి మనస్సు మాధవాయత్తం చేసిన ఆ పుణ్య మూర్తుల జీవనచరిత్ర సామాజిక చైతన్య సమతా శంఖారావం. మనం మరీ బధిరులమైతే తప్ప ఆ చైతన్య స్వర ధునిని మానవక్షేత్రం వైపు మళ్లించుకొని, మానవతల పంటలు మళ్లీ మళ్లీ పండించుకోవచ్చు.

* * *

# 33. రామానుజాచార్యులు

జీవుడు - దేవుడు ఈ చర్చ ఈనాటిది కాదు. నిలిచి నడిచే జంతువు నిలిచి ఆలోచించటం నేర్చుకున్నప్పటినుండీ చర్విత చర్వణంగా జరుగుతూ వస్తున్నదే. అందరుగా అంశారూపంలో ఉండేవాడు ఆత్మ అని, అందరూ, అందరికీ తానేయై నడిపించేది పరమాత్మయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ అంశా రూపమైన ఆత్మ బృహదాత్మలో లీనం కావటాన్ని గురించే అందరి భావాల్లోను భాషల్లోను అంతరాలేర్పడుతున్నాయి.

ఆత్మే నువ్వు, నీవే పరమాత్మ అని అభేద సిద్ధాంతాన్ని ఒక ఆచార్యులు ప్రతిపాదిస్తే, అంశారూప ఆత్మకన్న ఆ పరమాత్మ సర్వావయవ, సగుణ సంపన్నుడు, సర్వ శక్తిమంతుడు; ఆ విశిష్టగుణ సంపన్నుణ్ణి ఈ జీవాత్మ అంచెలంచెలుగా చేరుకొని లీనం కావటం ముక్తియని మరొక ఆచార్యులు జ్ఞాన సింధు మథనం చేసి సెలవిస్తే, అసలు అది వేరు, ఇది వేరు, అదీ ఇదీ ఒకటి కానే కావు, దేని అంతరం దానిదే అని మూడవ ఆచార్యులు తెగవేసి చెప్పారు. కాని, అందరికీ బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఉపనిషత్తులే ఆధారాలు కావటంతో ఆధ్యాత్మికంగా ఏకసూత్రత సిద్ధించినప్పటికీ ఆ యతుల మతులు, బోధనాగతులు మాత్రం విభేదించాయి.

'తత్త్వమసి' బోధించిన ఆదిశంకరుల అద్వైతం నిర్గుణోపాసనా ప్రాధాన్యం వల్ల అందరికీ అందేది కాదు. అందరికి అందుబాటులో లేని తత్త్వాన్ని సగుణం చేసి సామాన్య జనారాధనీయం చేసిన ఘనత భగవద్రామానుజులకే చెందుతుంది.

వారి దృష్టిలో భగవదారాధనకు అవస్థాభేదాలు, ఆధార భేదాలు లేనే లేవు. వారిది సమతావాదం రూపెత్తిన సిద్ధాంతం. వారి బోధల్లా మానవులందరూ శ్రీ రంగేశుని దయాపాత్రులు కావాలని, వారికి సంబంధించిన కథలల్లో కూడ సర్వజీవ సమత్వమే గోచరిస్తుంది. ఆచార్య నిష్ఠ, భగవత్ప్రపత్తి వారి సిద్ధాంతానికి మూల స్తంభాలు.

సామాజికంగా వెలిగా ఉన్నవారిని సమాజ స్రవంతిలోకి తీసుకునే ప్రయత్నం రామానుజులనాడే ప్రారంభమైంది. గురూపదిష్టమై జపనీయమైన తిరుమంత్రాన్ని, సర్వజన సంక్షేమ, సంతరణలకోసం, గోపురసందేశంగా మార్చిన వారి హృదయౌదార్యం అంతా ఇంతా కాదు.

గురువైన యాదవప్రకాశులతో వారి భేదం శాబ్దికమైన అర్థ విపర్యయాన్ని కాక, వస్తువైశిష్ట్యారాధన తత్పరతను, నిర్భీకతను వ్యక్తం చేస్తుంది.

ఆలయ నిర్వహణాదుల విషయంలో కూడ రామానుజుల పాత్ర ఎంతో వుంది. కలగాపులగంగా వున్న అర్చా విధానాన్ని సరిదిద్ది ఆగమోక్తక్రమంలో అనేక ఆలయాలలో ముఖ్యంగా శ్రీవారి ఆలయంలో ప్రవేశ పెట్టిన ఘనత రామానుజులదే.

అంతెందుకు- తిరుపతిలోని పార్థసారథి ఆలయం గోవిందరాజ ఆలయంగానూ, తిరుపతి గోవిందరాజ పట్టణంగా రూపుదిద్దుకొన్నదంటే దానికి భగవద్రామానుజులే కారణం.

తన మేనమామ తిరుమలనంబి తిరుమలలో స్థిరనివాస కారణంగా, వారివద్ద అడిపడి వద్ద (అలిపిరి) శాస్త్రాధ్యయనం చేసిన ఆచార్య రామా

నుజులకు, తిరుమల చరిత్రకు వీడని బంధం ఉంది. వారి ప్రచార ప్రాభవ ఫలితమే ఈనాటి వరకు వేదాధ్యయనంతో పాటు, ద్రావిడ ప్రబంధ పఠనం కూడ.

వాళ్ళెప్పుడూ గొప్పవాళ్ళే. మనమే ఆచరణ అక్కడే వదలి వాచా నమస్సులతో మొక్కు తీర్చుకుంటున్నాం. భగవానుని సర్వోపగతత్వాన్ని వారు సందర్శించి తెలిగితే, వర్గ వర్ణ వైషమ్యాలతో, మతం పేర, గతంపేర సమాజ సర్వాపదా స్వరూపానికి మనం ప్రతీక లౌతున్నాం. మంచి మనసున్నవాడికి మనుగడే కష్టమై పోతున్నది. ఈ ఉపద్రవం తప్పాలంటే ఆ మంచి మనసును అందరికీ ప్రసాదించవలసిందని ఆ యతీంద్ర ప్రవణులను వేడుకొందాము.

యో నిత్యమచ్యుత పదాంబుజ యుగ్మ రుక్మ
వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే,
అస్మద్గురో ర్భగవతో உస్య దయైకసింధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే.

* * *

# 34. తాళ్లపాక కవులు

నాదాన్ని బ్రహ్మస్వరూపమని అన్నారు. ఈ సృష్టి ఆవిర్భావానికి ముందు ఏకరూపమైన నాదమే ఉండేదని, పరమాత్మ సంకల్పంవల్ల కాలక్రమాన సృష్టి అంతా ఏర్పడిందని మన వాఙ్మయం - మన వాఙ్మయమే కాదు ప్రపంచవాఙ్మయం చాటుతోంది. భగవంతుడు 'కావాలి ' అనగానే విశ్వమంతా వెలిగిపోయిందని, అలా విశ్వరచన జరిగిందని వారి సిద్ధాంతం. మనం ప్రణవం అనుకున్నదాన్ని ఇతరులు వేరేగా అనుకున్నారన్నమాట.

నాదప్రధానమైన భాష ఎలా జనించిందీ - అని భాషా వేత్తలు పలు చర్చలుచేసి ఆదిదంపతులు పరస్పరానురాగ, భావవ్యక్తీకరణకు ఆలపించిన

సాంకేతిక వాదజనితమే భాష అని ఒక అభిప్రాయానికి వచ్చారు. మాహే శ్వర సూత్రాల ఆవిర్భావ వృత్తాంతంతో జతపరిస్తే ఇది సరిగావున్నదనే అనవచ్చు. అంటే ఆదిదంపతుల హావభావ విన్యాసాల కనుగుణంగా అఖండ నాదము లయబద్ధమై, గతియుతమై, సార్థకశబ్దమై, పదమై వివిధ సాహిత్య ప్రక్రియల వాఙ్మయంగా విశ్వరూపం దాల్చిందనవచ్చు. అంటే జీవసృష్టికి, జీవవంతమైన భాషాసృష్టికి కూడ ఆ పరమనాదమే 'ఆది ' అంటే ఆశ్చర్యం లేదు.

ఈవిధంగా చూస్తే సాహిత్యప్రక్రియలలో కూడా నాదలయాత్మకమైన గీతాలు తత్సమీపప్రక్రియలే 'ఆది' అని చెప్పుకోవచ్చు. ఆ తరువాతనే నూత్న ప్రయోగాలు, ప్రక్రియలు ప్రారంభమై వుంటాయి. తెలుగు సాహిత్యంకూడా ఇంతే. పై మెట్టువారికి క్రిందివి లెక్కకురానట్లు, ఉత్పలాలు, చంపకాలు అలంకరించుకొని మత్తేభాలపై శార్దూలశౌర్యంతో ముందు దూకుడు కల్గిన కవిసమాజంలో ఆదిస్వరూపాలను ఆధ్యాత్మిక తత్పరతతో, నిష్కామంగా ఆరాధించి తమ వంశాన్నే కర్పూర నీరాజనమిచ్చిన ధన్యజీవులు కోటి కొక్కరేమో. నిజంగా ఆ ఘనత, ధన్యత ఆంధ్రసాహిత్యంలో తాళ్ళపాక వంశానికే దక్కింది.

పనికిరానిదని మూలపడవేసిన పదకవితకు వేంకటశైలవల్లభ సమారాధనలో పాలుకల్పించి, పవిత్రతను చేకూర్చి 32 వేల దివ్యప్రబంధాలకు (పాటలకు) వేంకటేశ్వరునే రసరాజుగా ఒకవంక, ఆధ్యాత్మిక పరమావధిగా మరొకవంక రూపించి, రచించి, పదకవితా పితామహ బిరుదునందుకున్న తాళ్ళపాక అన్నమయ్య, తాళ్ళపాకవంశపు తొలిపూజాకుసుమం. ఇన్నికీర్తనల రచనకన్న ఇంతటి రచనకాలంబనగా వేంకటేశ్వరునే స్వీకరించి, నిరూపించిన అన్నమయ్య భావుకత బహుశః విశ్వవాఙ్మయంలో అనూహ్యమైన ఘటన. అన్నమయ్య భార్య తిమ్మక్క ద్విపదలో సుభద్రాకల్యాణం రచించి ఆంధ్రపదసాహిత్యంలో ఆదికవయిత్రి స్థానాన్ని పొందింది.

అన్నమయ్య కుమారుడు పెదతిరుమలాచార్యుడు. బహుభాషా కోవి దుడేగాక తండ్రి వరవడిన నడిచిన చరితార్థజీవి. అన్నమయ్య జరిపించలేని అశేష కైంకర్యాలను స్వామికి జరిపించి ప్రత్యేక పీఠాలను నెలకొల్పుకున్న పరమవైష్ణవుడు. తండ్రివలె వేంకటేశ్వరునిపై ఆధ్యాత్మిక శృంగార రచనమే గాక, భగవద్గీతకు తెలుగువ్యాఖ్య నిచ్చిన తొలి తెలుగుకవి అన్నా ఆశ్చర్యం లేదు. తండ్రివలె రక్తిని, విరక్తిని సమానంగా ఆరాధించిన కర్మయోగి.

విఘ్నేశ్వరుని సహకారంలేకపోతే వ్యాసభారతం ఎందరికి తెలిసేదో తెలియదు. మనుమడు చిన్నన్న అనుకోకపోతే అన్నమయ్య చరిత్ర మాత్రం అసలు బైటకు వచ్చేదేకాదు. తండ్రితాతల బాటలో తన మాటలు సాగించటంతోబాటు, ఇన్నివేల కీర్తనలు వేంకటేశ్వరునిపై వెలయింపచేసిన ఆ మహామహుని చరిత్రను అందించిన చిన్నన్నకు తెలుగుజాతి నిజానికి చాలా ఋణపడివుంది. వీరి రచనలను గ్రంథరూపంలో వెలువరించేందుకు దేవస్థానం చేస్తున్న ప్రయత్నం, చేయవలసినదానిలో చంద్రునికో నూలుపోగు మాత్రమే. ఫాల్గుణ బహుళ ద్వాదశిన జరిగే వర్ధంతి, ఆ మహనీయునికి, ఆ వంశానికి మనం చెల్లించుకునే గౌరవయుత సంస్మరణ మాత్రమే. సంస్కృతభాషా పాండిత్యం కలిగి, అందులో కావ్యలక్షణ గ్రంథాలను రచించికూడా, తాళ్ళపాకవారు తమ ప్రతిభనంతా పదసాహిత్యానికే పెట్టుబడి పెట్టారంటే అంతరార్థం ఏదో ఉండాలి.

వాస్తవానికి మనసుకు చేరువై మురిపించేది, ఆట, పాట. ఆకట్టుకునేది అందలి పదవిన్యాసం. మిగిలిన సాహిత్య ప్రక్రియలు అంత చేరువయ్యేవి కావు. ఆచార్య రామానుజులు, బహుళ జనార్థం గోపురసందేశాన్నిచ్చినట్టే, తాళ్ళపాక వంశం వేద విజ్ఞానసుధను పాటల బాటలలో ప్రవహింపజేసింది. అందుకనే అన్నమయ్య అన్న ఈ పాటలో 'నీ సేవకు సంకీర్తన విధానమే చాలు తక్కినవన్నీ (ప్రక్రియలన్నీ) భండారాన ఉండదగ్గవి మాత్రమే' అన్నాడా అనిపిస్తుంది ఆ మ్రొక్కునే ఆ వంశమంతా చెల్లించినట్లు కన్పిస్తుంది.

దాఁచుకో నీపాదాలకుఁదగ నేఁజేసిన పూజలివి
పూఁచి నీ కీర్తిరూప పుష్పము లివి యయ్యా
వొక్క సంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించఁగ
తక్కనవి భండారాన దాఁచివుండని
వెక్కసమగు నీ నామము వెల సులభము ఫల మధికము
దిక్కై నన్నేలితి విఁక నని తీరని నా ధనమయ్యా

* * *

# 35. వేదాంత దేశికులు

పుట్టటం, పెరగటం, చావటం అనే లక్షణాలు సర్వప్రాణి సమాన సహజ లక్షణాలు. అయినా కొన్ని ప్రాణులు తాము బ్రతుకుతూ, మరి కొన్నింటిని బ్రతికిస్తూన్నాయి. తాము బ్రతుకుతున్న మార్గంలో ఒక అమూల్యమైన జీవన సందేశాన్నిస్తున్నాయి. ఎప్పుడూ విరామం లేకుండా పని చేసే చీమ మనకు నిరంతర పరిశ్రమను బోధిస్తుంది. అలాగే కుక్క విశ్వాసాన్ని అలవరచుకోవాలనే సందేశమిస్తుంది. ఇలాగ జంతువులే లోకానికి ఏదో ఒక మేలు చేస్తున్నప్పుడు, ఇక సర్వవిధాల విజ్ఞానవంతుడైన మానవుడు విశిష్టుడుగా వుండాలి గదా! అంటే కనీసం తన బ్రతుకు బ్రతుకుతూ, ఇతరులను బ్రతకనియ్యాలి. ఇదే విశిష్ట మానవ ధర్మం.

ప్రేమ, త్యాగం, సేవ, అలవరచుకొని మానవ సేవ చేయవచ్చు. లేదా అరవై నాలుగు కళల్లో దేనిలోనయినా ప్రావీణ్యము సంపాదించవచ్చు. ప్రబోధించవచ్చు. లేదా, తనకు జన్మనిచ్చిన భగవంతుణ్ణి కృతజ్ఞతతో భక్తితో కీర్తించవచ్చు. ఇలా ఎన్నో మార్గాలు. ఏ మార్గాన పయనించి అయినా మానవ జన్మని సార్థకం చేసికొంటూ తాను తరించి, ఇతరులను తరింప జేయవచ్చు.

తన విధిని తాను చేస్తూ తనువు మారేందుల్లా సాగాలి అన్నదే మనవారి జీవిత లక్ష్యం. ఇదే గీతలో భగవానుడు ఉపదేశించిన సారాంశం కూడా. మరి పరిపూర్ణంగా పూర్ణాయుర్దాయంతో జీవించి, తన జీవితమే కర్మ సిద్ధాంతానికి విపుల వ్యాఖ్యానంగా నడచుకొన్న మహామనీషి ఎవరైనా వున్నారా? అనుకొన్నప్పుడు శ్రీ వేదాంతదేశికులవారు ఆ కోవలో కన్పిస్తారు.

నిగమాంత మహాదేశికులుగా ప్రసిద్ధి పొందిన శ్రీ వేంకటనాథులవారు నూట ఇరవై ఏళ్ళు పరిపూర్ణంగా జీవించి, తన ధార్మిక గ్రంథాల ద్వారా తాను తరించడమే గాక ఎందరినో తరింప జేసినారు. శ్రీ భగవద్రామానుజులవారికి ప్రత్యక్ష శిష్యుడు కాకపోయినా, వారిద్దరిమధ్య కాలంలో అంతరం చాలావున్నా, ఏకలవ్య శిష్యుడై, సచ్ఛిష్యుడై, శిష్యత్వానికి ప్రతీకగా నిలిచి, రామానుజులవారు ప్రవచించిన వైష్ణవ సిద్ధాంతాన్ని అత్యంత సులభంగా, అందరికీ పంచిపెట్టిన పరమ వైష్ణవాచార్యులు ఈయన, స్తోత్రం - కావ్యం - నాటకం - వేదాంతం - వ్యాకరణం - అనుష్ఠానం ఇత్యాది ప్రక్రియల్లో తన పటుత్వాన్ని నిరూపించుకున్నారు. కవిత్వం - పాండిత్యం - కళ వీటిల్లో జీవితం పండించుకొని 'యుక్తాత్మా ' అన్న గీతావాక్యానికి ఉదాహరణంగా నిలిచిన మహామనీషి.

దేవుడు - గురువు - శిష్యుడు వీరి పరస్పర సంబంధాన్ని ఆచరణద్వారా, వ్యాఖ్యానించి, ఉపదేశించిన దేశికులవారు నిజమైన భక్తునిగా, నిజమైన శిష్యునిగా నిలిచినారు.

విష్ణువును మించిన దేవుడు లేడు, నాలాయిర దివ్య ప్రబంధంవంటి దివ్యసాహిత్యం లేదు. రామానుజుల వంటి గురువు లేడని ఘంటాపథంగా ప్రచారం చేసిన వేదాంతదేశికులవారి జీవితమే వైష్ణవ ధర్మ వ్యాఖ్యానంగా చెప్పవచ్చు.

లౌకిక రాజభోగాల ఆకర్షణకు లోనుగాకుండా, కేవలం ఉంఛవృత్తితో జీవించిన వైరాగ్యశీలి అయిన ఈయనకు వైరాగ్యభూషణుడు అన్న బిరుదు సార్థకమయిందనే చెప్పాలి.

భగవంతునికన్నా భాగవతుని పాదధూళి మిన్న అని భావించి, ఒకానొక సందర్భంలో వైష్ణవ భక్తుని పాదుకకు శిరసా నమస్కరించిన వినమ్ర భక్తశిఖామణి ఈయన.

కైంకర్యాన్ని మించిన సేవ లేదనీ, శరణాగతిని మించిన పరమధర్మం లేనేలేదనీ, శరణాగతి - ప్రపత్తి మార్గంలో పయనిస్తూ జీవితం నిండుగా పండించుకున్న వేదాంత దేశికులవారిని వేదాంతాచార్య, సర్వతంత్రస్వతంత్ర, కవితార్కికసింహ అన్న బిరుదులతో సత్కరించి తనను తాను సత్కరించుకుంది భక్తలోకం.

సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరుని ఘంటావతారంగా ప్రసిద్ధి కెక్కిన శ్రీ వేదాంతదేశికులవారు ఆచరించి ప్రవచించిన వైష్ణవ తత్త్వం ఆధ్యాత్మిక ప్రపంచంలో ఘంటారావంగా నిరంతరం నినదిస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.

* * *

# 36. మీరా

'అజాయమానో బహుధా విజాయతే' అని పురుషసూక్తం భగవాన్ముణ్ణి వర్ణిస్తున్నది. దీన్నే వేదవిదులు 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' అన్నారు. అంటే సృష్టి స్థితి లయాదులు లేని, సగుణ సాకార బ్రహ్మనుండి అనేక అంశలు అవస్థాభేదాన్ని బట్టి వివిధ ఆకృతులను ధరించి ఏర్పడుతున్నాయన్నమాట. ఉపాధిభేదంలో ఉన్న జీవులు పరస్పర సన్నికర్షణవల్ల

పరస్పరం సంలీనం కావాలని ఆరాటపడినట్లే బృహదాత్మనుండి అనంత విశ్వంలోకి వచ్చిన దేహులు ఉపాధి వ్యవస్థ కలితంగా ఉన్న పరమాత్మలో లీనం కావాలని తహతహ చెందుతుంటాయి. ఈ ఆత్మ పరమాత్మల సంలీన విధానాన్నే లౌకిక శృంగారోదాహరణలతో రసవేత్తలు వివరించారు.

లౌకిక పారలౌకిక పరమావధి ఆ బృహదాత్మే అయినప్పుడు దాని సంసర్గములేని జీవాత్మలన్నీ స్త్రీ సదృశాలే ఔతాయి. అందుకే ఉపాధిష్ఠ ఆత్మలన్నీ పశువులనీ ఈశ్వరుడు పశుపతి అనీ శివపరంగా అన్వయించి శైవం వివరిస్తే, జీవులన్నీ గోవులనీ, వాటిని ఆకర్షించేవాడు గోవిందుడనీ, పాలించేవాడు గనుక గోపాలుడనీ వైష్ణవం వక్కాణిస్తోంది. ఇంతటి గంభీర శాస్త్రీయ విజ్ఞానం తమ సొత్తని అహంకరించిన స్వాములకు తలలు తట్టి బ్బొయ్యేంతగా 'ఈ విశ్వంలో పురుషు లెవరున్నారు? గోవిందుడు తప్ప అందరూ స్త్రీలే' అని సూటిగా చాటి చెప్పిన మీరాకు అర్థమైందీ, మనకు అర్థం కావలసిందీ అదే. అది తెలుసుకోలేకే మన అహంకారం.

నవవిధ భక్తిమార్గాలలో ఒకటైన సంకీర్తన మార్గం అవలంబించి తన జీవితాన్ని ఆ పరంధామున కంకితంచేసి, జీవన ప్రభువుగా ఆత్మతత్త్వ గోపాలుడుగా శ్రీమన్నారాయణుని కీర్తనలద్వారా కొనియాడి తరించిన ధన్యజీవి మీరా. ఆమెకు అంతఃపురమూ బృందావనమూ ఒకటే. అంక్షల అడ్డంకులు, రాచరికపు రంపపుకోతలు అన్నిటిని భరించి అనన్యసామాన్య మైన పారమాత్మిక స్పృహతో పరమపదమందిన పుణ్యశ్లోకురాలు ఆమె. కనుకనే తానెరిగిన సత్యాన్ని అందరికీ చాటాలనే తహతహతో 'గిరిధర గోపాల, గిరిధర నాగర్ మీరా కే ప్రభూ' లాంటి గీతికలను అవర్ణ్య సుమబంధంగా రచించి నందగోపాలుని పదారవిందాలకు సమర్పించుకుంది. నిజ జీవితాలలో ఆపత్తు లిద్దరికీ సమానమే ఐనా అన్నమయ్యది స్వారోపిత విరహం. మీరాబాయిది సహజ స్వచ్ఛవిరహం. లౌకిక పారలౌకికానుభూతి పరిణామా లొకరివైతే దివ్యవిరహిణిగా ఆబాల్యలౌకిక విరాగిణిగా ఆత్మ బలిదానం మరొకరిది. 'దాచుకో నీ పాదాలకు తగ నే చేసిన పూజ

యిది' అని ఒకళ్ళంటే, విరహౌద్ధత్యంతో దాస మీరా లాల గిరిధర పాంక్ డోరా పాధీ (గిరిధరుని పళిని) అని ఇంకొకళ్ళు అన్నారు. ఇది వారి వారి జీవన ప్రవృత్తులకు అనుగుణంగానే వుంది మరి. పైగా మీరా తనను 'కృష్ణ ప్రేమదివానీ (కృష్ణప్రేమోన్మాదిని)' అని చెప్పుకుంది, 'సంకెల పెట్టినవేళ చంప బిలిచిన వేళ......... తేకువ హరినామమే దిక్కు' అని అన్నమయ్య అనుకుంటే -- మీరా అంటున్నది.

'మీరా కే ప్రభు గిరిధరనాగర బేగ్ మిలా అవినాపీ రే'

అంతటి ఆధ్యాత్మిక దృష్టితో హరి సాయుజ్యానికి అలమటించిన ఆ ఉన్మాదు లిద్దరూ అదృష్టవంతులు.

* * *

# 37. అన్నమయ్య వారసులు

'ధ్వని రాత్మా కావ్యస్య' అన్నారు ఆనందవర్ధనులు. అంటే కావ్యానికి ధ్వని ఆత్మవంటిది. అసలు ధ్వని అంటే ఏమిటి? 'ధ్వన్యతే ఇతి ధ్వనిః' అన్నారు శాస్త్రకారులు. ధ్వనింపజేసేది ధ్వని అని. నేత్రాగోచరమైన వస్తుజాలాన్ని మనో నేత్రంలో ప్రతిభాసింపజేసే నాద విశేషం ధ్వని అని అనుకోవచ్చు.

నిజానికి కావ్యప్రపంచానికే కాదు, ఈ చరాచర విశ్వానికే కారణ భూతమైందీ, ఆత్మా, ధ్వని అంటే ఆశ్చర్యం లేదేమో. ప్రపంచమంతా ఓంకారమనబడే ప్రణవపరబ్రహ్మమండే ఆవిర్భూతమైందనీ, నిశ్చలం నుండి వెలువడిన ఆ ఆదినాదతరంగమే ఆకాశంగా, వాయువుగా, అగ్నిగా, అగ్ని నుండి జలంగా, దానినుండి బృహద్ఘనతత్త్వం పృథివి ఏర్పడ్డాయని శాస్త్రం చెపోంది.

ఇలా ఏర్పడ్డ చరాచర వస్తుజాలంలో కూడ తత్తద్వస్తు ప్రతిబోధకమైన విశిష్ట వినూత్న ధ్వని అంతర్నిహితంగా ఉండి ఆ యా ధ్వనులతో ఆ యా వస్తు విశేషాలను మనఃఫలకాలపై ప్రతిబింబింప చేస్తుంది.

ఏక రూపాత్మక నాదబ్రహ్మం కాలాంతరాన బహువస్తు ముఖరితధ్వని రూపమై సమస్త వస్తుజాలానికి ఆత్మగా రూపొందింది.

అచలమా అనిపించే జడజగం చైతన్యవంతంగా కళకళ లాడుతూంటానికి కారణం ఈ ధ్వని ప్రపంచమే.

స్వల్ప భేదాలు తప్ప విశ్వమంతటా ప్రామాణిక వస్తుధ్వని ఒకే రీతిగా ఉంటుందనవచ్చు. అసలు సంగీతంలో ధ్వనించే సప్తస్వరాలకూ వివిధ ఉత్కృష్ట ప్రాణిజాల ధ్వనులే ప్రమాణమని ఈ సప్తస్వరాలను ఒక్కొక్క విశిష్టవస్తువు నుంచి సేకరించారని పెద్దలంటారు. అది నిజమే అనిపిస్తుంది.

దేశభాషాతీతంగా సంగీతం విశ్వమంతా వైశిష్ట్యాన్ని పొందుతున్నదంటే అందుకు కారణం ప్రామాణిక సప్తస్వర విన్యాసాలే. తీగలాగ సాగే ఆలాపన రాగం కాగా విరుపుగల స్వరవిన్యాసం లయ, తాళాది నామాలతో పాటలకు బాటవేసింది. భాషలోనూ, భావప్రకటనలోనూ భేదమే తప్ప అన్ని దేశాలలోనూ, స్వరసప్తకమే సంగీత సామ్రాజ్యం ఏలుతున్నది. అందువలననే వివిధదేశ విద్వాంసులు భాషాపరభేదాలను విస్మరించి సంగీతాన్ని ఆస్వాదించటమే కాదు, ఆ సంగీతం తమదా అన్నంత విభ్రాంతికరంగా, సాధనతో నేర్చుకొని ఆరాధించటం జరుగుతున్నది.

సంగీత సంగతులతోపాటు భాషా భావప్రౌఢిమగల వచోవిలాసాలను లయ భావప్రాధాన్యకమైన నాట్యావధానంగా మలచుకొని రసాధిదేవతను సరసపదసుమాలతో సంభావించటం జరుగుతున్నది. ఇందులో ముందుకు వచ్చి వందనా లందుకో తగిన మహానుభావు లెందరో ఉన్నా అందరికీ

ఆద్యులు ఆ పదకవితాపితామహుడు అన్నమాచార్యులు. అఖిలార్తిహరుడుగా, పుంభావ రసాధిదేవతగా ఆ వేంకటేశ్వరుని భావించి ముప్పది రెండువేల, పరమతంత్ర పదసుమాలతో అర్చించి బ్రతుకు కడచేరుకున్న ఆ మహనీయుని పదబంధ సుమగంధము వామనారంభ ప్రారంభమై త్రైవిక్రమ తేజంతో విశ్వాంతరాళాంతరమైన ఆదినాదబ్రహ్మాన్ని ఆరాధిస్తోంది.

ఆసేతుహిమాచలం ఉన్న వాగ్గేయకారులందరూ ఆ పారమార్థిక తత్త్వారాధనలో అన్నమయ్యకు వారసులే. పదకవితా పితామహుడుగా పేరొందిన ఆ మహనీయుని జయంతి వంటి ఉత్సవాలను జరపటం, మంచి మనసును మన్నించగల మనసు మన కింకా మిగిలి ఉందని ఏటేటా ఒకచోట చేరి ఆత్మసమర్పణ చేసుకోవటమే.

జయంతి తే సుకృతినః రససిద్ధాః కవీశ్వరాః,
నాస్తి తేషాం యశఃకాయే జరామరణజం భయమ్.

* * *

# 38. ఉత్సవాలు

ఉత్సవం అనే మాట సర్వసాధారణంగా ప్రయోగించటం జరుగుతుంది. దీని అర్థం గురించి ఆలోచిస్తే నిజంగా మనపూర్వులు జనసంక్షేమాన్నిగూర్చి ఎంత దీర్ఘంగా ఆలోచించారో బోధపడ్తుంది. 'సవం' అన్న మాటకు 'ఉత్' అనే ఉపసర్గ చేరిస్తే ఉత్సవం అవుతుంది. 'సవం' అన్న మాటకు యజ్ఞం, క్రతువు అనే అర్థం వస్తుంది. అంటే ఒకానొక అధిష్ఠానదైవ సంతృప్తికోసం, ఇహపరాలకు సంబంధించిన ప్రయోజనాన్ని ఆశించి శాస్త్రవిధిన జరిగే కార్య కలాపం. ఐతే ఈ అర్థం కేవలం పరిమిత ప్రయోజనమే సమకూరుస్తుంది. ఆ క్రతువిధానంలో పాల్గొన్నవారికి మాత్రమే దాని ఫలాలు అందుబాటులో ఉంటవి. 'ఉత్' అనే ఉపసర్గాత్మక ప్రయోగంతో పరిమిత పరిధి నతిక్రమించి

ఆ శబ్దం బహుళార్థసాధకమై సామాజిక సంక్షేమానికి తోడ్పడింది. అందుకే రామపట్టాభిషేక ప్రయత్నాల్ని వివరిస్తూ రామాయణంలో కూడా 'ఉత్సవశ్చ మహానాసీదయోధ్యాయాం జనాకులః' అని ప్రయోగించటం జరిగింది. మరి రాముడానాటికే దేవుడైనాడా అంటే, 'నా విష్ణుః పృథివీపతిః' అన్నమాటకు రాజారామునిలో స్థాపితమైన విష్ణ్వంశారాధన మన్నమాట అటుంచి, శాస్త్రోక్త సంప్రదాయంలో సామాజిక ఉన్నతపీఠాధిరోహణకు జరిగే ప్రక్రియలో ఆబాలగోపాలము పాల్గొని తృప్తిపొందారని అర్థం చెప్పవచ్చు. మరి సర్వమానవ సంక్షేమార్థం ఏర్పడిన దేవాలయాలలోని ఉత్సవాలు నిజంగా సర్వమానవసంతరణ సోపానాలనటంలో సందేహం లేదు.

ఉత్సవాలవల్ల అగ్రప్రయోజనం, మన అధిష్ఠానదైవ సంతృప్తితోపాటు ఆ కార్యకలాపాలలో పాల్గొనగల్గిన వేదవిదులకు, ఇతర శాస్త్రజ్ఞులకు పారలౌకిక ప్రయోజనంతో పాటు ధన రూపంలో, ఇతర రూపంలో భుక్తి సంప్రాప్తి.

రెండవ ప్రయోజనం భేదభావ విస్మరణం. ఉత్సవదినాలలో ఆలయ మూర్తుల ఊరేగింపు అనేది సర్వసాధారణంగా జరుగుతుంది. ఆ శక్తులు, అనర్హులు అని అనిపించుకొన్న వారికి సైతం పరమాత్మ దివ్యస్వరూప దర్శనంవల్ల ముక్తిభావసంతృప్తి కల్గుతుంది. స్వామివారి రథోత్సవాది కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనటం జరుగుతుంది. అవసరం కూడా. ఆ సమయంలో కేవలం పారమార్థిక భక్తితో గాక వేరుభావంతో చూచిన నరుడు నరకానికి పోతాడనికూడా శాస్త్రాలు నిర్దేశించాయి. తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవ కాలంలో గరుడోత్సవ, రథోత్సవాలు సందర్శించినవారి కిదెంతటి సత్యమో తెలుస్తుంది.

మూడవ ప్రయోజనం, పరస్పరావగాహనం. ప్రసిద్ధ దేవాలయాలలో జరిగే ఉత్సవాల సందర్భంలో దేశం పలు ప్రాంతాలనుండి భక్తులు అన్నిభేదాల కతీతంగావచ్చి సందర్శిస్తారు. వివిధ ప్రాంతాలలో ఆ

యా ప్రాంతాల ఆచార వ్యవహారాలు, వేషభాషలు అవగతం చేసుకోడానికి, పరస్పరం సంబంధాలు పెంచుకోవటాని కిద్ది దోహదం చేస్తుంది.

ఉత్సవాలు సార్వజనీన భుక్తిసాధనాలు. శాస్త్రకార్యక్రమాల ప్రమేయం ఉన్నా లేకపోయినా, దర్శించవచ్చే అశేషప్రజానీకం అవసరాలను తీర్చి తద్వారా జనం ఆర్థికంగా తమ జీవితాలను మెరుగుపరచుకోవచ్చు.

అన్నిటికన్నా ముఖ్యంగా ఉత్సవాలు విజ్ఞాన ప్రచారకేంద్రాలు. శాస్త్రీయ కార్యక్రమాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు మాత్రమేగాక శాస్త్రనిష్ణాతులు, కళాకోవిదులు, కోవిదలు తమతమ కళానైపుణ్యాన్ని ప్రదర్శించి, ఐహిక పారలౌకిక విజ్ఞానాన్ని యథాశక్తి, యథాయోగ్యంగా ప్రపంచించటానికి వీలౌతుంది.

ఈవిధంగా ఉత్సవాలు పంచముఖైశ్వర్యప్రదాలు. తరతరాల ఆధ్యాత్మికశక్తి ఆరకుండా వెలగాలంటే ఊరూర ఉన్న దేవాలయాలలో ఈ ఉత్సవచైతన్యం పెల్లుబకాలి. ఆ నాడే అన్ని దేవాలయాలు ఆధ్యాత్మిక భావసమైక్యతకు నిలయాలై ముందుతరాలకు మార్గదర్శకాలౌతాయి.

* * *

# 39. ధర్మం

ధర్మానికి హాని, అధర్మానికి అభ్యుదయం కలిగినప్పుడెల్లా తనకు తాను అవతరింపచేసుకుంటానని కృష్ణభగవానుడు గీతలో సెలవిచ్చారు. అసలు ధర్మమంటే ఏమిటి? దానికి గ్లాని ఎలా ఏర్పడుతుంది? ధర్మాలంటే ప్రాకృతిక ధర్మాలా?

ఇలాంటి అనుమానాలు కల్గితే మనిషి ముందుకు సాగటం కష్టం. నిజానికి మనం ధర్మమన్న పదాన్ని చాలా విభిన్నార్థాలలో వాడుతున్నామా

అనిపిస్తుంది. నిజానికి ధర్మమంటే ధరించి, ధరింపబడేది. చరాచర జీవ జాలంలో కన్పించేది ప్రకృతి సహజస్వభావమేగాని, ధర్మం కాదనిపిస్తుంది. ప్రాకృతిక ప్రవృత్తికి భిన్నమైందీ, హృదయస్పందకమై ఆలోచనాత్మకమైన సామాజిక సామ్యత ధర్మమనిపించుకుంటుందేమో! అనంత జీవకోటిలో మానవుణ్ణి ఇతర ప్రాణులకన్న వేరుచేసేది అతనికున్న ఉచితానుచిత వివేచనాశక్తి. అణుప్రాయమైన ఈ బుద్ధి వయసు, సామాజికవ్యవస్థల కనుగుణంగా ప్రవర్తితమై ప్రవృద్ధమౌతుంది. ఆంతరికమైన ఈ సద సద్వివేకమే మనిషి మతిని గతిని నడిపించి, మంచిమార్గాన మాధవ సముదయ్యేందుకు తోడ్పడుతుంది. పదిమందికి మేలు కలిగేది మేలైనదని, పదిమందికి అపకారకారణం పరిహార్యమని బుద్ధివికాసానుగుణంగా మనిషి గ్రహించగలుగుతాడు. మనిషి ప్రవృత్తి సమాజం మీద పడి ధర్మధృతియో ధర్మక్షతియో జరుగుతుంది. ఆ క్షతి అధికమై సమాజం సంక్షుభితమైనప్పుడు సమాజ ధర్మ కర్మ నిర్వహణకు ఒక అపూర్వశక్తి అవసరమౌతుంది. దివి నుండి భువికి దిగి వచ్చిన ఆ విధానాన్నే మనం అవతారం అనుకోవచ్చు.

కృత, త్రేత, ద్వాపర పూర్వయుగాలలో అలాంటి సామాజిక అవ లక్షణాలు స్పష్టంగా కన్పించాయి. కాని ద్వాపరంలో మాత్రం దీనికి భిన్నంగా జరిగిందా అనిపిస్తుంది. భగవానుడు జన్మించిన కొన్ని సంవత్సరాలకుగాని బీజారోపం జరిగి మరి కొన్ని ఏళ్ళకుగాని దారుణ మారణకాండలోకాని సమాప్తి కాలేదు.

మరి భగవానుడు ఓ వంద సంవత్సరాల తరువాత జరిగే అక్రమాల నిరోధానికి, ధర్మరక్షణకు అవతరించారని అనవలసివస్తుందా!

ద్వాపరాంతానికి కలియుగానికి మధ్య జరిగిన కృష్ణచరిత్రలో కలి ధర్మాలు చాపక్రింద నీరులాగా చల్లగా ప్రవహించి పరిమిత బుద్ధులకు అపరిమిత మనస్సులకు విపరీతమనిపించి అవతార భావనకు ప్రయోజనాన్ని అవహేళనకు గురిచేశారు.

సామాజిక న్యాయాన్ని అతిక్రమించటం ఎప్పుడు ప్రారంభమౌతుందో అప్పుడే ధర్మగ్లాని ప్రారంభమౌతుంది.

కృతత్రేతాదులలో మానవసమాజంలో భ్రూణ శిశుహత్యాదులు జరిగినట్లు కన్పించదు. ద్వాపరయుగంలో సామాజిక న్యాయం కొరవడి సర్వం వీరభోజ్యం అనే స్థితికి సుగతివచ్చి, కలవాని కండబలం ముందు కలిమికి, కలికికి -- కానిరోజువచ్చి అరక్షణీయస్థితి ఏర్పడింది. కంసుడు, జరాసంధుడు లాంటి ఆతతాయిప్రభువుల ఆగడాలు పెచ్చుమీరాయి. ఇటువంటివారిని యమపురి కంపటానికే కృష్ణభగవానుడు అవతరించింది. తరువాత కురుక్షేత్ర యుద్ధం అనుషంగికం మాత్రమే అనిపిస్తుంది.

బలవంతుడు భగవంతుడు అన్న భావన దూరంచేసి చూస్తే శ్రీకృష్ణ జీవితంలో సర్వజనాళికి సందేశం కన్పిస్తుంది. నిత్యం భయాల మయమై బ్రతకనీయని సమాజంలో బ్రతికేందుకు, ఎన్ని యుక్తులు నేర్చుకోవాలో ఎంత రాజకీయ పరిజ్ఞానం కావాలో మనిషి రాజకీయంగా మనీషిగా ఎందుకు మారాలో భగవానుని జీవితం బోధిస్తుంది.

కాని మనది మాయబ్రతుకు. మాయామోహితులం. కనుకనే అవతారప్రయోజనాన్ని అర్థం చేసుకోకుండా ఆరాటపడటం జరుగుతున్నది. నిజానికి మన కర్థంకాదని భగవానుడే చెప్పాడు.

అవజానంతి మాం మూఢాః మానుషీం తనుమాశ్రితమ్,
పరం భావ మజానంతో మమ భూతమహేశ్వరమ్.

మనీషి కావాలనుకున్నవాళ్ళు మళ్లీ మళ్లీ యత్నించాలి, అంతే.

* * *

# 40. గుడికెందుకు వెళ్ళాలి ?

మనిషెందుకు గుడికి వెళ్తున్నాడు? మనసు బాగాలేక. మనసెందుకు బాగాలేదు? మాయదారి బ్రతుకు కనుక. ఇది అనుకోటానికి కష్టంగా ఉన్నా అక్షరాలా నిజం. మాయాధారివల్ల మాయదారుల్లో వాటి జల్తారుల్లో మన మీ లోకంలో పడ్డాం. మనం మాత్రమే ఏవిటి, కదిలీ కదలక కనిపించే జగత్తంతా అలా ఏర్పడిందే. కాకపోతే అంతో ఇంతో ఆలోచనాశక్తి గల మనిషనిపించుకునే ప్రాణిమాత్రం, నే నెందుకిలా అవుతున్నాను. నాకెందుకిలా ఔతున్నదని అనుకోవటం కద్దు. అన్నివైపులా అందంగా కన్పించే మాయదారుల మర్మం తెలియక తపిస్తూ మాయదారులు లేని మార్గం చూపించమని, తనలాగా ఉండి తనకన్న కొన్ని కోట్లరెట్లు గొప్పవాడైన వాడిముందు మొరపెట్టుకుని మనశ్శాంతిని, స్థైర్యాన్ని పొందుతాడు.

ఇలాంటివారినే భగవానుడు ఆర్తులన్నాడు.

పరిశ్రాంతుడు ప్రశాంతత పొందటానికి కూడా ఒక అనువైన వాతావరణం కావాలి. అందుకే మన పూర్వులు ఆరాధనాలయాలను ఆర్భాటాలకు దూరంగా గుహలలో పర్వతాగ్రాలనో, నదీనదతటానో ఏర్పరచి, శ్రద్ధా శ్రమా కలిగినవారలందరికీ, ఆరాధనానంతరం పరిపూర్ణ తృప్తి గల్గేందుకు తోడ్పడ్డారు. ఆలయశిఖరాలు, ధ్వజాలు సుదూరజనాన్ని ఎలా ఆకర్షిస్తూండేవో చరిత్ర చదివిన వారందరికీ తెలుసు.

కాని కాలం మారింది. మనశ్శాంతి నివ్వవలసిన ఆలయాలు మాన్యత కోల్పోయాయి. ఆకృతిలోనూ, ఆధ్యాత్మికతలోనూ ఆకాశాన్నంటిన ఆలయాలు నిత్యనివేదనలే కరువై, కళా 'ఖండా'లై ఖండాంతరాలకు పారిపోతున్నాయి.

ప్రాచీన కళా ఔన్నత్యంతోపాటు ఆదర్శాలను కూడా పరిరక్షించేందుకు చేత ఉన్నవారు, చేవగలిగినవారు పూనుకోకపోతే, నమూనాలుగా నాలుగైదు దేవాలయాలు మిగిలి, మిగిలినవి 'ఉండేవిట' అని భావితరాలు భావించే ప్రమాదం ఉంది.

* * *

# 41. మతం

మతం మనిషికి మత్తుమందులాంటి దన్నాడో మహనీయుడు. మతం సంగతలావుంచి మత్తు ప్రభావం ఎలాంటిదో చూద్దాం. ఆరంభంలో అందరి మాదిరివున్న మనిషే, కైపు తలకెక్కేటప్పటికి చాలా విచిత్రంగా ప్రవర్తిస్తాడు. ఆ కాసేపు ఈ విశాలవిశ్వంలో తానే మగరాజు, మహారాజుననే భావం అతణ్ణి ఆక్రమిస్తుంది. ఎదుటివాడు ఎందుకూ పనికిరాని చవట అని, తానే సర్వజ్ఞుణ్ణనే దర్పం నిలువెల్లా నిండిపోతుంది. తన పైచేయి, నిరూపించుకోవటానికి. అందరికన్న పెద్దగా మాట్లాడటం, పోట్లాడటం, దారినపోయే ప్రతి దానయ్యమీద చేయిచేసుకోవటం; ఎదుటివాడు ఎదురు తిరిగి రెండంటిస్తే కైపు క్రిందికి దిగి, 'నువ్వా? ఎవరో అనుకొన్నా' అని దులబరించుకు లేచిపోవటం -- ఇదీ సంతత సమస్యా వలయంలో తిరిగే సామాన్యుని కించిత్సరస విలాసప్రహసనం. నిజానికేది మితి మించి తలకెక్కినా అందరి స్థితి ఇదే. వాటి మదం అలాంటిది. అయితే ఈ గుణాలన్నిటిలోను 'మాకుందేటికి మూడే కాళ్ళనే తత్త్వం మతాభిమానులలో కాస్త మోతాదు మించివుండటంతో, తార్కికబుద్ధి తనకు తగదన్నట్లు ప్రవర్తిస్తుండటంవల్ల, మతం మనిషికి మత్తు మందని బుద్ధిమంతులు అనుకొని వుంటారు.

కాని భరతఖండమని పేరుబడ్డ ఈ భూఖండం మాత్రం మొదటి నుంచి ఈ ప్రవృత్తులకు దూరంగానే వున్నది. కారణం ఇక్కడిది ఒక మతం కాకపోవటమే. పరిణత బుద్ధులు, త్రికాలవేదులైన మహర్షులు సామాన్యమానవ జీవనంలోని సమాన విశేషాలన్నింటినీ క్రోడీకరించి, ఆ ఒరవడిలో ప్రవహింప జేసిన సంతత జీవనస్రవంతిలో ఆపాదమస్తకం మునుకలిడిన దివ్యదేశం ఇది. కనుకనే గ్రీకులు, రోమనులు, హూణులు, శకులు, యవనులు ఇంకా ఎందరెందరో తమ బలదర్పాలతో ఈ అమృత వాహినికి అడ్డుగోడలు వేయాలని ప్రయత్నించినా, ఈనాటిదాకా నిశ్చల గంభీర నిర్ఝరిగా సాగివస్తున్నదంటే, అందుకు కారణం మహామనీషుల అంత ర్మథనావిర్భూతమైన సుసంఘటిత జీవనవిధానమనే చెప్పాలి. సర్వమానవ సమతాధర్మాలు సర్వత్రా పరివ్యాప్తమైనవన్న సత్యాన్ని గుర్తించారు కనుకనే విదేశీయులు దాదాపు అందరూ తమ ప్రత్యేకతను కాపాడుకుంటూ కూడా భారత జనతాస్రవంతిలో అంతర్భాగాలుగా విలీనమయ్యారు. ఏమలోని ప్రాణాన్ని చాటిచెప్పిన మహావీరుడు, అహింసే పరమధర్మంగా బోధించిన గౌతమబుద్ధుడు వెలసిన దివ్యదేశంగా మారింది ఈ దేశం.

మతవ్యాప్తికి కత్తిపడునే ఆదనను కొన్నవారి పరిపాలనలో కూడా చాలావరకు మానవత్వమే మనుగడ సాగించిందని చెప్పాలి. తాన్‌సేన్, బీర్‌బల్, గురునానక్, కబీర్, రాస్ఖాన్, జగన్నాథపండితరాయలువంటి మహామనీషులెంతమందో తమ ప్రతిభావిశేషాలతో జాతిని ఉత్తేజ పరిచారు. సార్వకాలిక సమాధాన సర్వస్వమైన భగవద్గీతను ఉపనిషత్తులను అరబ్బీలోనికి అనువదించాడా మొగల్ షహజాడా దారా! ఇంకా 50 ఉర్దూ అనువాదాలు కూడా భగవద్గీతకు వున్నాయంటే అందుకు కారణం రాజకీయపు రాజసపు తెరలు తొలగించుకొని ఈ జాతి మానవతామాతృమూర్తిని దర్శించి తరించాలనుకునే తపనే! మాక్సుముల్లర్, అనిబిసెంటు, నివేదిత, గుండర్ట్, కిట్టేల్, కార్లైల్, బ్రౌన్ ఇంకా ఎందరో భారత ధర్మాని కితోధికంగా

సేవచేసి, జాతిచరిత్రలో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నారు. ఈ నాటికికూడా భారతీయ శాస్త్ర విధులమీద, విధులమీద ప్రామాణిక పరిశోధనలు జరుగుతున్నవికూడా, ఇక్కడికన్న అక్కడే ఎక్కువ.

కాని ఈనాడు జరుగుతున్నదేమిటి? ఆ విశ్వమానవ సౌభ్రాత్రసూత్రాలకు తీరని ఆఘాతం కలుగుతోంది. ఇంటా బయటాకూడా ఏదో ఒక రూపంలో విద్వేషానలం రగిలి మానవత్వానికే మారణం జరుగుతోంది. బుద్ధధర్మామృతాన్ని పానంచేసిన దేశంలో ఆ ధర్మాలకే కాలదోషంపట్టి, అనుకోలేని అత్యాచారాలు జరిగాయి. ఇంట భాషారోషాలకు కొందరు బలైతే, మతకల్లోలాల పేరిట మరికొందరు మరణిస్తున్నారు. సర్దుకొనిపోదగ్గ చిన్నసంఘటనలుకూడా చిలికి గాలివానగా మారి ఎందరినో బలిగొంటున్నవి. నిజానికవన్నీ మత కల్లోలాలా? ఇంత కల్లోలపూరితంగా ప్రతిరోజూ భయంతో చస్తూ బ్రతకమని ఏ మతమన్నా సిద్ధాంతీకరించిందా? మతమే విభిన్నతకు కారణమైతే, ఒకే మతంలోని వారిలో ఎన్నో దేశాలలో ఘర్షణ ఎందుకు ఏర్పడుతున్నది? పాలుగారే పిల్లలను, పాల పొంగుల యువతరాన్ని సమిధలుచేసి, సంబరపడే మతం ఏదీ లేదు. ఏమతంవారైనా ఈ జాతీయ జీవనవిధానంతో అల్లుకుపోయినవాళ్లే! అందరూ ఈ పుణ్యభూమికి పసిపాపలే! అందువల్లనే, జరుగుతున్నవి మతోన్మాదచర్యలుకావు మదోన్మాదచర్యలు -- అంతే! సాటి మానవుల సంఘర్షణలాధారంగా బ్రతికే పరాన్నజీవులు కొంతమంది ఎప్పుడూ ఉంటారు. ఎదురింటి మంటతో మనచుట్ట వెలిగించుకొందామనే మతమే తప్ప, వేరేమతం, ధర్మం, జాతి భేదాలేవీ వీరికి ప్రత్యేకంగా వుండవు. కాని, ఈ మండే కొరవుల్ని పక్కనుంచుకొని సమాజం నిద్రపోతూ, మతోన్మాదమని కలవరిస్తోంది. మతం ఒక అభిమతం మాత్రమే. అది మానవత్వపు విలువలకు అడ్డు రాకూడదు. మనుషులెలా ప్రవర్తించాలన్న విషయం భారతంలో స్పష్టంగావుంది.

ఒరులేయవి యొనరించిన
నరవరఁ యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్.

-- శాంతి.5-220.

దీన్నే ఇంకోవిధంగా ఎదటివారి కంటి నలుసుగూర్చి చెప్పే ముందు నీ కంటిదూలం తొలగించుకోమని అన్నారు. ఈ సత్యాలను, కాదన్న మతం ఇంతవరకూ రాలేదు. కనుక అన్నిమతాలవారూ ఈ మతోన్మాదాన్ని ఎదుర్కొని బుద్ధిచెప్పాలి. అప్పుడే అన్ని మతాలలోను సమతాధర్మం మరింత జాగృత మౌతుంది, అంతవరకు......?

సబ్ కో సన్మతి దే భగవాన్! అని ప్రార్థించటమే సన్మతం.

* * *

# 42. అన్నయజ్ఞం

సగుణసాకారాన్ని, నిర్గుణ నిరంజనాన్ని ఏకనిష్ఠతో సమభావనతో ఆరాధించగల్గిన ఘనత ఒక్క భారతీయులకే దక్కినది. ఒకవంక సూర్యచంద్ర కాంతి శబ్దరహిత కాలాతీత పరమధామం నుండి సగుణ సాకారప్రపంచం ఎలా ఆవిర్భవించిందో వివరిస్తూ, మరొకవంక ఈ సర్వసగుణ సాకార విశ్వమంతా ఒకానొక బ్రహ్మతత్త్వంచేత ఆవిర్భూతమూ, ఆవాహితమూ, అంతఃస్థితమూ కాబడివున్నదని, ఆ బ్రహ్మమే శ్రీమన్నారాయణుడనీ, శ్రీమన్నారాయణుడే సర్వేసర్వత్రా వ్యాపించివున్నాడనీ, ఏకత్వంలో అనేకత, భిన్నత్వంలో పరిపూర్ణమైన ఐక్యత నిరూపించారు. ఈ విశ్వమంతా ఈశావాస్యమనీ, ఆ మహాశక్తిచే సృష్టము కానిదేదీ లేదనీ, మనకు లభించే

దంతా ఆ దివ్యప్రసాదమేనని కూడ పేర్కొనటం జరిగింది. అంటే సర్వత్ర సమదర్శన మైన భారతీయుల తత్త్వసిద్ధాంతంలో బ్రహ్మమయం కానిది ఏదీ లేదన్నమాట. అందువల్లనే సకల జీవులకు ధారకమూ, పోషకమూ, అస్తిత్వానికీ ఆధారభూతమైన అన్నాన్ని కూడ పరబ్రహ్మస్వ రూపంగానే ఆరాధించారు. అంటే ఈ ఆహార శక్తిలోని పరిణామదశలు సకల జీవరాశి సృష్టి స్థితిలయాలకు కారణభూతాలై మూల మూర్తిత్రయ తత్త్వాలను నిర్వహిస్తున్న వన్నమాట. అందుకే భారతీయులు అన్నాన్ని బ్రహ్మమయమనీ, బ్రహ్మతత్త్వానికి ప్రతిరూపమనీ భావించారు.

గీతలో భగవానుడు చెప్పినట్టు.......

"అన్నాత్ భవంతి భూతాని" అంటే సర్వభూత జాతానికి అన్నమే ఆధారస్థానమని గ్రహించారు. కనుకనే అజ్ఞాత నిర్గుణ బ్రహ్మమే ఒకానొక బాహ్యప్రతిరూపంగా బ్రహ్మస్వరూపమైనటువంటి, సకల జీవజాలానికి, భగవదర్పితమైన ఈ అన్నాన్ని ప్రసాదంగా వినియోగించి సగుణ బ్రహ్మారాధనలో సార్థక్యాన్ని సంపాదించుకున్నారు. ఒకనాడు మహర్షులు సత్రయాగాలు జరిపినా, రాజాధిరాజులు అన్నసత్రాల నేర్పరచినా, అన్నిటికి మూలమైనది, సకల జీవులలో పరివ్యాప్తమైన ఆధారశక్తిని బాహిర భగవద్రూపమైన ఆహారశక్తితో పరిపుష్టం చేసి సకల జీవన సంతుష్టకమయిన బ్రహ్మానంద సంపాదనమే, లౌకిక పారలౌకిక పరమార్థమని మనవారి మనసులోనిమాట.

పితృదేవతలు తమ తమ ఆబ్దిక తిథులలో దిగివచ్చి తద్వంశజులు సమర్పించే ఆహారాన్ని అందుకుంటారనీ, తద్ద్వారా, వారి వారి లోకాలలో వారి వారికి ఆకలిదప్పులు అగుపించవని, అందువలన పితృయజ్ఞం కూడ బ్రహ్మారాధనమేనని భావన కలుగబట్టే, ఆ క్రతుసమయంలో అన్నసూక్తపఠనం "అన్నం బ్రహ్మ, అహం చ బ్రహ్మ, భోక్తా చ బ్రహ్మ" అని పరిపూర్ణ అన్న బ్రహ్మతత్త్వారాధనకు అవకాశం కల్పించారా అనిపిస్తుంది.

ఇలా ఇలా బహుముఖాలుగా విస్తరించిన అన్నదానమహిమను అర్థం చేసుకున్న పుణ్యాత్ములు బహుజన ప్రయోజనకరంగా ఆలయోత్సవాల సందర్భాలలో, కొన్నిచోట్ల నిత్యవిధిగానూ అన్న దానాలను ఏర్పాటుచేశారు.

ఈనాడు కూడ కొన్ని కొన్ని ధార్మిక కేంద్రాలలో, ఇతర ఆరాధన స్థానాలలో ఈ అన్నసమారాధన అవిచ్ఛిన్నంగా సాగుతూనే వుంది. కాని రాజులను త్రోసి రాజన్న వర్తమానంలో వైయక్తికంగా అన్నదాన నిర్వహణ అసాధ్యం. దీనిని ప్రవృద్ధం చేసేందుకు ఎక్కువమంది సమాజహితైషుల సహకారం కావాలి. అన్నదాన యజ్ఞంలో పాలుపంచుకోవాలి. అదే నిజమైన పరబ్రహ్మ సేవ అనిపించుకుంటుంది.

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్,
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా.

* * *

# 43. తన కోపం

ప్రాణికోటి, ముఖ్యంగా బుద్ధి సంబద్ధ జీవులన్నీ సత్త్వరజస్తమాలనే గుణత్రయ సంజనితాలని పురాణాలు శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఈ బుద్ధి బద్ధ జీవాలన్నిటిని పరమాత్మ తన లీలావినోదం కోసం 14 లోకా లేర్పరచి వాటికి పంచాడు. ఊర్ధ్వ లోకాలన్నీ దేవలోకాలనీ, భూమికి దిగువలోకాలన్నీ అధోలోకాలనీ, నడుమనున్న విశాల ప్రపంచమంతా నరలోకమని లోకాల విభజన తెలిపినవారు అన్నారు.

కాని పురాణగతి చూచినవారికి చాలా వింతలు కన్పిస్తాయి. అటు దివిజులకు, ఇటు దితిజులకు పరస్పర వైరుధ్యాలెన్నున్నా, కొన్ని సమాన ధర్మాలున్నాయి. కామరూపం, కామగమనం, అదృశ్యకరణి ఉభయులకు

సమంగా ఉన్నాయి. నరులకు మాత్రం నానావిధాల నిష్ఠలు, నియమాలు తపస్సులు సాధనలూ. ఇన్ని చేసినా, ఆ అపూర్వశక్తులు పొందినవారు ఏ కొద్దిమందో వారూ సమాజాని కతిదూరంగా కాలం గడిపేశారు.

ప్రతిమాటూ ఒక పొరపాటుద్వారా నూతన సందేశాలిచ్చే దివిజులకు, అహంకరించి అధికారాలు కైవసం చేసుకునే అధోలోకవాసులకు అన్ని శక్తులనిచ్చి, అల్పబుద్ధులూ, అల్పాయువులైన నరులను, నానావిధ గాథలతో బాధలతో బ్రతకమని వ్రాశాడా భగవంతుడు? ఇదే గనుక నిజమైతే నిజానికి భగవంతుడంత పక్షపాతి మరొకరుండరు. దేవుళ్ళకు, దైవ విరోధులకు సమాన సత్త్వాలకు స్వత్వాలను ఇచ్చి, ఎప్పుడు హరిహర భక్తితో బ్రతుకు వెళ్ళపోసే నరులకు మాత్రం అందని స్వర్గాన్ని, అనుభవింపరాని నరకాన్ని అరచేతితో చూపిస్తూ భయపెట్టటం న్యాయమా అనిపిస్తుంది కూడా.

కాని సృష్టికర్త ప్రతిచర్యలోనూ మనకు కన్పించే సంశయం వెనుక సందేశం ఉండనే వున్నది. కనుకనే మానవులెంత సంశయాత్ములయినా అంతలోనే సందేహ నివృత్తి కలిగి పరమపితకు ప్రణమిల్ల గలుగుతున్నారు.

ఈ పురాణ గాథలను సూక్ష్మంగా పరిశీలిస్తే నిగూఢ సత్యాలెన్నో బయటకు వస్తాయి. దివిజులైనా, దనుజులైనా అలవిమాలిన శక్తులు లభించినప్పుడు వాటిని ఎలా దుర్వినియోగం చేశారనేది సోపపత్తికంగా వివరిస్తాయి. పదవీభంగభయంతో అన్ని అలౌకిక శక్తులున్న దేవతలు అక్రమంగా ప్రవర్తిస్తే, అన్ని అలౌకిక శక్తులూ సంపాదించిన రాక్షసులు వరాది బలగర్వంతో పై లోకాలవారిని పడగొట్టాలని అత్యాచారాలు జరిపారు. పశ్చాత్తాప బుద్ధిగల దేవతలు పరాభవమాత్ర దండ పరిపీడితు లైతే అహంకరించి అత్యాచారులైన రాక్షసవీరులు అసువులు కోల్పోవటం జరిగింది. నిజానికి ఉభయవర్గాల కర్మ పరిపాకం జరిగిందీ ఈమేదినిమీదే. దివిజులు శిక్షానుభవం కోసం భువికి దిగివస్తే, మరుజన్మకోసం రాక్షసులు నరజన్మ వెతుక్కుంటూ వచ్చారు. కనుకనే ప్రజ్ఞాచక్షువులందరు ఈ

సిద్ధులన్నింటినీ ఆత్మోజ్జీవనాని కపకారులుగానే భావించి పునరావృత్తి రహిత శాశ్వత బ్రహ్మలోక నివాససిద్ధికి మాత్రమే ప్రయత్నించారు.

నిజానికి నరులకు, ఆ మాటకువస్తే ఎవరికైనా బరువయిన వరాలిస్తే ఎంతటి ఆత్మనాశనం జరుగుతుందన్నదానికి భస్మాసురచరిత్రే సాక్ష్యం. ఇక నరలోక శ్రేష్ఠుడైన నహుష చక్రవర్తికి సురనాథ పదవి లభిస్తే అవ 'సర్ప' దూషితుడై అవనిమీదకు దిగిరావలసి వచ్చింది. ఇక సామాన్య మానవు లతిలోక శక్తియుతులయితే సమాజాని కే గలిపడుతుందన్న దానికి నరకుడి చరిత్రే సాక్ష్యం. అందు కే ఈ శక్తులన్నీ నరులందరి అందుబాటులో లేవు.

నిజానికి, మనిషికి మనస్సే మిత్రుడు, శత్రువు. నాకమైనా, నరక మైనా, అన్ని సాధనలు అంతస్సాధనలోనే వున్నాయి. అభిజాత్య ప్రాప్తివల్లనో, అధికార ప్రాప్తివల్లనో అలౌకిక శక్తులు సురలకు సమకూరితే, కఠోరదీక్షతో నియమ నిష్ఠానుష్ఠానాలతో దానవులు వరబల సంపన్నులై వాటిని సమకూర్చుకున్నారు. అయితే ఏం లాభం? బలివంటి వదాన్యు డుగాని, హిరణ్యకశిపునివంటి వేదాంతిగాని, వృత్ర, రావణాసురులవంటి తత్త్వజ్ఞానులు కాని ఎవరూ లేరు. అయినా వారి చర్యలే వారి పతనానికి హేతువు లయ్యాయి.

అందువల్లనే ఆ గాథలబాధలు పరిశీలించిన విదులు నరులందరినీ పతనహేతువులైన ఈ 'వర' మదిరామత్తులు కాకుండా పదిమందికీ పని కివచ్చే విధంగా జనరూపజనార్దన సేవలో తనువులు చెల్లింమకొండనీ అంతగా అనుభవం కావల్సిన వాళ్లకు అడవుల్లోకి పోయి సాధింమకొండనీ సూచించారు.

అందలేదని అనుకోవటమేగాని, నిజానికి 'వా' రహిత నరులకా 'వర' వాలమే ఉంటే పట్టశక్యమా? కోతిమూక కాపేయ చాపలంబుతో మధువనం ధ్వంసం చేస్తే అది సీతమ్మవారిని చూచివచ్చిన సంతోషానికి సంకేత మని సుగ్రీవుడు సమర్థించాడు. ఊరు తగులబడుతుంటే 'నీరో' సంగీతం

వాయిస్తూ సంతోషించాడట! ఇది కూడా ప్రమాదకరమైంది కాదేమో. అశ్వత్థామ అపాండవం చేసే ప్రయత్నంతో శిశుహత్య భ్రూణహత్యలకు పాల్పడ్డాడు. ఇంతకన్న దారుణమైంది, బ్రతుకంటే ఒక భయంగామార్చి, నడిచే బళ్ళల్లో సైతం నిప్పంటించే రాక్షస ప్రవృత్తి. ఈ అర్థరహిత పరమకిరాతక ప్రవృత్తి ప్రబలుతున్న ఈ సమాజానికి ఇంకా ఆ వరాల కొరువు లెందుకు? పరులచే పీడ, చీడ అనే చీదరింపులు లేకుండా బ్రతికితే అదే అంతరాత్మ సేవ. తనలాగా పదిమందికి బ్రతుకు నిచ్చినా, బ్రతక నిచ్చినా చాలు. అదే పరమమానవసేవ -- పరమాత్మ సేవ. మనిషి మనస్సునుబట్టే సమాజంలో స్వర్గమైనా నరకమైనా, అందుకే సుమతి అన్నాడు--

"తన కోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ,
తన సంతోషమె స్వర్గము,
తన దుఃఖమె నరకమండ్రు తథ్యము".

అని. కాని మనం వినాలి గదా! అదే ప్రశ్న, ఆశ కూడా!

* * *

# 44. లాలన -- పాలన

ఏడవకు ఏడవకు వెఱ్ఱిపాపాయి ఏడిస్తే నీ కళ్ళు నీలాలుగారు
నీలాలు గారితే నే చూడలేను పాలైన గారవే బంగారు కనులు

ఈ తేట పాటలో ప్రతిమాటా పొంగి పార్లే మాతృవాత్సల్యానికీ, బిడ్డ బాధ పట్ల తల్లిపడే వేదనకీ సూటైన ప్రతిబింబం. నిజానికి ఏ భాషలో నైనా ఏ దేశంలోనైనా దీనికి దీటైన భావమే తల్లిప్రేమను వెల్లడిచేస్తుంది. ఇంతగా ప్రపంచమంతటా వ్యాపించిన ఈ ప్రేమ, రక్షణ, శిశువు లందరికీ

లభిస్తున్నదా అంటే లేదనేందుకు, తల్లిదండ్రులు బిడ్డలపట్ల తమ కర్తవ్యాన్ని సరిగా నెరవేర్చడం లేదనటానికి నాటి నుండి నేటి వరకూ గల మన కథలలో కావల్సినన్ని ఉదాహరణలున్నై.

తల్లిదండ్రుల ప్రేమాభిమానాలకు పాత్రులైన పిల్లలు సుశిక్షితులై ఉత్తమ వ్యక్తులై లోకానికి ఆదర్శ ప్రాయులయ్యారు. రామాయణంలో మనకు తారసిల్లే ప్రతి పాత్రా చివరకు రావణుడి సంతానంతో సహా ఇలాంటి వారు గానే కనిపిస్తుంది. సంస్కారం, సామాజిక విలువల స్పృహగలిగిన తల్లిదండ్రులు తమ సంతానాన్ని పెంచిన విధానమే ఇందుకు కారణం.

కొన్ని సందర్భాలలో తల్లిదండ్రుల గారాబం మిగిలిన విలువల్ని ముంచి వెయ్యడం జరిగింది. అట్టి సందర్భాలలో పిల్లలు ఏ విధంగా తయారౌతార న్నదానికి భాగవతంలో కృష్ణ పరమాత్మయే సాక్ష్యం. ఆయన భగవంతుడన్న విషయాన్ని పక్కకువుంచి పరిశీలిస్తే, పుట్టుకతో దేవకీసుతుడే అయినా యశోదానందవర్ధనుడుగ పరిమిత శిక్షణ గలిగిన జానపదసమాజంలో పెరిగిన బాలకృష్ణుని పట్ల "పోయిద మెక్కడికైనను, మా యన్నల సురభు లాన మంజులవాణీ" అనే గోపకాంతల నిరసనం ఏ ఊళ్ళో ఏ దొరబిడ్డకైనా ఎదురయ్యే ఫిర్యాదే!

మన చరిత్రలో తండ్రుల పలాయన వాదంవల్లా లేదా విలక్షణ కార్యా లవల్లా వారి బిడ్డలు అనాథులన్నంత విచిత్ర పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. ఆదుకోనేందుకు కణ్వమహర్షి, వాల్మీకిలాంటి పుణ్యపురుషులు లేకపోతే భరతుడు, కుశలవులు వేరే విధాంగా తయారయే వారేమో! కాని వారి అదృష్టవశాత్తూ తర్వాతి కాలానికైనా వారు తమ తల్లిదండ్రుల అభిమానాన్ని పొందగలిగేరు.

కాని ఏ దుర్విధివల్లనో, ఆపత్తువల్లనో అనాథులు కావడంగాక కేవలం తల్లిదండ్రుల పిరికితనం, పలాయనవాదంవల్ల తాము అనాథులమైనట్లు తెలిసిన శిశువులలో ఏర్పడే మానసిక వేదన, అటువంటి శిశువులలో

ఆ పెద్దలపై పేరుకుపోయే కసి అంతా ఇంతా కాదు. ఉదాత్తులవల్ల, సామాజికంగా లభించిన గౌరవాలు, స్వీయ ప్రజ్ఞాపాటవాలు ఎంతటివైనా వారి మనసులో పాతుకుపోయిన ఈ మత్సరం ఒక మహాప్రళయం సృష్టించగలదని మహాభారతం రుజువు చేసింది. కానీనుడైన కర్ణుడి కథే ఇందుకు పరమ నిదర్శనం. జన్మదాతల ఆదరాభిమానాలు దూరమై రాధేయుడుగా మహాభారత రణాన్ని నడిపించిన కర్ణుని మనఃస్థితి తరతరాల తల్లిదండ్రులకు ఒక చెరగని హెచ్చరిక. కన్యాపుత్రుడు, రాధేయుడు అన్న ఈసడింపులుగాక పాండునందనుడన్న గుర్తింపు వచ్చివుంటే బహుశా భారతకథ వేరొకమలుపు తిరిగివుండేదేమో!

ఇలా ఒక్కొక్క చరిత్రను గురించి ఎన్ని వ్యాఖ్యానాలైనా చేసుకుపోవచ్చును. ప్రతివిపరీత చర్యకూ కారణాలు ఎన్నింటినో చెప్పకోవచ్చు. కాని కారణం ఏదైనా శిశువుకు అన్యాయం, మానసికమైన అఘాతం తగిల్తే దాని నుండి కోలుకోవడం కష్టమని ఆ బాధ మితిమీరినదయినపుడు మతిపోయి ఒక్కొక్కప్పుడు అది మానవ వినాశానికే దారి తీయవచ్చునన్నది చరిత్ర చెప్పలేకచెప్పిన సత్యం.

గతమెప్పుడూ వర్తమానపు మజలీ నుండి భవిష్యత్తును చేరే బంగారు బాటకొక వెలుగుదీపిక. మొన్నటి చెడు నేటి అనుభవమై రేపటి అలవాటుగా మారకుండా వుండాలంటే ఈ సందర్భంలో ప్రతితరం తన అంతరాన్ని తరచి చూసుకోక తప్పదు.

* * *

# 45. మాతృత్వం

సూక్తులు సూదుల్లాంటివి. మామూలు మాటలు ఈటెల పోటుల్లాంటివైతే, ఇవి సూక్ష్మంగా సునిశితంగా అనువైనచోట సున్నితంగా తాకి తమ

ప్రభావాన్ని చూపిస్తాయి. ఒక్కొక్కటి, ఆలోచించిన కొద్దీ ఎన్నో వింత వింత అర్థాలకు ఆధారమౌతాయి. అలాంటిదే-

"కుపుత్రో జాయేత క్వచిదపి
కుమాతా న భవతి"

అన్నది. మాములు మాటల్లో చెప్పకోవాలంటే అబ్బాయెప్పుడైనా తప్పటడుగులు వెయ్యచ్చు కాని అమ్మ ఎప్పుడూ మంచిదే అని. కాని లోతుగా ఆలోచిస్తే మగసిరి మదంపై కదను తొక్కి మళ్ళీ మళ్ళీ ఆలోచింప జేసే మాట ఇది. మగువకు మాతృత్వం స్థిరపడినప్పటినుంచి పరిపూర్ణ మమతామయిగా మారుతుంది. అన్ని ఆలోచనలూ కలిగే సంతానాన్ని గూర్చి కలిగే కలల అలలే. కొన్నాళ్ళ కా కల కరిగి తా ననుకొన్నవాడు, తను కన్నవాడు తన కలలను కల్ల చేశారనే కఠోర నిజం బయటబడి, మనసు మూగబోయి మనిషి అస్థిపంజరం మాత్ర మౌతుంది. ఈ లోపలే సమాజంలో ఒక ముద్రా ఈసడింపు ప్రారంభ మౌతాయి. ఈ అవస్థా నిజతత్త్వాన్వేషణే పై సూక్తి కల్గించే ప్రేరణ.

తరతరాలుగా తీగెల పోగులాగా సాగివస్తున్న మానవచరిత్రలో వివిధ మనస్తత్త్వాల మహాపురుషులు ధ్భవించారు. రఘువు, భగీరథుడు, శ్రీరాముడు, కృష్ణుడు, భీష్ముడు లాంటి వాళ్ళూ, రావణుడు, కుంభక ర్ణుడు, దుర్యోధనుడు చివరకు కీచకుని లాంటి వాళ్ళూ ఈ సమాజంలోనే పుట్టారు. కొందరు తమ వారికి మంచిపేరు తెస్తే, మరికొందరు పరమ దుర్మార్గులుగా చిరస్థాయిగా నిల్చిపోయారు. అందుకు వారికి మూల రూప పౌరుష శక్తుల ఔన్నత్యమో, పతనమో కారణమే కాని వేరేకాదు. తండ్రుల తప్పుల-ఒప్పుల-కుప్పల నుంచి కొంత తనయులలో బీజరూపంలో ప్రాతినిధ్యం వహిస్తుంది. నిజానికి శాస్త్రాలేం చెప్తున్నాయి-

అంగా దంగా త్సంభవసి
హృదయాదధి జాయసే
ఆత్మా వై పుత్ర నామాసి

పురుషుడే ఆత్మకు పుత్ర రూపంలో ప్రతినిధి ఔతున్నాడన్న మాట. పురుష రూపంలోని వైయక్తిక వైఫల్యాలు, సామాజిక దౌర్బల్యాలు సాంక్రామిక దోషాలై శిశువుల తల రాతలుగా మారిపోతున్నాయి. కనుక ఈ తలరాతలలో పాలు మాతలకన్నా పితలదే ఎక్కువ. నియమ జీవనం, సంయమన శీలం కొరవడటం వల్ల ఈ దుఃస్థితి ప్రాప్తిస్తోంది. కౌసల్యా సుమిత్రల వంటి మాతృమూర్తులే కైక, గాంధారీ కూడా. సంతానంలో ప్రతిబింబించిన వైవిధ్యానికి కారణం పురుష పుంగవుల మానసిక దౌర్బల్యాలే. వాటి వాటి ప్రతిబింబక శక్తిని బట్టి సంతు సుగుణశీలురో, దుర్గుణ భూషణులో కావటం జరిగింది.

ఈ పురుషాహంకారానికి విసిగిన మాతృశక్తిలో నాడు ప్రారంభమైన సంచలనం ఈనాడు పలు సామాజిక ప్రతీకారాలకు కారణమౌతున్నది. తనకు జరగని న్యాయం ఇతరులకు ఎందుకు అన్న మానసిక కాఠిన్యం వరకట్నం, కోడరికం వంటి సామాజిక దౌష్ట్యాల రూపంలో పర్యవసిస్తున్నది. అంతెందుకు స్త్రీకి స్త్రీయే శత్రువు అనేదాకా వస్తున్నది.

మంచి మలుపు రావాలంటే మనలో మంచి వైపు మార్పు రావాలి. మనం శ్రావణం నుంచి ఆశ్వయుజం అంతం వరకు విద్యాసంపత్సంతాన ప్రదాయిని ఐన జగన్మాత గౌరవార్థం ఉత్సవాలు, పూజలు, పురస్కారాలు పునః పునః జరుపుకుంటున్నాం. మరచిపోతుంటాం కనుకనే మళ్ళీ మళ్ళీ జరుపుకోవటం.

మనిషి తన వికృత చేష్టలతో మాతృత్వాన్ని మలిన పరచకుండా సంయమనశీలం అవగింజంతైనా అలవరచుకుని జీవించగలిగితే అదే ఆ అనంత చైతన్య శక్తికి మనమిచ్చే నిజమైన ఆనంద నీరాజనం.

* * *

# 46. సహధర్మచరీ తవ

అసలు, సృష్టి అంతా ఆదిమస్త్రీపురుషుల వల్లనే జరిగిందని విదేశీ పురాణాలు చెప్తున్నాయి. మన శాస్త్రాలు, నిర్గుణ నిరాకారబ్రహ్మం నుండి సగుణ సాకార విరాట్పురుషుడేర్పడి, మహామాయ ఆధారంగా రసమయమైన రమ్యమైన పంచభూతాత్మక ప్రకృతిని రచించారని వివరిస్తు న్నాయి. త్రిగుణాత్మకము, పాంచభౌతికమైన సృష్టికి ఒక నియతి పరిమితి అవసరం కనుక బ్రహ్మవిష్ణు శివతత్త్వాలు సృష్టిస్థితిలయకార్యక్రమాలు నిర్వహిస్తున్నాయట. ఒకే తేజము మూడురూపాలతో పురుషకార్యాలను నిర్వహిస్తున్నట్లే తన్నిహితమైన పారమాత్మిక పరాశక్తిరూపం, ఆయా ఉపాధి రూపాల కనుగుణంగా మహావిష్ణువుకు లక్ష్మిగాను, బ్రహ్మకు వాగ్దేవిగాను, పరమశివునకు లయాత్మకమైన మహాశక్తి పార్వతిగానూ సహకరిస్తున్నది. మహామాయామోహకమైన ఈ శక్తే లేకపోతే ఇటు సృష్టికిగాని అటు నష్టికిగాని -- ఆ దేవుళ్లు సమర్థులు కారట! ఈ సూత్రాన్ని దేవతలందరూ అంగీకరించినట్లే అనిపిస్తుంది.

మన పురాణకథలను చూస్తే, పాశవికతత్త్వం నుండి నారాయణ రూపాన్ని చేరగోరే విజ్ఞానమయ జీవసృష్టిలో బ్రహ్మకు సరస్వతి వాక్స్థా నంలో ఉండి సహకరిస్తున్నది. అంటే విజ్ఞానానికి బాహిరరూపం వాక్కు. మన మాటనూ బ్రతుకుబాటనూ తీర్చేదికూడా మాటే. దీని కధిదేవతగా సరస్వతిని బ్రహ్మవాక్స్థానంలో ఉంచుకోవడం సముచితమే కాదు సరసం కూడా.

సమీచీనమైన సుఖమయజీవనానికి సంకేతం విష్ణుతత్త్వం. ఇహపర సుఖానికీ పరమపద ప్రాప్తికీ కూడా ఇదే సంకేతం. అష్టలక్ష్ముల ఏకాత్మక రూపంగా మహాలక్ష్మికి మహావిష్ణువు తన వక్షఃపీఠంమీద ఆవాసం కల్పించి గౌరవించాడు. సమాజరూప విరాట్స్వరూపంలో సంపదకు హృదయస్థానం ఉంది. దీన్ని ఇలా సూచించారు.

మన కర్థం అయ్యేందుకు ఏ మాటల్లో చెప్పకున్నా, మన శాస్త్రాలు మాత్రం అనంత, ప్రశాంత నిరంజనకాసారంలో సద్యోజాత సంకల్ప తరం గోద్భూతమైన లలిత విన్యాస లావణ్యాత్మక మాయావరణం ఆధారంగా అఖిలసృష్టి జరిగిందని, అది తిరిగి యథాస్థానం చేరటమే లయం, ప్రళయం అనీ, అది మరుసృష్టికి మార్గం ఔతుందని గంటగొట్టి మరీ చెప్తున్నాయి. ఈ లయాత్మక లావణ్యమయ పారమాత్మిక శక్తి పరమేశ్వరీ శక్తిగా పరమ శివునకు తోడ్పడుతూ జననమరణాత్మక జగన్నాటక మెంత అవిభాజ్యమో సూచిస్తుంటుంది.

విశ్వసృష్టిగతిని వివరించే ఈ అంశాన్నే, తరుణేందుశేఖరుడు తన దేహాన్ని ద్విధా విభజించి పార్వతికిచ్చాడనీ ఆ పార్వతీపరమేశ్వరులు సరస సామ్రాజ్యాధినేతలుగా సంధ్యానాట్యం చేస్తుంటారనీ కథల్లో సూచించారు. పరశివ దేహవిభాగం ప్రకృత్యావిర్భావమైతే, శివ భవానీనాట్యం జగన్నాటకంగా, ప్రదోష నాట్యానంతరస్థితి, ప్రకృతిరూపపరాశక్తి, పరమపురుష సంలీనంగా భావింపవచ్చు.

ఇలా ఇలా వినబడే విశ్వవాఙ్మయంలో పరమపురుషుని కెంత ప్రాధాన్యం ఉందో, ప్రకృతిరూప పరాశక్తికి కూడా అంతే ప్రాధాన్యం ఉంది. పరమ పురుషుని ప్రతిపదానికి ఆమె అనుచరీకాదు, అగ్రచరీకాదు, సహచరి. అడుగుతో అడుగేకాని అడుగులో అడుగు కాదు.

మరి అంతటి ఆదర్శమయ దేశంలో ఈనాడు నారీజాతికి లభిస్తున్న గౌరవం ఏమిటి? పురుషజాతి అంతా 'సహధర్మచరీ తవ' అంటూ 'నారాయణస్వరూప వరాయ' అని కాళ్లు కడిగించుకుని కన్యాదానం జరిపించుకున్న మహావిష్ణు ప్రతిరూపమే గదా! 'మమ జీవనహేతునా కంఠే బధ్నామి సుభగే త్వం జీవ శరదాం శతం' అని తాళిగట్టగా, 'నానందరి సామ్రాజ్ఞీభవ, మూర్ధానం పత్యు రారోహ' అన్న ఆశీస్సులందించిన ఆనందపు ఆశలతో అడుగుపెట్టే కలుముల తలిని, చదువుల మలిని

కాళ్ళ పారాణి ఆరకముందే, ఇచ్చింది వచ్చింది పుచ్చుకొని ఇహ ఇహంతో పనిలేదన్నట్లు మందో -- మాకో, నుయ్యో -- గొయ్యో, నీళ్ళో -- నిప్పులో అప్పచెప్పి పరలోకాలకు తరలిస్తున్నది ఈ 'సమాజం'. స్త్రీధనం సరససంస్కార జీవనానికిగాక గరళసంసార వ్యాపారాని కుపయోగిస్తున్నదంటే ఆటవికులకన్న అతిపాశవికంగా జాతి బ్రతుకుతున్న దన్నమాట.

మరి ఇది మనకొరకు దిగివచ్చిన మహావిష్ణువు వేంకటేశ్వరుడికి, అఖిలచరాచర మహావిభ్రామకశక్తి, బ్రహ్మవిష్ణు శివాత్మికా ఐన నారాయణిశక్తి జరుపుకుంటున్న నవరాత్రి బ్రహ్మోత్సవ పర్వసమయం.

మనిషిలోని ధనమదమహిషాన్ని నిర్జించి మనీషిగా నిలిచి, నారిని గృహనారాయణిగా మన్నించగలిగితే అదే ఆ పరదైవాలకు మనమిచ్చే ఆనందనీరాజనం!!

* * *

# 47. వరకట్నం

ఇది శ్రావణం. వచ్చేది భాద్రపదం. ఆపైన ఆశ్వయుజం. ఆ తర్వాత కార్తీకం. ఇలా వరలక్ష్మీవ్రతంతో ప్రారంభమై ధనలక్ష్మీవ్రతంతో పరి సమాప్తమయ్యే కాలంలో ఎక్కువభాగం స్త్రీరూప దేవతారాధనకే ఏర్పాటు చేశారు మన ద్రష్టలు. వరలక్ష్మి, సరస్వతి, దుర్గాదేవి, ధనలక్ష్మి ఇలా వివిధ రూపాలలో చరాచర ప్రకృతికి మాతృరూపిణిగా, శక్తిరూపిణిగా మహాశక్తిని ఆరాధిస్తున్నాం తరతరాలుగా! ఈ దృశ్యమాన జగత్తంతా స్త్రీరూపంగా, పరమేశ్వరుని పరమపురుషుడుగా భావించే మనకు మహామోహకమైన మాయావరణాన్వితమైన ప్రకృతిని స్త్రీ రూపంలో ఆరాధించటం చాలా సహజంగానే వుంది!

వాస్తవానికి మగువ మెచ్చిన ఇల్లు, దివిజులకు నట్టిల్లు, అనీ స్త్రీకి గౌరవమున్న ఇంట సిరులు చిందులు వేస్తాయని మన పూర్వులు ఏనాడో చెప్పారు. మన వివాహ ప్రక్రియలో కూడా వరుని నారాయణ స్వరూపునిగా భావించి బ్రహ్మలోక జిగీషతో కన్యాదానం చేస్తూ -- 'శ్వశ్రువాం భవ సామ్రాజ్ఞీ, శ్వశురే భవ సామ్రాజ్ఞీ, నానందరి భవ సామ్రాజ్ఞీ, మూర్ధానం పత్యురారోహ' అని అత్త మామల బావమరదుల మనస్సులో, మన్ననతో మహారాణికిగల గౌరవాన్ని పొందమని శుభాశంసనం చేస్తారు. భార్యాభర్తల సంబంధాన్ని వివరించి ధర్మే చ, అర్థే చ, కామే చ నాతిచరితవ్యా అని హెచ్చరించి, నాతిచరామి అని త్రికరణశుద్ధిగా వాగ్దానం చేయించుకొంటారు.

సాహిత్యపరంగా మనకు కనిపించే బ్రహ్మవాదినులైన మైత్రేయి, గార్గిల దగ్గరనుండి ఈనాటి కవయిత్రుల వరకు అన్ని వర్గాల మహిళాభివృద్ధి మన సంప్రదాయాని కనుగుణంగా సాగిందనీ మెలివేసుకు మరీ చాటుకుంటాం!

నిజానికిదంతా నిజమనిపించే కమ్మని కలలా వుంది. వెనుకటి తరాలతో ఈనాటి సమాజస్థితి పోల్చిచూస్తే మనం ఎంత 'ఎదిగామో' తెలుస్తుంది.

పెంచిన తండ్రి అనుమతిలేకుండా దుష్యంతుణ్ణి పెళ్ళాడిన శకుంతలను సమాజం వెలివేయలేదు. పుత్రవ్యామోహంతో రాముణ్ణి పద్నాలుగు సంవత్స రాలు అడవికి పంపటానికి కారకురాలైన కైకనుగాని, దాసి మంథరనుగాని ఆనాటి సమాజం హింసించలేదు. అహల్యను గౌతముడు నిరాదరించాడే గాని నిరాకరించ లేదు. పరస్త్రీ లోలుడైన రావణునిరాజ్యంలో ఉన్న సీతాసాధ్విని శ్రీరాముడు అగ్నిశుద్ధితో స్వీకరించాడు. జాబాలి సత్యకాముడు ఎలా అయింది అందరికీ తెలుసు. ఒక్క తాటకవధ తప్ప రామాయణంలో కూడా స్త్రీహింస జరిగిందనేందుకు అవకాశం లేదు.

ఇక భారతకాలంలోని సత్యవతి, కుంతి, గాంధారి, ద్రౌపది లాంటి పాత్రలను తీసుకున్నా వారి వారి ప్రత్యేకస్థానాల్ని సమాజం గుర్తించి గౌర వించిందనే చెప్పాలి! అత్యాచారులు, ఆతతాయిలు అని పేరు తెచ్చుకొన్న

ధార్తరాష్ట్రులను ప్రజలు నిరసన బుద్ధితో చూచినా వారి కులకాంతలను నిరసించిన ఘట్టాలు మనకు కనపడవు. నిజానికి రాజకీయ కార్పణ్యంతో ఒక్క ద్రౌపది మీద జరిపిన అవమానం తప్ప కౌరవులు మరి ఏ ఇతర స్త్రీ మీద దౌర్జన్యం జరిపిన దాఖలాలు మచ్చుకైనా కన్పించవు. రామాయణ భారత కాలాలలో స్త్రీలపై జరిగే అత్యాచార ప్రయత్నాన్ని ఆనాటి సభ్యసమాజమంతా నిరసించింది. సమయం వచ్చినపుడు ఏకలక్ష్యంతో ఎదుర్కొని దురాచారులకు గుణపాఠం నేర్పింది. అపఖ్యాతిపాలైన స్త్రీలను సైతం అన్నపానాదులకు లోపం లేకుండా భరించాలని మనుధర్మశాస్త్రమూ శాసించింది.

కాని ఈనాటి మనస్థితి ఏమిటి? పచ్చనిదంతా మెచ్చతగిందనే భ్రమతో పాచిబండలమీద పరుగెడుతున్నాం! పురుషునికి ఇహపరతారకంగా 'షట్కర్మయుక్తా కులధర్మపత్నీ' అనిపించుకున్న అతివను, 'ఈ నా జీవన సూత్రం నీ గళ మంగళసూత్రం; వర్ధిల్లాలిక వర్షశతం' అని దీవనతో తెచ్చుకున్న దేవతామూర్తిని లోభంతో లోలువత్వంతో క్షోభపెట్టున్నాం. కట్నాలు కాముకతలదిపైచేయిగా అత్యాచారాలతో ఇంటాబైటా కూడా మానవతులను అవమానం పాలు చేస్తున్నాం, బ్రతుకు బుగ్గిచేస్తున్నాం. ఆనాటి అత్యాచారులు ఈ లోకాన్ని తొంగిచూడటం జరిగితే తమకింత నికృష్టత లేదనే తృప్తి నిజంగా కలిగితీరుతుంది.

అయితే ఇవన్నీ జరుపుతున్న దెవరు? ఒక తల్లికొడుకు, ఒక అక్కకు తమ్ముడు, ఒక చెల్లికి అన్న. తమ ఇంటి బలిపశువు ఇలాంటి అనుబంధాల్లోని దేనన్న కారుణ్యకిరణం ఏ మాత్రం తళుక్కుమన్నా చాలు, వీటికదే సమాధి! మార్పులేని బంధంగల ఈ మాతృమూర్తులు కట్నాలపేరిట జరిగే కల్లోలాలకు తోటి స్త్రీకి జరిగే అన్యాయాలకు పాక్షిక భాగస్వామిను లౌతున్నారు. తమకు గలిగిన చేదు అనుభవాలతో ఇతరులకు నవవసంతాలు కూర్చవలసిందిపోయి అగ్నిలో ఆజ్యం పోస్తున్నారు. నిజానికి కన్యాశుల్కాలు కాలదోషం పట్టి కనుమరుగయ్యాయి. వరుని నారాయణస్వరూపంగా

భావించి లౌకిక సాహాయ్యంగా సాలంకృత కన్యాదానంతోపాటు వరదక్షిణగా యథాశక్తి ఆనందంతో ఇచ్చే వరకట్నం ఈనాడు ఒక వ్యాపారంగా, నవ వధువుకు నరకంగా, పారాణి ఆరకముందే పరలోకమార్గంగా మారుతున్నది. దీనికి పురుషాహంకారంతోపాటు నారీసంకుచితత్వం కొంత కారణమంటే అసహజమనిపించినా అసత్యం మాత్రం కాదు. కేవలం చట్టాలవల్ల కట్నాలు పోవు. 'కట్నమెందుకు వద్దో'! అని కలతచెందే పెద్దలూ లేకపోలేదు! కనుక సరస సంసార వృక్షానికి ముప్పు తప్పించగల శక్తి ఆ శ్రీచక్ర సంచారిణికి ప్రాకృతిక ప్రతిరూపమైన ఈ నారీచక్రానికి వుంది.

మరి ఇది ప్రేమైకమూర్తి కృష్ణభగవానుని జన్మాష్టమి, మాంగల్య వృద్ధికిగాను సర్వమంగళను, సకల సంతృప్తిదాయిని ఐన వరలక్ష్మిని కొలిచే శుభదిన సందోహంగల పవిత్రమైన మాసం. భౌతికస్వాతంత్ర్యం లభించినా, భావస్వాతంత్ర్యానికి కంకణం కట్టుకోవలసిన దీక్షాసమయం. మహిళలకు మంచి జరగాలంటే ఇంతకన్న మంచిరోజు లేదు. కలహకంఠులు కాని కలకంఠులందరూ మత్తగజాల అదుపుకు ముందడుగువేయాలి. పెద్దలు చెప్పనే చెప్పారు.

కలకంఠికంట కన్నీరొలికిన సిరియింట నుండవొల్లదు సుమతీ!

అని. మరి మనది ఏ మతో కాలమే నిర్ణయిస్తుంది.

* * *

# 48. మనం పోగొట్టుకున్నది

తిను--అను--కను అనుకోవటానికి చాలా మొరటుగా అనిపించినా ప్రపంచధర్మం ముఖ్యంగా మానవ జీవితం ఈ మూడింటి మీద ఆధార పడిందనే చెప్పాలి. ప్రాణికోటి జీవనానికి ఆహారం చాలా అవసరం. అది లేకపోతే శరీరం నిలవటం కష్టము. శరీరం లేకపోతే జీవులకు ధర్మసాధనమే

లేదు. కనుకనే 'శరీరమాద్యం ఖలు ధర్మ సాధనం' అన్నారు. గొప్పవారంతా కూడా ఉత్క్రమణానికి బాధపడడానికి బదులు ధర్మసాధనమైన శరీరం లేకుండా పోతుందే అని తపించారట! ఈ తమవుకు మూలకారణం అన్నం అన్నారు. 'అన్నాద్భవంతి భూతాని' అని ప్రారంభించి చివరకు అన్నాన్ని బ్రహ్మస్వరూపంగా గౌరవించారు.

దేహికి అన్నం కావాలి. అన్నమే కాదు ఇంకా ఏవేవో కావాలి. కాని వాటిని సాధించుకొనేందుకు ఆ కోర్కెలను బయటికి అనాలి. అదే భావప్రకటన. దీంట్లో ఒక సొంపు ఉండబట్టే మిగిలిన జీవజాలాలవి అరుపులు క్రోతలుగా మిగిలిపోతే మనిషి కూత మాత్రం ముద్దుమాటై సాహిత్యమై చివరకు బ్రహ్మానందానుసంధాయక పరమపద సోపానమైంది.

ఐదే మానవుడి ప్రగతి తినటం కావాల్సినవి అనటంతో ఆగిపోలేదు మరి! అంటూ తింటూ గడిపే కాలచక్రంలో మానవుడికి కొత్తకొత్త రుచులు, అభిరుచులు, భావాలు, అనుభూతులు ఏర్పడుతున్నాయి. తన చుట్టూ తిరిగే వాటిని, తనలోని వాటికి, తన పైన వాటికి గల సంబంధాలై ఆలోచన పెరిగి తన 'ఆర్జన' సారాన్ని ముందు తరానికి పంచి పెట్టటానికి ప్రయత్నిస్తున్నాడు. ఐహికంగా ఆస్తులు (అప్పుడప్పుడు అప్పులు) పారలౌకికంగా వేదాంత విజ్ఞానాన్ని ముందు తరాల కందించాలనే తపన ఎక్కువైంది. తన అనుభవంలోకి రానిదాన్ని కొత్తగా తెలుసుకున్నదానిని పామరుడు కన్నా నంటున్నాడు. పండితుడు దర్శించా నంటున్నాడు. ఇలా అనుభూతి అనుశీలన పూర్వకమైన తపన లౌకికంగా పదార్థ విజ్ఞానావిష్కారంతోనూ ఆధ్యాత్మికంగా పారమార్మిక దర్శనాది శాస్త్ర గ్రంథావతరణకు బంగారు బాటవేసింది.

ఇహానికి పరానికి అవసరమైన ఈ మూలధర్మత్రయాన్ని, తమ తమ జీవన వికాసానికి వీటి విషయంలో గల హక్కులను మన పూర్వులు ఏనాడో గుర్తించారు. కనుకనే ఎవరి హక్కులకు భంగం కలుగని రీతిగా సహజీవన

సహభావన సహదర్శన సిద్ధాంతాలను బోధించారు. వికర్షణద్వారా సంఘర్షణకు అవకాశ మున్నచోట్ల ఆత్మావలోకనం, సంయమనం బోధించారు. యస్తు విజ్ఞానవాన్ భవతి యుక్తేన మనసా సదా తస్య వశ్యాణీంద్రియాణి సదశ్వా ఇవ సారథేః అనీ, శుని చైవ శ్వపాకే చ పండితా సమదర్శినః వంటి వాటి సారాంశం ఆత్మవస్తు తత్త్వదర్శనమే.

కనుకనే ఈ దేశం బహుభాషల, రూపాల, ఆధ్యాత్మికతల సంగమమైంది. మనవికాని మతాలెన్నో మన మధు మనస్ఫ్రివంతులలో అంతర్వాహినులు కాగా మరికొన్ని మచ్చికతో తమ మనుగడ సాగిస్తున్నాయి.

తరతరాలుగా విశ్వవ్యాప్తంగా వున్న ఘర్షణలకు కారణం పై మూడు విషయాలలోను వానికి గల హక్కునీ తోటివాడు గుర్తించక పోవడం. రాముడికి గల హక్కును రావణుడు గుర్తించకపోవటం. ఐదుగురికి ఐదూళ్ళ నిరాకరణ ధర్మక్షేత్రం కురుక్షేత్రం కావటానికి కారణంకావటంలో అంతర్యం ఇదే. అశోక కళింగ యుద్ధాలు, ప్రపంచంలో జరిగిన అనేక యుద్ధాలు కూడా ఈ ప్రాథమిక సూత్రత్రయానికి తిలోదకాలీయటం వల్ల జరిగినవే.

జాతి ఎన్ని ఆపద లొస్తున్నా తట్టుకు నిలబడడానికి కారణం మనకు సహజీవన, సహభావన, సహదర్శన సిద్ధాంతాలపైన గల నమ్మకమే. అందు వల్లనే మన ఆత్మశక్తివల్ల ఎన్నో త్యాగాలు చేసి, లౌకిక స్వాతంత్ర్యాన్ని రాజకీయ స్వాతంత్ర్యాన్ని తిరిగి పొందగలిగాం. చిన్నగా ముందడుగు వేస్తున్నాం. బాగానే వుంది.

కాని మన ముందడుగులో పరుగులో మనకు తెలియకుండా పోగొట్టుకొన్నది ఒకటుంది. మన దేశం మనపాలనలోనే, మనదైన తత్త్వాన్ని జాతివిధానాన్ని ప్రచారంచేసుకోలేనంతగా గిరి గీచుకొని క్రమంగా స్ఫ్రుహనే కోల్పోతున్నది. అహరహం ఐహిక సుఖాలను అనుభవించే పశ్చిమ బుద్ధులు భారతీయ విజ్ఞాన భాస్కరారాధనలో మునిగి తేల్తుంటే మనకిది పెరటిమందే చైతన్యం కావాలని సూర్యాస్తమయం చూస్తున్నాం. భారతీయ

డనిపించుకోవటానికి భయం. హిందువునని చెప్పుకోవటం హీనం అనే స్థితికి వచ్చాం. ఇచ్చకాలకు మెఱమెచ్చులకు మోసపోయి సంప్రదాయాలను సమీక్షించకుండానే సమాధి కడ్తున్నాం. మనతాడు పాము సిద్ధాంతం మంచిని చెడుని భ్రమింపజేస్తున్నది. ఫలితం మనం మనం కాకుండా పోతున్నాం. మన మనస్సే మనది కాకుండా పోతున్నది.

ఈ అలసత్వం నుండి అశక్తతనుండి బయటపడి మన మెవరో చెప్పుకోగల్గిననాడు నిజంగా సర్వదా స్వాతంత్ర్యం సిద్ధించినట్లు, జాతి తన పురోగమనంలో మరొక మెట్టెక్కినట్లు. సర్వమత సమాదరణమంటే స్వమత నిరాకరణమని మాత్రం అర్థం కారాదు. అంతే. భర్తృహరి చెప్పనే చెప్పాడు,

"సుప్తం ప్రమత్తం విషమస్థితం వా రక్షన్తి పుణ్యాని పురా కృతాని"

అని. కాలక్రమాన తాతల నేతులు చెప్పుకొంటున్న మనకు మొదటి మూడూ సిద్ధించినై. ఇక నాల్గోదే శరణ్యం.

* * *

# 49. మదిర -- మత్తు

ప్రపంచంలో ప్రతివస్తువుకూ ఉపయోగఫలాన్నిబట్టి మంచి, చెడు అని రెండూ వుంటాయి. ఆ యా ప్రభావాలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, ఆధ్యాత్మికవిద్యద్వారానో దర్శించిన మహర్షులు, స్మృతికర్తలు, ఆ యా వస్తువుల గుణావగుణ బాహుళ్యతమబట్టి ఉపయోగాన్నో, విసర్జననో నిర్దేశించారు. కాని మానవుని మనస్సు మర్కటం లాంటిది. ఏదైనా అనుభవ పూర్వకమైతేగాని వాటి ఆవాహన -- విసర్జన చేయదు. పైగా తాత్కాలిక తృప్తితో, సత్యాన్ని మరచి, పెద్దల సుద్దులన్నీ నిరర్థకాలనీ వర్తమానానికి వ్యతిరేకమనీ అవహేళనచేయుటం కూడాకద్దు. సరిగా మద్యపాన విష

యంలోకూడా ఇలాగే జరుగుతున్నది. తాత్కాలికోత్తేజం, బాధోపశమనం కల్గిస్తుందన్న స్వల్పసత్యాన్ని మాత్రమే గమనించి, మత్తును, మరణాన్ని ప్రసాదిస్తుందన్న ప్రస్ఫుట సత్యాన్ని విస్మరించి తరతరాలుగా మానవుడు మద్యానికి బానిసకావటం జరుగుతున్నది. చరిత్రకందని కాలంనుండి, 'కల్లు మానండోయ్, బాబూ, కళ్ళుతెరవండోయ్' అని జాతిపిత బాపూజీ చెప్పిన మనవాటి వరకు మద్యపానానికి వ్యతిరేకంగా ప్రచారం జరుగుతూనే వున్నది.

సంజీవనీవిద్య దేవతలకు లభించకుండా చేసేందుకు రాక్షసులు కచుని భస్మాన్ని, మద్యంతో అసురగురువు శుక్రాచార్యునకు ఎలా ఇచ్చింది, శుక్రుని దయతో కచుడాయన ఉదరాన్ని చీల్చుకొని బయటకు తిరిగి వచ్చిందీ, మద్యపిపాసులకు శుక్రుడు శాపమిచ్చిన ఉదంతం భారతంలో కచదేవయానికథలో స్పష్టంగా వివరింపబడింది. రామాయణంలో, రావణుని కన్న రాజనీతిదురంధరుడు కుంభకర్ణుడు మైరేయ ప్రభావానికిలోనై తన పరిజ్ఞానాన్ని మరుగుపరచుకున్న విషయాన్నికూడా గ్రహించగలం. చివరకు శ్రీకృష్ణభగవానుడు జన్మించిన యాదవకుల వినాశానికి, మద్యమిచ్చిన మత్తు ఎలా కారణమైందో కూడా భారతభాగవతాలలో స్పష్టంగా వుంది. ఇతిహాసాలలో కూడా ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు. ఈ జాడ్యప్రమాదాన్ని గుర్తించి దాన్కి వ్యతిరేకంగా ప్రచారం చేసినవారు మనువునుండి మహాత్మునిదాకా ఎందరో!

ఐతే మనిషిది, మందేకొరివి. మనదాకా రానీ చూద్దాం అనే మనస్తత్వం. కలవారు విలాసాల్లో తేలేందుకు, శ్రామికులు విశ్రాంతి ప్రసాది అని, కడకు పస్తులుండో, పుస్తెలనమ్మో, ఈ మత్తులో మునిగితేలుతున్నారు. మగువను మానవతిగా, ఆదిశక్తికి అపరావతారంగా చూచే ఈ దేశపు నిఘంటుకారులుకూడా 'మదిరాక్షి' అన్న పదాన్ని కల్పించారన్నా, భారతంలోని సుదేష్ణోపాఖ్యానంలో సుదేష్ణ సైరంధ్రిని వాచవులమద్యాన్ని తెచ్చేందుకు సింహబలుని (అదే కీచకుడు) ఇంటికి పంపిందన్నా స్త్రీలలో

కూడా ఈ మదిరావ్యామోహం ఎంత పెరిగిఉంటుందో అని ఆశ్చర్యం కలగకమానదు.

మరి జాతిఅంతా నైతికవిలువలను నిర్వీర్యంచేసే ఈ మదిరామదంలో మునిగితేలవలసివస్తే ఈ తరతరాల సంస్కృతి సంప్రదాయాలగతి ఏమిటి! మనమనుగడకు జీవగర్రలైన ఆధ్యాత్మిక ప్రదేశపరిసరాలలోకూడా, ఈ పిపాస తిష్ఠవేసుకుంటున్నదని, భక్తితోవచ్చిన వారిలో శక్తిచాలని కొందరీ మత్తుకు బానిసలౌతున్నారని వినటం నిజంగా బాధగానే ఉంటుంది. మరి ఈ అస్తవ్యస్త స్థితినుండి, జాతి సంక్షేమాన్ని సంరక్షించుకోవాలంటే చట్టం, చిత్తశుద్ధి, చాలా అవసరం. అందువల్ల రాష్ట్రప్రభుత్వాలు వీలైతే తమ రాష్ట్రాన్నంతటిని లేదా కనీసం పుణ్యక్షేత్రాలనన్నా మద్యనిషేధ శాసనపుపరిధులలోకి తీసుకురావటం తప్పనిసరి. చేసిన శాసనం చిత్తశుద్ధితో అమలుజరిగేదాకా, దేవస్థానాలు మద్యమాంసాదిసేవనం నిషిద్ధమనే ప్రకటనలు ఎన్నిచేసినా, ఆలయ పావిత్ర్యరక్షణకు ఎంతప్రయత్నించినా, చెవిటివారిముందు శంఖమూదినట్లే.

రాతిలోను, రప్పలోను, కప్పలోను దేవుడున్నాడనే దివ్యభావన జీర్ణించుకున్న మనం, నరునిలోని నారాయణుని దర్శించాలంటే ముందీమత్తులు దిగాలి. అప్పుడే ఆత్మవికాసం, పరమాత్మ సాక్షాత్కారం.

అందువల్లనే ఆ గాథలబాధలు పరిశీలించిన విదులు నరులందరినీ పతనహేతువులైన ఈ 'వర' మదిరామత్తులు కాకుండా పదిమందికి పనికివచ్చే విధంగా జనరూపజనార్దన సేవలో తనువులు చెల్లించుకొండనీ అంతగా అనుభవం కావల్సిన వాళ్లకు అడవుల్లోకి పోయి సాధించుకొండనీ సూచించారు.

* * *

# 50. సమత

'మనిషి బుద్ధి మహామర్కటం
మత్తెక్కితే మరీ సంకటం'

ఈ భావాన్ని మనకందించిన పూర్వీకులను ఏ మాటలలో అన్నా చాలా గొప్పగా చెప్పారనే ఒప్పుకోవాలి. నరుడు వానరాంశజుడు అనే మాట ఎలావున్నా వానరత్వంలో ఒక వైశిష్ట్యం వుంది. దానిలో అనుకరణశీలం ఎంత ప్రస్ఫుటంగా వుందో భావతీవ్రత, నిరంతర సంచలనతత్త్వం అంత విస్తృతంగా వున్నె. 'ఒకటి భావవికాసానికి చిహ్నమైతే రెండోది పరిశోధక తత్త్వానికి నాంది. మూడవది పరార్థం హరించుకోవాలనే దుర్గుణం, ఇందులో అంతా ఒకటే.

ఇవన్నీ ఎలావున్నా మత్తెక్కిన కోతి చేయలేని ఆగడమంటూ లేదు. ఎంతటి విశిష్టవస్తువైనా ధ్వంసం కావలసిందే! ఆంజనేయస్వామి ఒక విశిష్ట కార్యం కోసం లంకాదహనం చేస్తే మిగిలిన కోతిమూక తమ రాజైన సుగ్రీవుని మధువనాన్ని నిష్కారణంగా ధ్వంసంచేసి, వద్దన్న దధిముఖుడికి 'ఘన' సన్మానం చేసిన విషయం ఆదికావ్యంలో అభివర్ణితం.

మనం అపర ఆంజనేయులం కాలేకపోయినా మనలో మాత్రం మార్కట్యమే నాట్యం చేస్తుంది. మనం రోజురోజుకీ సూత్రాలనూ శాస్త్రాలనూ వల్లెవేయటంలోనే మోజు పెంచుకుంటున్నాం తప్ప లభించిన విజ్ఞానాన్ని సమాజవికాసానికి ఉపయోగించే శక్తివున్నా బుద్ధిని మాత్రం కోల్పో తున్నాం. నిజానికి మనం వల్లించేదానికీ, ఆచరణకూ ఎక్కడా పొంతన కన్పించటం లేదు. కోతికి కల్లుమాదిరిగానే మానవుడు అధికార, కీర్తి, కాంతా, కనక వ్యామోహమత్తుడై తన మాట చెల్లుబడికోసం వర్గ వర్ణ ధర్మ వ్యత్యాసాలు ఆధారంగా దుర్బలులపై విరుచుకుపడుతున్నాడు. దీని ఫలం వ్యవస్థావిచ్ఛేదకమైన ప్రతిఘటన. వ్యక్తుల దోషాలకు వ్యవస్థలు బలౌతున్నాయన్నమాట!

శ్రీరాముడు శబరి ఎంగిలిఫలాలను తిన్నాడని రామాయణంలో వుంది. క్షత్రియుడైన శ్రీకృష్ణుడు పెరిగింది గోకులంలో! 'చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః' అన్న ఆ పరమాత్మ, ఆ గీతలోనే ఆత్మవత్సర్వ భూతాని అనీ, శుని చైవ శ్వపాకే చ పణ్డితాస్సమదర్శినః అనీ జ్ఞాని ఐనవాడు జీవజాలాన్ని దృష్టిభేదం లేకుండా ఆత్మతత్త్వాన్ని గుర్తించి ప్రవర్తించాలని సెలవిచ్చారు. భారతంలోని ధర్మవ్యాధోపాఖ్యానం, హరిశ్చంద్రుడు వీరబాహువద్ద సేవచేయటంలాంటి ఇతర కథలు కులంకన్న గుణంమిన్న అనే ధర్మాన్ని బోధించేవే! ఇక పురాణ సాహిత్యంలో కూడా ఇంతే! అద్వైతాచార్యులు శంకరాచార్యులకు సమవర్తి 'చండాల' రూపంలో సమత్వం బోధించటంలో అంతరార్థం, విశిష్టాద్వైత సిద్ధాంతంలోని మునివాహన భోగం, బ్రహ్మరాక్షసత్వాన్ని పోగొట్టిన మాలదాసరి కథ, కన్నప్పకథ, నందనార్‌కథ ఈ ధర్మాన్ని భంగ్యంతరంగా నిరూపించేవే! ఇక రాజకీయంగా మావినా భారతకాలంలో వైవాహిక విషయాలలో వర్ణ ప్రాధాన్యం లేదనేందుకు ఆధారాలున్నాయి. మన చరిత్రలో కులాలు కులాలుగా పోట్లాడుకున్న సందర్భాలెన్ని? నిజానికి మన గ్రామవ్యవస్థలో అందరు అన్న, అక్క, మామ, బాబాయి అనే అనుబంధాలతో బ్రతికినవాళ్ళే. కాని సహజీవన, సమజీవన, సదవగాహన సిద్ధాంతాలలో ఏర్పడిన మన సమాజ వ్యవస్థకు నేడు మనం విచిత్రమైన రంగులు పులుముతున్నాం.

కలకన్నా నిజం కఠోరమైంది. కోతికైనా కొంత నిలకడ వుందేమోగానీ మనిషి బుద్ధికి మాత్రం లేదు. మానవ విజ్ఞానం సూర్యమండలం దాటుతున్నా మనసు మాత్రం ఏ మాత్రం ఎదగటం లేదు. వ్యక్తిగతమైన అవసరాలు తీర్చుకునేందుకు, సాధించలేని కసితో, తాము జరిపే అత్యాచారాలకు రక్షణగా పదిమందిని రెచ్చగొట్టేందుకు వాడుకొంటున్న ఆయుధాలేతప్ప నిజానికి మన వ్యవస్థలలో దోషం ఎక్కడా కన్పించదు. వ్యక్తుల దోషాలకు వాళ్ళను శిక్షించటం మాని వ్యవస్థాభక్షణకు పూనుకొంటే అది 'కంచె చేను మేత'కన్నా వేరే కాదు. శిక్షణ, సంస్కారం, శిక్ష కావలిసింది వ్యక్తికి. అప్పుడు

వ్యవస్థలుకూడా మారటం సహజం. పరస్పర నిందారోపణలవల్ల సామూహిక దండప్రయోగంవల్ల సాధించగలిగేది ఏమీ లేదు. పొరుగింటి నిప్పుతో మన చుట్ట కాల్చుకోవాలనుకున్నంత కాలం ఇంటికొక వివేకానందుడు పుట్టినా ఇంతే! అద్వైతం బోధించిన శంకరులు, దాన్ని విశిష్టం చేసిన రామానుజులు ఒకే మాసంలో జన్మించిన ఈ పుణ్యభూమిలో మనం నేర్చుకోవలసింది సమతాధర్మాన్ని గురించే! ఇంతేగాక ఆ ఇద్దరి జన్మ. తిథులు ఒకే రోజున -- 251 సంవత్సరాల కొకమారు జరుగుతుందట. భంగ్యంతరంగా ఈ ఇరువురూ ఒకే సందేశాన్ని అందిస్తున్న సంకేతమైన ఈ మహత్తర దినాన మనం మననం చేసుకొని నేర్చుకోవలసింది ఎంతైనా వుంది. కానీ మనం ఎంత మారగలిగాం? ఏదో పాతపాట జ్ఞాపకం వస్తున్నది.

'మనుషుల బుద్ధులు కోతులకుంటే -- కోతుల బుద్ధులు కొందరివి'

మొదటిది ఆంజనేయుల వారిది. రెండవది మనది. అంతే !!

* * *

# 51. వృక్షో రక్షతి---

ఏదైనా పోలిక చెప్పాల్సివచ్చినపుడు మనిషికన్న భిన్నమైనవాటితోటే పోల్చటం మన కలవాటు. మనలోలేని వైశిష్ట్యమో వైలక్షణ్యమో వాటిలో ఉండి అప్పుడప్పుడు ఆ ధర్మసామ్యం మనలో కూడా కన్పించటమే అందుకు కారణం. పరహితం కోసం పాటుపడటం అన్న విషయంలో వనసంపదనం తటిని ఉదాహరణగా తీసుకుచెప్పారు మన పూర్వులు. వాటి ఆరాధనకా అన్నట్లు మన ఆరాధనాలయాలన్నిటినీ కొండలనదుమో, కోనలదరినో, సాగరతీరాలనో పెట్టి కొలిచి తరించమన్నారు. అందుకే పరమాత్ముని సర్వాంతర్యామిత్వాన్ని నమ్మే మనకు గిరితరుఝరులు సూర్యచంద్రులంతటి ప్రత్యక్ష దైవాలు. శ్రీకృష్ణపరమాత్మే స్వయంగా ఈ పూజలు సాగించినట్లు

భాగవతంలో ఉంది. అంతేకాదు, అర్చావతారంగా మహావిష్ణువు వైకుంఠ విరక్తితో దివినుండి భువికి దిగి స్వామిపుష్కరిణీతీరాన సప్తశైలాగ్రవాసిగా వెలువొందారు.

ఆ స్వామి అవతరించిన కొండ ఎంత పవిత్రమైందో! తిరుమలలో ఒక శిలగానో, సంతతామృత ఝరిగానో, కడకు భక్తజనపదధూళిగానో జన్మించినా బాగుండేదని కులశేఖరులు కలవరించారు. ఆపాదమస్తకము ఆ వేంకటేశ్వర భక్తిని ఆవహింపజేసుకున్న అన్నమయ్యదృష్టిలో అది 'కట్టెదుట వైకుంఠమే కాణాచైన కొండ', ఉర్వీతపసులే తరువులైన కొండ, కదలిక కన్పించక కదిలే చైతన్యాన్ని ఆత్మారోపం చేసుకున్న ఈ స్థావర జీవజలాన్ని గౌరవిస్తూ (అంతరార్థం వేరేవున్నా) నమక చమక మంత్రాల్లో ఉంది. ఈ జీవసముదాయంలో తన రూపం ఎక్కడనేది పరమాత్మ 'అశ్వత్థః సర్వవృక్షాణాం, సరసా మస్మి సాగరః' అని నిరూపించారు.

కాని ఏం లాభం! వీటిలో ప్రాణమున్నదని పరమాత్మ ఎంత చెప్పినా, మనిషి పరిమిత బుద్ధికి తగ్గట్లు మళ్లీ శాస్త్రజ్ఞులు చెప్పినా, ఆ శంఖారావం మనకు విన్పించక ఎక్కిన కొమ్మను నరుక్కుంటున్నాం. భూమిని తరుక్కుంటున్నాం.

దీనివల్ల మన కేం జరుగుతోంది? మనిషి పాపవాయువులు పీల్చి వృక్షాలు ప్రాణవాయు వందిస్తున్నాయి. రాళ్లు విసరే చేతికి రమ్య ఫలాలిస్తున్నాయి. కొమ్మ నరికే చేతికి కోరినంత నీడ నిస్తున్నాయి. కడసారిగా మనిషి కడయాత్రలో కూడా కైదండాలుగా బ్రతుకు కడతేర్చుకుంటున్నాయి. ఉయ్యాల నుండి ఊరవతలవరకు సాగే అన్ని పనులలోను అన్నకన్న మిన్నగా అండగా ఉన్నాయి.

అయితే మనిషంతటి కృతఘ్నుడు మనిషే 'ఉపకారికి నపకారము నెపమెన్నుచు చేయువాడు నేర్పరి' అన్న తత్త్వం అతనిది. రెమ్మదాకా నరికి పొమ్మో సోకు చేసుకుంటున్నాడు. ఉపాధికి కొంతా ఉల్లాసానికి కొంతా.

ఫలితంగా పైరుపచ్చలు, పండ్లు, ఇళ్లు పడి పాడయి, నేలకు వేడి, సూర్యుడికి వాడి కలగటంతో పాటు మనిషిపాపం, మహావాయువుగా మారి మనుగడకే ప్రమాదం తెస్తున్నది.

ఈ తీరు కొన్నేళ్లు సాగితే మన రతనాలసీమలు రమణీయ భూములు, సకల జీవఝురులు తమ రూపు మారి మరుభూములయే మారకయోగం పడుతుంది.

అందుకే దేవస్థానం యథాశక్తిగా తిరుమలలో వనప్రాణావన కార్య క్రమాన్ని చేపట్టి, ఈ ప్రాంతాన్ని దివ్యారామ భూమిగా తీర్చేందుకు ప్రయత్నిస్తున్నది. వనరక్షణ తత్పరుడు శ్రీ సుందరలాల్ బహుగుణ సౌజన్యసంపత్తితో ఎన్నో చేయాలని ఆరాటపడ్తోంది.

నిజానికి తిరుమల తిరుపతులే కాదు -- విశ్వమంతటా వనరక్షణ సంస్థలు తమ తమ ప్రాంతాల అటవీ రక్షణకు పూనుకోవాలి. హరిత వనాలే కాదు. మరుభూములుకూడ సురవనధామాలు కావాలి. అదే జనసేవా, సర్వజీవ జనార్దనసేవా.

ఇది మనం, మనని మరచి, మనకెందుకులే అనుకుంటే, మళ్ళీ ఆశలేకుండా మన రోగాలన్నీ ఒక రోజున టక్కున కుదురుతాయి.

మనిషి కన్న ముందున్నది వన సంపద
అది హరించ కలుగుతుంది ఆపద.

* * *

# 52. బొమ్మా - బొరుసు

బొమ్మా - బొరుసు ఈ ఆట పిల్లలాడుతుండటం చూస్తుంటాం మనం. సందిగ్ధ విషయాల్లో ప్రాధాన్యం నిర్ణయించేందుకు ఈ పద్ధతి ఉపయోగిస్తుంటారు అప్పుడప్పుడు. ఒకే నాణానికున్న ఈ రెండు ముఖాల్లో నిజానికి ఏది లేకపోయినా నాణెం చెల్లుబడి సందిగ్ధమే అయినా, ఒక నిర్ణయానికి రావాల్సి వచ్చినప్పుడు రెండవవైపు ప్రాధాన్యత కోల్పోతుంది.

నిజానికి మనిషి జీవితం కూడ బొమ్మా-బొరుసు లాంటిదే. ద్వంద్వాలన్నీ కలివిడిగా అమరి వుంటాయేగాని విడివిడిగా వుండవు. విధాన నిర్ణయాన్నిబట్టి లక్ష్యాన్నిబట్టి సుగుణరాశో దుర్గుణపుంజమో ప్రతిభాసమాన మౌతూ ఉంటాయేతప్ప ఈ జీవనాణెంలోని ఇతర విషయాలు లెక్కకేరావు.

ఇది నిజమా అనిపిస్తుంది రామాయణంలోని కొన్ని, ముఖ్యంగా స్త్రీ పాత్రలను చూస్తే. విధాత విధాన నిర్ణయం రామవనవాసం రావణవధ లక్ష్యంగా కలది కనుక పాత్రలన్నీ ఆ లక్ష్యసిద్ధికి తోడ్పడే గుణాలు కలవిగానే నిర్దిష్టాలయ్యాయి. ప్రతి పాత్రద్వారాను సమాజం నేర్చుకోవాల్సింది ఎంతో ఉన్నదనిపిస్తుంది.

రాజమాత, దశరథుని పట్టమహిషి కౌసల్యాదేవి పతిభక్తి, రాజరికపు నిగ్రహం, పుత్రవాత్సల్యం, సాధుశీలతా వున్నా తన మనోభావాలను వ్యక్తీకరించటంలో పారుష్యం లేదనుకోవటం కష్టం. అపోహల ఛాయలు అక్కడక్కడ కన్పిస్తూనే వుంటవి.

ఇక లక్ష్మణమాత సుమిత్రనుగూర్చి రామాయణంలో వివరంగా చెప్పకపోయినా ఆమె స్థితప్రజ్ఞురాలు, సహనశీలి. విధివిధానాన్ని విమర్శించటంకన్నా విధితో రాజీపడి క్షేమైక దృష్టితో కాలం గడపటం మంచిదన్న భావనకు ఆమె వర్తనం సాక్ష్యం. అందుకే ఆరాట సమయంలో కౌసల్యా, దశరథుడు సుమిత్రవద్దనే ఊరట పొందడం జరిగింది. అన్నిటికన్నా మనకు

కన్పించని విశేషం ఆమెకున్న రాజకీయ పరిజ్ఞానం. రాముడు రాజైనా, భర-తుడు భూధవుడైనా లక్ష్మణ శత్రుఘ్నుల మాతగా ఆమెకున్న గౌరవస్థానం చెరిగిపోనిది. రామలక్ష్మణులు, భరతశత్రుఘ్నులు జంటకావటం దైవికమే ఐనా రాజకీయ రక్షణలేదని మాత్రం అనలేం. అంత మేధాశాలిని ఆమె.

ఇక భరతుని తల్లి కైక రామాయణ కథ మలుపు తిప్పటానికే గనుక ఆ పాత్రలోని తాత్కాలిక ఆవేశం, పుత్రవాత్సల్యం ముందుపడి, పతిహితం సమాజ సంక్షేమం రాజనీతిజ్ఞతలు మరుగున పడిపోయాయి.

ఇక మంథర, కర్ణుడు లేని భారతం అని ఎలా అంటున్నామో అలాగే మంథర లేని రామాయణం అక్కడే ఆగిపోయేది. రావణవధే రామాయణ కథాపరమావధి కనుక అందుకు సహకరించిన ఆ పాత్రలో వున్న ఒకటి రెండు మంచిగుణాలు మరుగున పడిపోయాయి.

మన కిష్టమున్నా లేకున్నా మంథర నిష్ఠుర స్వామిభక్తిపరాయణ అని చెప్పవచ్చు. తన స్వామిని కైకేయీ, తన్నందన ప్రాభవ ప్రదర్శన దర్శనలు తప్ప అన్యప్రలోభాలేవీ మంథరకు లేవు. కైకేయి రాజమాత కావాలన్నదే ఆమె తపన. అంత పట్టుదల నిస్స్వార్థ ప్రయత్నం, ఆమె లక్షణాలు. దివ్య కథా నిర్దేశం వేరే విధంగా ఉన్నందువల్ల రాజరికానికి ప్రజామోదం జీవగ్ర అన్న సత్యాన్ని మరచినందుకే నలుగురి నోళ్ళలో నిందకు ప్రతిరూపంగా నానుతూ వచ్చింది. ఒకరకంగా చూస్తే జయాపజయాలతో సంబంధం లేకుండా రణరంగాని కురికే సైనికునిలాంటి పాత్ర ఇది.

సీతా సాధ్విని గూర్చి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. రామాయణ కథే ఆమె కనుక పతిభక్తి, స్వాభిమానం, దీనజన వాత్సల్యం కలబోసి రూపొందిన మూర్తి ఈమె. కాని, రామాయణ కథాకథనం నడపటానికి ఆమె కటుభాషణే కారణమైందన్నది కాదనలేని సత్యం.

ఇక అహల్యా సంక్రందనం స్వేచ్ఛావర్తనమా, విధి నిర్దేశమా -- అన్న వాదోపవాదాలు ఈనాటికీ ఉన్నాయి. పతి విధించిన శిక్ష (శాపాన్ని)ను,

సమాజ తిరస్కారాలను, అవమానాలను ప్రతిస్పందన లేని శిలామయ స్థితిలో రామదర్శన పర్యంతం కాలంగడపటం ఆమె యోగినీతత్త్వానికి ప్రతీక అనవచ్చు.

మంచి తలకెక్కని మగడు, విధివశమైన వీరావేశంతో మటిదిమీద యుద్ధంలో మరణిస్తే, విధివంచితై కూడా తన స్థానాన్ని గౌరవాన్ని నిలుపుకోగలిగిన రాజకీయ విజ్ఞానవణగా తార మనకు రామాయణంలో కన్పిస్తుంది.

మొండికెత్తిన మగడు కొండను ఢీకొన్నట్లు, అప్రతిహత దైవీ శక్తికి యుక్తికి బలి కాబోతుంటే పతిహితాన్ని జనక్షేమాన్ని కోరి అడుగడుగునా నిరోధించ ప్రయత్నించి కడకు కడుపుకోతను మిగుల్చుకున్న మమతామయ మాతృమూర్తిగా మండోదరి మనకు కన్పిస్తుంది.

ఇదంతా రామకథా విశ్లేషణం కాదు. ఒకానొక దివ్య కథావిధానంలో భాగస్వామ్యం వహించిన పాత్రలవలన సమాజానికి, సర్వజనహితాని కుపయోగపడే గుణమణి సంకలనం మాత్రమే.

విశాల వినీల రామకథాసాగరంలో వ్యక్తిత్వ వైచిత్రీరూప తరతమభేదాలతో మథించిన కొద్దీ మనకందే నవరత్న సంఘం ఇది. మనోమందరంతో మథిస్తే ఇన్నేనా ఇంకా ఎన్నో.

సర్వే పశ్యంతు భద్రాణి
సర్వే సంతు నిరామయాః